ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం : fb.com/vaartha

PUBLISHED FROM TADEPALLIGUDEM, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, SRIKAKULAM

20-11-2022 ఆదివారం సంపుటి : 28 సంచిక : 290, పేజీలు : 10+4 వెల : 8.00

24లో అధికారం వైఎస్సార్సీదే: మంత్రి సురేష్ 2లో

ఆప్ మంత్రికి జైల్లో మసాజ్ 5లో



## డిసెంబరు 7 నుంచి
# శీతాకాల పార్లమెంటు
## 29 దాకా సమావేశాలు

**న్యూఢిల్లీ, నవంబరు 19:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు షెడ్యూల్ విడుదలైంది. డిసెంబరు 7వ తేదీ నుంచి శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. డిసెంబరు 7 నుంచి 29వ తేదీ వరకు ఉభయసభల సమావేశాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. శీతాకాల సమావేశాల్లో మొత్తం 17 పనిదినాలు ఉంటాయని చెప్పారు. ఈ సమావేశాల్లో పలు బిల్లులు, అంశాలపై చర్చిస్తామన్నారు. రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్‌ధన్‌కర్ ఎగువ సభలో కార్యకలాపాలను నిర్వహించే మొదటి సెషన్ ఇది కావడం గమనార్హం. కాగా పార్లమెంట్ సమావేశాల కంటే ముందే ఈ నెల 21వ తేదీన ప్రీ బడ్జెట్ సమావేశాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ఈ సమావేశాలను ప్రారంభిస్తారు. 2023,24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ తయారీకి సూచనలు కోరుతూ మంత్రి సమావేశాలు నిర్వహించనున్నారు. పరిశ్రమల చాంబర్లు, మౌలిక సదుపాయాలు, పర్యావరణ రంగం నిపుణులతో దృశ్యమాధ్యమం ద్వారా సమావేశం అవుతారు.

# గ్రామ స్వరాజ్యమే లక్ష్యం

## చివరి లబ్ధిదారునికీ ప్రతి సంక్షేమ కార్యక్రమం అందాలి
## 'గడపగడపకు' కార్యక్రమంలో సూచనలన్నీ అమలు చేయాలి
## గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించాలి: సిఎం జగన్



**విజయవాడ, నవంబరు 19ప్రభాతవార్త ప్రతినిధి:** గ్రామ స్వరాజ్యానికి అర్థం చెప్పే విధంగా తమ ప్రభుత్వ పాలనను అందిస్తుందని సిఎంఎం వైఎస్ జగన్ అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రగతిలో విప్లవాత్మక మార్పు తీసుకుని రావాలన్నది తమ ఉద్దేశంఅన్నారు. అవినీతిలేని, పారదర్శకత ఉన్న ఓ గొప్ప వ్యవస్థను సృష్టించామన్నారు. అర్హులైన అందరికి సంతృప్త స్థాయిలో ప్రభుత్వ పథకాలు, సేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం 40నెలల కాలంలో చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలపై అన్ని ప్రభుత్వశాఖ ఉన్నతాధికారులకు సిఎం జగన్ కీలకాదేశాలు జారీ చేస్తున్నారు. సమాచార శాఖ ద్వారా లభించిన వివరాలను అనుసరించి అధికారులతో ఎప్పటికప్పుడు గడప, గడపకు కార్యక్రమాలపై నివేదికలు తీసుకుంటున్నారు. కీలకంగా ఆయా కుటుంబాలు ప్రత్యేకంగా సూచించిన కార్యక్రమాలను, అవసరతలను సచివాలయం పరిధిలో రూ.20 లక్షల నిధులు కేటాయించినందున తక్షణం పరిష్కరించుకోవాలని ఆదేశిస్తున్నారు. ఈ సందర్భంలో ఆయన అధికారులతో గడప, గడప ద్వారా లభించిన అంశాలపై పూర్తి శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రతి చివరి లబ్దిదారుడికి న్యాయం జరిగే విధంగా విప్లవాత్మక మార్పులు తీసుకుని వచ్చామన్నారు.

రాష్ట్రంలో ఎవ్వరికి అన్యాయం జరుగకూడదనే ఉద్దేశంతో సోషల్ ఆడిట్‌నే ఏర్పాటు చేసామన్నారు. ఏ సంక్షేమ పథకంమైనా ఆ పరిధిలోకి వచ్చే లబ్దిదారుల జాబితాను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నామన్నారు. తద్వారా సామాజిక తనిఖీకి అవకాశం కల్పిస్తున్నామన్నారు. అర్హత ఉండి ఈ సంక్షేమపథకం ప్రయోజనం లభించలేదనే వారు లేకుండా ఈ ప్రక్రియ ద్వారా అవకాశం కల్పిస్తున్నామన్నారు. ప్రతి నెలా ఒకటవ తారీఖున అన్ని రకాల పెన్షను కానుకలు ఇంటి వద్దకే అందిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రణాళిక(మేనిఫెస్టో)లో వాగ్దానాలన్నింటిని దాదాపు ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రాగలిగామన్నారు. 81వేల మంది, చేనేత కార్మికులకు రూ.24 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. 82లక్షలమంది విద్యార్థులకు చేయూతగా 43లక్షల మంది తల్లులకుఅమ్మఒడి పథకం వారిబ్యాంకు ఖాతాల్లో రూ.15వేలు చొప్పున జమచేసామన్నారు. విద్యా దీవెన కార్యక్రమం కింద రూ.నాలుగు వేలకోట్ల మొత్తాన్ని ఫీజు రీఎంబర్సుమెంటుగా జమచేసామన్నారు. వాహనమిత్ర, రైతుభరోసా, పింఛను కానుక, సున్నావడ్డీ, లా నేస్తం, నేతన్ననేస్తం, మత్స్యకార భరోసా, అమ్మఒడి, ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, వసతి దీవెన, విద్యాదీవెన, చోదుడు, కాపు నేస్తం, గోరుముద్ద, 30లక్షల పట్టాలు, కంటివెలుగు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆస్పత్రుల్లోను "నాడు, నేడు" ఏ ప్రభుత్వ పథకాన్ని ≫2



కనువిందు చేసిన కార్ల రేసింగ్ 2లో

# '3 రాజధానులు ఇక తథ్యం'

**విజయవాడ, నవంబరు 19, ప్రభాతవార్తప్రతినిధి:** శాస్త్రీయ విధానంతోనే పరిపాలన వికేంద్రీకరణ అమలు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. మూడు రాజధానులు ఎపి ప్రభుత్వ అభిమతం అని స్పష్టం చేసారు. ఈ నినాదంతోనే వచ్చే ఎన్నికలకు వెళ్తామన్నారు. ఆదాయం అంతా ఒకే చోట కేంద్రీకృతం కావడం సరికాదని తాము భావిస్తున్నట్లు తెలిపారు వికేంద్రీకరణ ఎందుకు అవసరమో ప్రజలకు వివరంగా స్పష్టంగా చెబుతున్నామన్నారు.

శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వికేంద్రీకరణ, తదనుగుణ పాలనాభివృద్ధిపై తమకు స్పష్టత ఉందన్నారు. వికేంద్రీకరణకు సంబంధించి తమ ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉందన్నారు. అమరావతిలోనూ రాజధాని ఎందుకు ఉండాలో చంద్రబాబు ఎందుకు సమాధానం చెప్పలేక పోతున్నారని ప్రశ్నించారు. చంద్రబాబుకు మళ్లీ అధికారంలోకి వస్తాననే ఆశ సన్నగిల్లిందన్నారు. అందుకే ఎక్కడ బడితే అక్కడ ఆవేశంతో ఊగిపోతున్నారన్నారు. చంద్రబాబు తీవ్ర నిస్పృహాతో ఉన్నారన్నారు. న్యాయ రాజధానిపై వైఖరి అడిగితే సమాధానం చెప్పాలన్నారు. అంతేగాని స్థానిక ప్రజలను బెదిరిస్తూ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

కర్నూలు వెళ్లినప్పుడు న్యాయరాజధానిపై ప్రజలు నిలదీయారా, ప్రజలు అడిగితే సమాధానం చెప్పకుండా బెదిరిస్తారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు మాటలతో టిడిపి అంటే తిట్లు, దూషణలు, బూతుల పార్టీ అని మరో సారి రుజువైందన్నారు, అన్ని చిట్‌ఫండ్స్ మాదిరిగానే మార్గదర్శిలో తనిఖీలు చేస్తే కక్ష సాధింపు అని గగ్గోలుపెడుతున్నారన్నారు. డిపాజిట్లు తీసుకుని డైవర్ట్ చేసినట్లు ఫిర్యాదులు వస్తే తనిఖీలు చేయొద్దా? మీరు ఏం చేసినా ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. చంద్రబాబును ప్రజలు వచ్చే ఎన్నికల అనంతరం ఇంటికే పరిమితం చేస్తారన్నారు.



## పిఎస్ఎల్‌వి సి-54
# 26న నింగిలోకి
## 9 ఉపగ్రహాలతో ప్రయోగం
### వీక్షకుల గ్యాలరీకి అనుమతి

**శ్రీహరికోట (తడ), నవంబరు 19 ప్రభాతవార్త:** శ్రీహరికోట నుంచి ఈ నెల 26న పిఎస్ఎల్‌విసి-54 రాకెట్ ప్రయోగానికి తుది ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక ప్రైవేటు రాకెట్ ప్రయోగం తర్వాత ఆ వెంటనే ఇస్రో పిఎస్ఎల్‌వి రాకెట్ ప్రయోగాన్ని చేపట్టింది. శ్రీహరికోటలోని ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి 26న మధ్యాహ్నం 11.56 గంటలకు ఈ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. భారతీయ భూపరిశీలన ఉపగ్రహం ఇఒఎస్-06 ఇందులో ప్రధాన శాటిలైట్. దీనితోపాటు ఇండియా, భూటాన్ సంయుక్తంగా రూపొందించిన అకా ఐఎన్ఎస్-2బి ≫2

## రాష్ట్రానికి
# 'ఇదేం ఖర్మ'!



## ప్రారంభించిన చంద్రబాబు నాయుడు
### టిడిపి కార్యాలయంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం

**మంగళగిరి, నవంబరు 19, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ రివర్స్ పాలనపై టిడిపి చేపట్టనున్న ఇదేం ఖర్మ అనే కార్యక్రమాన్ని టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. శనివారం టిడిపి రాష్ట్ర కార్యాలయంలో తెలుగు దేశంపార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రసంగించారు.

తెలుగుదేశం జాతీయ భావాలతో పనిచేసిన పార్టీ దేశంలో అనేక సంస్కరణల్లో టిడిపి భాగస్వామిగా ఉందన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ఎంత బాధ్యతగా ఉన్నామో.. ప్రతిపక్షంలోనూ అంతే బాధ్యతగా ఉండి సేవ చేసే పార్టీ తెలుగుదేశం పార్టీ అనిచెప్పారు. 1978లో నేను మొదటిసారి ఎమ్మెల్యేను అయ్యాను అనేక మంది ముఖ్యమంత్రులను చూశానని, జగన్ ఇటువంటి సీఎంను చూడలేదని విమర్శించారు.

మూడున్నరేళ్లక్రితం అచ్చెన్నాయుడుతో మొదలు సోషల్ మీడియా కార్యకర్తల వరకు అందర్ని వేధించారని అన్నారు. కర్నూలును మెగాసిటీ చేస్తామన్నారు. విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాం అని స్పష్టంగా చెప్పాం అన్నారు. కేసుల నుంచి జగన్ తప్పించుకోలేడు అని సుప్రీం కోర్టుచెప్పిందని తప్పుచేసిన జగన్ ఎప్పటికైనా శిక్ష నుంచి తప్పించుకోలేడన్నారు. రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోతున్నాయి. వైఎస్సార్సీ ఎమ్మెల్యేల నుంచి సిఎం వరకు పరిశ్రమల నుంచి వాటాలకోసం ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. మైనార్టీ బిసి ఎస్సీ, ఎస్టీ వర్గాలను దారుణంగా దెబ్బతీశారని చెప్పారు. తెలుగుదేశం పార్టీకి వెన్నెముకగా ఉంది వెనుకబడిన వర్గాలేనన్నారు. కేంద్రంలో ఎర్రం నాయుడుకు క్యాబినెట్ పదవిఇచ్చి గౌరవించామని గుర్తు చేశారు. పేదవాళ్లకు ఇంటిపేరుతో కూడా ఈ ప్రభుత్వం రూ.6వేల కోట్ల అవినీతికి పాల్పడిందన్నారు.

ఇదేం ఖర్మ రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలి. సీఎం కటౌట్‌కు ఉన్న ప్రాధాన్యం ప్రజల ప్రాణాలకు ఇవ్వడం లేదు ఇదేం ఖర్మ? అని వ్యాఖ్యానించారు. ఓటుకు వైసీపీ వాళ్ళు రూ.10 వేలు ఇచ్చినా... అవినీతి పోలీసు లున్నా మనం గట్టిగా ఎదుర్కోవాలని, దానికి ఇప్పటి నుంచే మనం సిద్ధంఅవ్వాలి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకొని నిర్వహించాలన్నారు.

## తెలుగు భాషాభ్యున్నతికి సంస్కరణలు తప్పనిసరి
### అధికార భాషాసంఘం అధ్యక్షుడు విజయ్‌బాబు 6లో



## తిరుమలకొండల్లో భారీగా
# ఎర్రచందనం పట్టివేత
### 9 మంది అరెస్టు

**తిరుమల, నవంబరు 19ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయంగా ఎంతో విలువైన శేషాచలం కొండల్లో నెలవైన ఎర్రచందనం వృక్షాలను నరికి అక్రమంగా దుంగలను తరలించేస్తున్నారు. స్మగ్లర్ల కట్టడికి ఓ వైపు అటవీశాఖ, పోలీసు టాస్క్‌ఫోర్స్ వ్యూహాత్మకంగా చర్యలు తీసుకుంటున్నా స్మగ్లర్లు తమదైన శైలిలో ఎర్రచందనం తరలించేస్తున్నారు. శనివారంఉదయం తిరుమలఅడవుల్లో ఎర్రచందనం వృక్షాలను నరికి దుంగలను తరలిస్తున్న 9మంది నిందితులను అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారినుంచి 85 ఎర్రచందనం దుంగలు, 4 ద్విచక్రవాహనాలు, అశోక్‌లేల్యాండ్ గూడ్స్‌వాహనం స్వాధీనంచేసుకున్నారు. ఈ వివరాలను అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ ఎస్‌పి మేడా సుందరరావు మీడియాకు వెల్లడించారు. కర్నూలు రేంజి డిఐజి సెంధిల్‌కుమార్ ఆదేశాలతో అందిన సమాచారంతో అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ ఆర్‌ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, సిఐ రామకృష్ణ ≫2

# స్వచ్ఛ సంకల్ప్, క్లాప్ భేష్
### •ప్రశంసలు కురిపించిన ఎన్జీటి •పెనాల్టీ నుంచి మినహాయింపు




**విజయవాడ, నవంబరు 19, ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్జీటీ ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్వచ్ఛా సంకల్ప, క్లాప్ కార్యక్రమ నిర్వాహణ పట్ల ప్రశంసలు కురిపించింది. చెత్త నియంత్రణల అంశాలల్లో ఎపి తీసుకుంటున్న కార్యచరణ పట్ల అభినందనలు తెలుపుతూ పెనాల్టీ నుంచి భారీ మినహాయింపును ఇచ్చింది. జగనన్న స్వచ్ఛ సంకల్పం అమలుతో ఈ అరుదైన అవకాశం రాష్ట్రానికి దక్కింది. అయిదు రాష్ట్రాలకు వేల కోట్ల జరిమానా విధించిన నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఎపిలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ కాన్సెప్ట్‌వల్ల ఎటువంటి జరిమానావిధించకపోగా సంతృప్తి చెందింది. ఎన్జీటీ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యర్థాల నిర్వహణపై సరైన చర్యలు తీసుకుంటున్న విధానాల పట్ల అభినందనలు తెలిపింది. వ్యర్ధాల నిర్వాహణ సరిగ్గా పాటించని తెలంగాణాకు రూ.3,800కోట్ల్, పశ్చిమబెంగాల్‌కి రూ.మూడు వేల కోట్లు, మహారాష్ట్రకు రూ.12కోట్లు, రాజస్థాన్‌కి రూ.3వేల కోట్లు, కర్ణాటకకు రూ.2,900 కోట్లు ఎన్‌జిటీ జరిమానా విధించింది. ఏపీ ప్రభుత్వానికి ఎన్జీటీ గతంలో నోటీసులు జారీచేసింది. అయితే రాష్ట్రప్రభుత్వం ఘన, ద్రవ వ్యర్థాలు, మురుగు నీటి నిర్వహణపై తీసుకుంటున్న చర్యలను పరిశీలించిన కమీషన్ సంతృప్తిని వ్యక్తంచేసింది. రాష్ట్రంలో ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించాలనే లక్ష్య సిద్ధితో సిఎం జగన్ ఉన్నారు. నగరాల్లో, పట్టణాల్లో. జగనన్న స్వచ్ఛా సంకల్పం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆయన నేరుగా ఈ వ్యవహారంలో అధికారులకు మార్గదర్శనం చేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలను, నగరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు బిన్ ఫ్రీ, లిట్టర్ ఫ్రీ, గార్బైజ్ ఫ్రీ అభివృద్ధిపర్చడమే ప్రభుత్వంలక్ష్యంగా పెట్టుకుంది. తడి, పొడి, ప్రమాదకరమైన వ్యర్ధాలను వేరు చేసిందుకు వీలుగా ఇంటికి మూడు చొప్పున 1.21 కోట్ల డస్ట్‌బిన్‌లను పంపిణీ చేసింది. అంతే కాకుండా పొడిచెత్త నుండి హానికర వ్యర్ధాలను వేరు చేసేందుకు చర్యలు తీసుకుంది. తిరిగి ఉపయోగించ దగిన వస్తువులను వినియోగం తీసుకుని వచ్చే ప్రక్రియలను చేపట్టింది. జీపీఎస్ ట్రాపింగ్‌తో కూడిన 2,737 గార్బేజ్ ఆటో టిప్పర్లు, 287 ఈ- ఆటోలు, 880 ట్రక్కులు టిప్పర్లు, ట్రాక్టర్లు 480 కంపాక్టర్లును వినియోగిస్తున్నారు. చెత్తను తాత్కాలికంగా నిల్వచేసే ప్రాసెసింగ ప్లాంట్లకు చేర్చే ప్రక్రియలో భాగంగా 123 గార్భేజ ట్రాన్‌ఫర్ స్టేషన్లు(జీటీఎస్)ను ఏర్పాటు చేసారు. దీంతో పురపాలక సంఘాల్లో రోజుకు 6,890 టన్నుల ఘనవ్యర్ధాలను, 86 లక్షల మెట్రిక్ టన్నుల ప్రమాదకర వ్యర్ధాలను, 150 మిలియన్ లీటర్ల ద్రవ వ్యర్ధాలను ప్రాసెసింగ్ చేస్తున్నారు. ఇవ్వన్నింటిని గమనించిన ఎన్జీటీ ఏమీ విధానాలను ప్రశంసించింది.

## ప్రపంచంలో ప్రతి దేశానికి ఉగ్ర ముప్పు
### - కేంద్ర హోంమంత్రి అమిత్‌షా 5లో




## మర్రి శశిధర్ రెడ్డిపై తెలంగాణ కాంగ్రెస్ వేటు
### ఆరేళ్లు పార్టీనుంచి బహిష్కరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 19:** సీనియర్ కాంగ్రెస్ నేత మర్రి శశిధర్‌రెడ్డిపై పిసిసి క్రమశిక్షణా సంఘం చర్యలు తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఆరేళ్ల పాటు మర్రి శశిధర్‌రెడ్డిని బహిష్కరించారు. రాష్ట్ర బిజెపి నేతలతో కలిసి మర్రి శశిధర్‌రెడ్డి కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షాను కలవటంతో కాంగ్రెస్ చర్యలు తీసుకుంది. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతుండటంతో కాంగ్రెస్ చర్యలు తీసుకుంది. శుక్రవారంనాడు శశిధర్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిశారు. పార్టీ మార్పుపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని ఆయనతో చెప్పినట్లు తెలిసింది. సహచరులతో చర్చించి మరో వారం రోజుల్లో ఆయన బిజెపిలో చేరనున్నారని సమాచారం. మరోవైపు మర్రి శశిధర్‌రెడ్డి తన ట్విట్టర్ హ్యాండిల్‌లో ఆల్వేస్ కాంగ్రెస్ మ్యాన్ అనే పదాన్ని తొలగించారు. దీంతో మర్రి శశిధర్‌రెడ్డి పార్టీ మారతారన్న ఊహాగానాలకు మరింత బలం చేకూరినట్లయింది. రెండు, మూడు రోజుల్లో మర్రి శశిధర్‌రెడ్డి రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది.

# తెలుగు తెరపై మరో కన్నడ బ్యూటీ!



తెలుగు తెరకి ఒకప్పుడు బాలీవుడ్ నుంచి, మలయాళం నుంచి ఎక్కువ మంది కథానాయికలు పరిచయమవుతుండే వారు. ఆ తరువాత కాలంలో బాలీవుడ్ నుంచి జోరు తగ్గినా మలయాళ భాష నుంచి కొత్త భామల సందడి కొనసాగుతూనే ఉంది. ఇక ఈ మధ్య కాలంలో కన్నడ నుంచి కూడా టాలీవుడ్ వైపు వచ్చే బ్యూటీల జోరు పెరుగుతోంది. ఆ కోవలో ఇప్పుడు కన్నడ నుంచి టాలీవుడ్‌లోకి ప్రవేశిస్తున్న మరో అందాల భామ ఆషిక రంగనాథ్. కల్యాణ్‌రామ్ తాజా చిత్రం ద్వారా ఈ సుందరి తెలుగు ప్రేక్షకులను పలకరించనుంది. కల్యాణ్ రామ్ హీరోగా రాజేంద్ర రెడ్డి ఒక సినిమాను రూపొందిస్తున్నాడు. ఈ సినిమాకి 'అమిగోస్' అనే టైటిల్ ఖరారు చేసారు. మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మిస్తున్న ఈ సినిమాలో కథానాయికగా ఆషిక రంగనాథ్‌ను తీసుకున్నారు. 2016లో కన్నడ సినిమాతో తన ప్రయాణం ప్రారంభించిన ఆషిక ఇంతవరకు పది సినిమాల వరకు చేసింది. కల్యాణరామ్ ఈ సినిమాలో మూడు విభిన్నమైన పాత్రల్లో కనిపించనున్నాడు. ఆషిక కూడా గ్లామరస్ హీరోయిన్ కావడం వల్ల ఆమె ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచే అవకాశాలున్నాయి.



## తారాతీరం

# షూటింగ్ దశలో 'ఆర్‌సి 15'

మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ కథానాయకుడుగా శంకర్ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. టైటిల్ ఇంకా ఖరారు కాని ఈ చిత్రం ఆర్‌సి15 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోంది. ప్రముఖ టాలీవుడ్ నిర్మాత దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ చిత్రంలోని పాటల కోసం మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలుస్తోంది. న్యూజిలాండ్‌లో ఒక ప్రత్యేక సాంగ్‌ను చిత్రీకరించనున్నారు. త్వరలో పాటల చిత్రీకరణ మొదలు కానున్నట్లు వినికిడి. ఇందులో మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ జోడీగా కియారా అద్వానీ నటిస్తోంది.



ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
20 నవంబరు, 2022

## మంచి ముత్యాలు

బాధలన్నింటి వెనుక నిక్షిప్తంగా ఆధ్యాత్మిక ఆశీస్సులు అణిగి ఉంటాయి.

- స్వామి చిన్మయానంద

## విషయ విశేషం

రాజీవ్ హత్యకేసులో దోషులకు విముక్తి... 4
'సంఘీ'భావం....5
ఆందోళనకరంగా ఎన్నికల ఖర్చు
తిరుపతి వాసి ధర్మకీర్తి...6
కవర్ స్టోరీ..8
నట శిఖరం
కొరవడిన మహిళల భద్రత...14
ఇక్కడ సూర్యుడు అస్తమించడు..18
కథ.. 20
మా నాన్న నాకు యాబై వేలిచ్చాడు
సాహిత్యం.. 23
కాల్మొక్కని తూటా-పాటకు పట్టాభిషేకం
ఈవారం కవిత్వం..24
టెక్స్ట్ మెసేజెస్
దాగూరు హైకూల సంపుటి..26
సుందర మందిరం... 30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
సరదాగా కాసేపు..
వగైరా..వగైరా..




## తాజా వార్తలు

### పంటల్లోనూ కెమికల్స్

పీఎఫ్ఏ (పర్-అండ్-పాలీఫ్లోరో ఆల్కైల్) రసాయనాల వాడకం రోజు రోజుకీ పెరగడంతో ప్రపంచ వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లోనూ వీటి జాడ కనిపిస్తోంది. ముఖ్యంగా తడి పీల్చని దుస్తులు, నాన్‌స్టిక్ వంట సామగ్రి, కాస్మెటిక్స్‌తో పాటు, నూనె, నీళ్లు, గ్రీజు అంటనివ్వని అనేక వస్తువుల తయారీలో సుమారు ఐదు వేలకు పైగా ఈ ఫరెవర్ కెమికల్స్‌ను వాడుతున్నారు. ఇవి గాల్లో కలిసి వర్షపునీటి ద్వారా నేలలోకి చేరుతున్నాయి. ముఖ్యంగా ఫ్యాక్టరీల నుంచి విడుదలయ్యే కలుషిత జలాల్లో వీటి శాతం మరీ ఎక్కువ. అయితే ఆ నీరు వృధా కాకుండా ఉండేందుకు శుద్ధి చేసి మళ్లీ వాడుతున్నారు. అయినప్పటికీ వాటిల్లో ఈ రసాయనాలు మిగిలి వుండడంతో వాటి దుష్పలితాలు పర్యావరణం, మానవాళి ఆరోగ్యం, పిల్లల ఎదుగుదల మీదా ఉంటుందని చెబుతున్నారు. అంతేకాదు, కేన్సర్లు, కొలెస్ట్రాల్, మహిళల్లో సంతానహీనత, రోగనిరోధక శక్తి తగ్గడం.. వంటి అనేక సమస్యలకు ఇవే కారణమంటున్నారు. ముఖ్యంగా శుద్ధి చేసిన కలుషిత జలాల్ని పంట పొలాలకు వాడటంతో ఆ పంటల్లోనూ ఈ రసాయనాలు ఉంటున్నాయట ఆయా పంటల్నీ, గడ్డినీ తినడం వల్ల అటు జంతువులకీ త్వారా మనిషి ఆరోగ్యానికీ ఇవి ప్రమాదకరంగా పరిణమిస్తున్నందువల్ల ఇప్పటికైనా వీటి వాడకం మీద నిషేధం విధించాలని అంటోంది శాస్త్ర ప్రపంచం.

**పిల్స్ వాడకపోవడమే మేలు...**

గర్భం రాకుండా ఉండేందుకు కొందరు అమ్మాయిలు గర్భనిరోధక మాత్రలు వాడుతుంటారు. అయితే ఈ రకమైన ట్యాబ్లెట్లు ఊబకాయులకి అస్సలు మంచిది కాదంటున్నారు యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీకి చెందిన నిపుణులు. వీటిల్లోని ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిన్ వంటి హార్మోన్ల కారణంగా రక్తనాళాల్లో గడ్డలు కట్టే ప్రమాదం మిగిలిన వాళ్లకన్నా అనేక రెట్లు ఎక్కువగా ఉంటున్నట్లు గుర్తించారట. దీన్నే వీనస్ థ్రాంబో ఎంబొలిజమ్(వీటీఈ) అని పిలుస్తారు. అందుకే ఊబకాయులు ఈస్ట్రోజెన్ లేకుండా కేవలం ప్రొజెస్టిన్ ఉన్న పిల్స్‌నీ, గర్భాశయంలో అమర్చే లూప్ వంటి వాటినీ వాడుకోవడమే ఉత్తమం అంటున్నారు. గత నలభయ్యేళ్లలో ఊబకాయుల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతూనే ఉంది. నలభయ్యేళ్లలోపు మహిళల్లో 15 శాతం మంది అధిక బరువుతో బాదపడుతున్నారు. రక్తనాళాల్లో ఇలా గడ్డలు ఏర్పడటం వల్ల ఊపిరితిత్తులకు రక్త సరఫరా అందకపోతే మరణానికీ దారి తీయవచ్చు.

# రాజీవ్ హత్యకేసులో దోషులకు విముక్తి



భారతదేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ హత్యకేసులో ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెల్లడించింది. ఈ కేసులో జీవితఖైదు శిక్షను అనుభవిస్తున్న ఆరుగురిని విడుదల చేస్తూ కోర్టు తీర్పు చెప్పింది. నళిని శ్రీహరన్, రవిచంద్రన్, రాబర్ట్, జయకుమార్, మురుగన్, శాంతన్‌లు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు.

వారి శిక్షను తగ్గించాలని తమిళనాడు ప్రభుత్వం ఫార్సు చేసిన సంగతిని గుర్తు చేసింది. కారాగారంలో వీరందరి ప్రవర్తన సంతృప్తికరంగా ఉన్నట్లు తెలిపింది. ఇదే కేసులో 30 ఏళ్లకు పైగా జైలుశిక్ష అనుభవించిన పేరరివాలన్ విడుదలకు రాజ్యాంగంలోని 142వ అధికరణం కింద దాఖలు పడిన అసాధారణ అధికారాలను ఉపయోగించుకుంటూ సర్వోన్నత న్యాయ స్థానం ఈ ఏడాది మే 18న ఆదేశాలు జారీ చేసింది. అదే తీర్పు మిగతా ఆరుగురు దోషులకూ వర్తిస్తుందని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ బి.వి.నాగరత్నల ధర్మాసనం తాజాగా స్పష్టం చేసింది. ఈ తీర్పు నేపథ్యంలో నళినితో పాటు ఆమె భర్త వి.శ్రీహరన్ అలియాస్ మురుగన్, రవిచంద్రన్, సంథన్, రాబర్ట్ ఫ్రాయస్, జయకుమార్ జైలు నుంచి విడుదల కానున్నారు. మురుగన్, శాంతన్, రాబర్ట్, జయకుమార్ శ్రీలంక దేశస్థులు. "భారత శిక్షాస్మృతి (ఐపీసీ)లోని సెక్షన్-302 కింద దోషిగా తేలిన వ్యక్తికి శిక్ష తగ్గించే విషయంలో రాష్ట్ర మంత్రి మండలి సిఫార్సుకు గవర్నర్ కట్టుబడి ఉండాలి. ప్రస్తుత కేసులో దోషుల శిక్ష తగ్గింపునకు కేబినెట్ తీర్మానం చేసిందన్నది నిర్వివాదాంశం. కాబట్టి పేరరివాళన్ విడుదలకు ఆదేశించడాన్ని పరిగణనలోకి తీసుకున్న అంశాలన్నీ ఈ కేసులోని దరఖాస్తుదారులకు కూడా సమానంగా వర్తిస్తాయి. 'వారందరూ తమ నేరానికి ఇప్పటికే శిక్ష అనుభవించినట్లు మేం భావిస్తున్నాం. మరే ఇతర కేసులోనూ వారికి శిక్ష అవసరం లేకపోతే దోషులందర్నీ విడుదల చేయాలని ఆదేశిస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. నళిని, రవిచంద్రన్‌లను ముందస్తుగా విడుదల చేయాలని తమిళనాడు సర్కారు గతంలో అభిప్రాయపడింది. వారి శిక్ష తగ్గింపునకు తాము చేసిన సిఫార్సును గవర్నర్ తన వద్దే పెండింగ్‌లో ఉంచారని తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో రెండు ప్రమాణ పత్రాలు సమర్పించింది.



శ్రీపెరంబుదూర్‌లో 1991 మే 21న ఎన్నికల ప్రచార సభలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ మానవబాంబుతో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో 26 మందికి పూందమల్లిలోని తడా ప్రత్యేక కోర్టు 1998 జనవరి 28న ఉరిశిక్ష విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అప్పీల్ చేయగా పేరరివాళన్, నళిని, మురుగన్, శాంతన్‌లకు ఉరిశిక్షను సుప్రీంకోర్టు సమర్థించింది. రవిచంద్రన్, జయకుమార్, రాబర్ట్ ఫయాజ్‌లకు జీవితఖైదుగా శిక్షను తగ్గించింది. ఒకరిని విడుదల చేయగా మిగతావారు జైలులో ఉన్న కాలాన్ని శిక్షా కాలంగా పరిగణించి విడుదల చేసింది. నళినికి మరణశిక్షను 2000లో జీవితఖైదుగా కోర్టు తగ్గించింది. వారిని విడుదల చేయాలని నాటి అన్నాడీఎంకే ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించి, గవర్నర్‌కు పంపింది. దీనిపై గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వ తీర్మానాన్ని ఉటంకిస్తూ తమను విడుదల చేయాలంటూ హైకోర్టులో దోషులు వ్యాజ్యం వేశారు. సుప్రీంకోర్టును ఆశ్రయించాలని హైకోర్టు దానిని తోసి పుచ్చింది. తొలుత 2016లో సుప్రీంకోర్టులో పేరరివాళన్ తరపున అప్పీల్ దాఖలైంది. దానిపై ఈ ఏడాది మే 18న తీర్పు వెలువడింది. 30 ఏళ్లకు పైగా జైలులో ఉన్న ఆయన్ను విడుదల చేస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. తమను కూడా విడుదల చేయాలంటూ నళిని, రవిచంద్రన్ వేర్వేరుగా అప్పీల్ చేశారు. అప్పటివరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరారు. దానిపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. ప్రత్యేక అధికారాలను ఉపయోగించి పేరరివాళన్‌ను విడుదల చేసినట్టు, మిగతా వారూ అర్హులని తన తీర్పులో వెల్లడించింది. ప్రస్తుతం విడుదల కానున్న ఆరుగురిలో నళిని, ఆమె భర్త శ్రీహరన్ అలియాస్ మురుగన్, శాంతన్, రాబర్ట్ ఫయాజ్, జయకుమార్‌లు శ్రీలంకకు చెందినవారు.



రాజీవ్‌గాంధీ హత్య కేసులో దోషిగా మూడుదశాబ్దాలకుపైగా జైలుశిక్ష అనుభవించిన 53 ఏళ్ల నళిని జీవితం ఆద్యంతం మలుపులతో కూడుకున్నది. చెన్నైలోని యతిరాజ్ కాలేజీలో బిఎ చేసిన నళిని మురుగన్‌తో పరిచయమై, పెళ్లి చేసుకున్నారు.

ఈ కేసులో ఆమెకు సంబంధం ఉందని 1991 జూన్ 14వ తేదీన ప్రత్యేక దర్యాప్తు బృందం ఆమెను అరెస్టు చేశారు. జైల్లోనే నళిని ఆడబిడ్డకు జన్మనించింది. ఆమె పేరు హరిత. కాగా హరిత లండన్‌లో మెడిసిన్ చదివి, డాక్టర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. నళిని జైల్లో ఉండి కంప్యూటర్ అప్లికేషన్స్‌లో పిజి చేసింది. ❑

'సంఘీ' భావం



# ఆందోళనకరంగా ఎన్నికల ఖర్చు

ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థ లక్ష్యాలకు విరుద్ధంగా మారుతున్నాయి. అభివృద్ధి, విశ్వసనీయత, సిద్ధాంతాలు వంటి అంశాలను పక్కనపెట్టి ఓటర్లను ఏ విధంగా మభ్యపెట్టి లోబరుచుకుని విజయం సాధించాలన్న విధానాలకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనితో ఎన్నికల లక్ష్యానికి గండి పడుతోంది. ఎన్నికల్లో కేవలం కోటీశ్వరులు, బడాబాబులు, నేరస్థులు, స్వార్థపరులకు అవకాశాలు లభిసున్నాయి. నిజాయితీతో, అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఎన్నికలకు సిద్ధపడే వారి సంఖ్య క్రమంగా మరుగున పడిపోతోంది. దేశంలోని దాదాపు అన్ని పార్టీలు, అభ్యర్థులు ప్రలోభాల బాటనే ఎంచుకుంటున్నారు. దీనికి అనుగుణంగా ఓటర్లు కూడా తమకు ఏ పార్టీ, ఏ అభ్యర్థి ఎంతమేరకు ముట్టజెబుతున్నాడన్న విషయంపైనే దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా ఇటీవల జరిగిన హుజురాబాద్, మునుగోడు ఉప ఎన్నికలు ఎన్నికల వ్యయం స్థాయిని గరిష్టానికి తీసుకువెళ్లగలిగాయి. కేవలం రెండున్నర లక్షల మంది ఓటర్లు కూడా లేని మునుగోడులో ఖర్చులు ఆరు వందల కోట్ల రూపాయలు దాటిందంటే పరిస్థితి ఏమేరకు దిగజారిపోతోందో అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల వాతావారణం ప్రారంభమైనప్పటి నుంచి ఇక్కడ డబ్బు సంచులు, మద్యం డబ్బాలు కుప్పలుకుప్పలుగా రావడం ప్రారంభమయ్యాయి. చాలా మంది ఓటర్లు నెల రోజుల పాటు విలాసవంతమైన జీవనాన్ని కొనసాగించారు. రికార్డు స్థాయిలో మద్యం విక్రయం అయ్యింది. ఇక కోడి, మేకమాంసం మినహా వేరే ఆహారాన్ని తీసుకోవాల్సి న అవసరం ఓటర్లకు కలగలేదు. కొన్ని కుటుంబాలకు సుమారు 30 నుంచి 50 వేల రూపాయల వరకు డబ్బు చేరింది. మరికొంత మందిని విహారయాత్రల పేరుతో దూర ప్రాంతాలకు తీసుకువెళ్లి ఓట్లకు గాలం వేశారు. ఇది ఒక్క మునుగోడులోనే కాదు గత రెండు దశాబ్దాలుగా ఎన్నికల వ్యయాన్ని పరిశీలిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ ఎక్కడికి పోతోందో అన్న భయాందోళనలు కలుగుతున్నాయి. ఇకపై ఎన్నికల్లో పోటీ చేయాలంటే కనీసం వంద కోట్ల రూపాయలు అవసరమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కాలంలో ఎన్నికల వ్యూహకర్తలు రంగంలోకి దిగిన తరువాత పరిస్థితి మరింత దిగజారింది. గతంలో ఓట్లను సాధించి విజయం పొందాలనుకునే వారు తాము చేసే అభివృద్ధి కార్యక్రమాలు వివరించి ఓటర్లను ఆకట్టుకునే వారు. స్థానిక పెద్దలతో నాలు గైదు సమావేశాలు ఏర్పాటుచేసి వారి భోజనాలు వడ్డించేవారు. దానికే చాలా ఖర్చు చేసినట్లు ప్రచారం జరిగేది. 1951లో ఎన్నిక లు జరిగే సమయంలో పెద్ద రాష్ట్రాల్లో ఎంపి అభ్యర్థులు 25 వేలు, చిన్న రాష్ట్రాల్లో వారు పది వేలకు మించి ఖర్చు చేయకూడదని నిబంధన విధించారు. అయితే ఇది చాలా పెద్దమొత్తమని దీనివల్ల నిజమైన ప్రజా సేవకులు ఎన్నికలకు దూరం అవుతున్నారని భావించి 1962లో గరిష్టంగా పదివేలు మాత్రమే ఖర్చు చేయాలని ఉత్తరులు జారీ చేశారు. మళ్లీ 1967 ఎన్నికల నాటికి 25 వేలకు పెంచారు. అలా పెరుగుతూ వచ్చి ప్రస్తుతం పెద్ద రాష్ట్రాల్లో అభ్యర్థులు 70 లక్షలు, చిన్న రాష్ట్రాల్లో అభ్యర్థులు 54 లక్షలు ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఇవి ఎన్నికల సంఘానికి అభ్యర్థి వివరించే లెక్కలు. పరిధి దాటి ఖర్చు చేస్తే సదరు అభ్యర్థి విజయం సాధించినా, పరాజయం పొందినా శిక్షార్హుడుగా నిర్ణయిస్తారు. భవిష్యత్తులో ఎన్నికల్లో పాల్గొనే అవకాశం లేకుండా నిషేధం విధిస్తారు. వాస్తవానికి ఈ లెక్కలకు మించి అభ్యర్థులు ఖర్చు చేస్తున్నారు. ఉదాహారణకు మునుగోడు ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి 40 లక్షలు మించి ఖర్చు చేయకూడదు. అయితే కొందరు అభ్యర్థులు రోజుకు రెండు కోట్ల రూపాయల వరకు ఖర్చు చేశారు. గరిష్టంగా వంద కోట్ల రూపాయల వరకు అభ్యర్థులు ఖర్చు చేయాల్సి న వచ్చింది. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే ఎన్నికల్లో ప్రతి అభ్యర్థి కనీసం వంద నుంచి 120 కోట్లు ఖర్చు చేయాల్సి న పరిస్థితి నెలకొంది. ఒక పోటాపోటీ, అన్‌రిజర్వ్‌డ్ స్థానాల్లో అయితే మరింత ఎక్కువ ఖర్చు చేయాల్సి న పరిస్థితి నెలకొంది. ఈ విధానం వల్ల ఓటర్లకు తాత్కాలికంగా వ్యక్తిగత ప్రయోజనం కలుగుతుంది. అయితే స్థానిక అభివృద్ధి కుంటుపడు తుంది. అభ్యర్థి ఇచ్చే 2 వేలు, 10 వేలకు ఆశపడితే గెలిపిస్తే ఐదేళ్ల పాటు అతనిని ప్రశ్నించే అవకాశాన్ని ఓటర్లు కోల్పోతారు. అదేవిధంగా వంద కోట్లు ఖర్చు పెట్టి గెలిచిన అభ్యర్థి తిరిగి అంతకు రెట్టింపు ఎలా సంపాదించుకోవాలన్న అంశంపైనే దృష్టిసారిస్తాడు. స్థానిక అభివృద్ధి పట్ల ఏమాత్రం శ్రద్ధ ఉండదు. అదేవిధంగా తన పరిధిలో ఏ కార్యక్రమం జరిగినా తన వాటా కోసం పట్టుపడతాడు. కమీషన్ తీసుకున్నందున సదరు ప్రజాప్రతినిధి నాణ్యతపై ప్రశ్నించే అవకాశం ఉండదు. దీనితో కనీసం సంవత్సర కాలం ఉండాల్సి న రోడ్డు నాలుగైదు నెలలు దాటగానే గుంతల మయంగా మారిపోతోంది. ఇలా అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు దెబ్బతింటాయి. కొన్ని పనులను చేయకుండానే రికార్డుల్లో చూపించి డబ్బు వెనకేసుకునే ప్రయత్నం జరుగుతుంది. ఎవరైనా సదరు ప్రజాప్రతినిధి నిలదీస్తే వందకోట్లు ఖర్చు పెట్టి గెలిచానని, ఆ డబ్బు ఎవరిస్తారని ఎదురు ప్రశ్నిస్తాడు. ఇలాంటి ప్రజాప్రతి నిధుల సంఖ్య పెరుగుతుండటంతో ఆ ప్రభావం ప్రభుత్వంపై కూడా పడుతుంది. దీనితో అభివృద్ధి, సంక్షేమ పథకాలు మూలన పడతాయి. మంచినీటి సరఫరా అంతరాయం కలుగుతుంది. ఎన్నికల సమయంలో ఓటర్లు నిజాయి తీగా ఉంటే ఆయా ప్రాంతాలు, రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి. ఆర్థిక వెసులుబాటుతో కుటుంబ సుఖసంతోషాలతో గడిపేందుకు అవకాశం కలుగుతుంది. ఎన్నికల్లో తాత్కాలిక ప్రలోభాలకు లొంగకపోతే ప్రజాసేవ చేయాలనుకునే సమర్థవంతమైననేతలు అధికారంలోకి వస్తారు. అప్పుడే ఆశించిన ఫలితాలు లభిస్తాయి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించండి - మీగడ వెంకటేశ్వరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పట్టభద్రుల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి వెంకటేశ్వరరెడ్డి

**శ్రీకాళహస్తి, నవంబర్ 19 ప్రభాతవార్త:** వచ్చే ఏడాది మార్చినెలలో జరిగనున్న శాసనమండలి ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్(పిడిఎఫ్) అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి కోరారు. శనివారం శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల నియోజకవర్గం నుంచి పట్టభద్రుల అభ్యర్థిగా తాను, ఉపాధ్యాయ శాసనమండలి అధ్యర్థిగా పొక్కిరెడ్డిబాబురెడ్డి పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ అభ్యర్థులకు వేసి తమను గెలిపించాలని కోరారు. తాము ఏరాజకీయ పార్టీకి వ్యతిరేఖం కాదని, అలాగని అనుకూలం కాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పట్టభద్రులు పక్షం అన్నారు. తమను గెలిపిస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ పట్టభద్రుల సమస్యలతో పాటు అసంఘటరంగం కార్మికులు, రైతుల సమస్యలపై శాసనమండలిలో వాణి వినిపించి వారికి న్యాయం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఇక రాష్ట్రంలో ప్రస్తుతం 65వేలమంది ఒప్పంద, 2.45లక్షల మంది తాత్కాలిక, పొరుగు సేవల సిబ్బంది పనిచేస్తున్నారని చెప్పారు. జగన్‌తన పాదయాత్ర సందర్భంగా ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరణ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిక గురించి మరచిపోయారని ఉద్యగుల భద్రతలేక, జీతాలు చాలక అనేక ఇబ్బందులు పడుతున్నారని మీగడ వెంకటేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఒడిస్సాలో ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ ఇటీవల తన పుట్టినరోజును పురస్కరించుకుని 65వేల మంది ఒప్పంద ఉద్యోగులను క్రమబద్దీకరించారని గుర్తుచేశారు. ఇక పంజాబ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు చేశారన్నారు. తాము అధికారంలోకి వస్తేగుజరాత్‌లో సిపిఎస్ రద్దు చేస్తామని ఆప్ అధినేత కేజ్రీవాల్ హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్‌పార్టీ ముఖ్యనేత ప్రియాంకగాంధీ కూడా ఇదే హామీని ఇచ్చాన్నారు. జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చాక జగన్ మాట తప్పారన్నారు. సిపిఎస్ ఉద్యమంలోపాల్గొన్నందుకు వేలాదిమందిని అరెస్టు చేయడంతో పాటు సుమారు 10వేలమందిపై అక్రమకేసులు బనాయించిన ఘనత జగన్ సర్కారుకు దక్కిందన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా నిరసన తెలపడం ప్రాధమిక హక్కని అయతే జగన్ ప్రభుత్వం ఈ హక్కును కాలరాస్తోందన్నారు. ఉద్యగ, ఉపాధ్యాయ సమస్యలపై ఈసర్కారు ప్రజాస్వామ్య బద్ధంగా చర్చలు కూడా జరపడం లేదన్నారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులుకు ఏడు డిఏలు బకాయిలు ఉన్నాయన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఏనాడు ఇలా ఏడు డిఎలు బకాయిలు పడిన ప్రభుత్వం లేదన్నారు.

ఏపిలోఖాళీగా ఉన్న 28వేల ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం రద్దు చేసిందని వెంకటేశ్వరరెడ్డి ఆరోపించారు.

రేషనలైజేషన్ ఫలితంగా రాష్ట వ్యాప్తంగా 56వేల మంది ఉపాధ్యాయ పోస్టులను అధికంగా చూపుతున్నారు. బదిలీల్లో కూడా జాప్యం చోటు చేసుకుంటోందని పదోన్నతి పొందిన వారు నష్టపోయే ప్రమాదం ఉందని వెంటనే బదిలీల ప్రక్రియ చేపట్టాలన్నారు.

మార్చినెలలో జరిగే శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపిస్తే ఈ సమస్యలపై పోరాటం చేసి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో రిటైర్డ్ ప్రొపెసర్ ఎస్ఎం.షరీప్, సిఐటియు నేతలు అంగేరిపుల్లయ్య, గంధంమణి, పెనగడంగురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుభాషాభ్యున్నతికి కొన్ని సంస్కరణలు తప్పని సరి

## అధికారభాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



**విజయవాడ,నవంబరు19,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుభాషాభ్యున్నతికి కొన్ని సంస్కరణలు తప్పని సరని ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు స్పష్టం చేసారు,అంతర్జాతీయ స్దాయిలో తెలుగు విస్తృతంగా ప్రాచుర్యం జరిగేందుకు వీలుగా నిర్మాణాత్మక కృషి జరగాలన్నారు.తెలుగులో పదాల ఉత్పత్తికి ప్రాధాన్యతను ఇవ్వడంతో పాటుగా, సందర్భోచితంగా ఇతర భాషా పదాలను వాడుకలోకి తీసుకునే అంశాలపై విస్తృతమైన చర్చ జరగాల్సి వుందన్నారు. విజయవాడ తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మల్లెతీగ సాంస్కృతీక సేవాసంస్ద ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సాహిత్య,సాంస్కృతిక ఉత్సవాల్లో ఆయన శని వారం తొలిరోజు సాయంత్రం జరిగిన సదస్సులో మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం తెలుగుభాషాను విస్తృతం చేయడానికి సహకరిస్తోందన్నారు.అధికార భాషా సంఘం అంటే ఉగాది కవి సమ్మేళనాలు, పండితగోష్టులు నిర్వహించడానికి పరిమితమైన సంస్ద కాదన్నారు.కచ్చితంగా అధికార భాషను అన్ని రంగాల్లో వినియోగంలోకి తీసుకుని రావాల్సి వుందన్నారు. మాతృభాషలో కాలానుగుతంగా కొన్ని మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాటన్నింటిని గమనించి తగిన రీతిలో మేథావులు. భాషావేత్తలతో చర్చలు నిర్వహించాల్సి వుందన్నారు. సాహిత్య సేవకు కేవలం ప్రభుత్వమే కట్టుబడి ఉండి,నిధులు కేటాయించాలనే దానికి భిన్నంగా సాహిత్య,సాంస్కృతిక సంస్దలు భాగస్వామ్యం కావాలన్నారు.సాహిత్యంలో అన్ని రకాల ప్రక్రియలకు సంబంధించిన విశేష ప్రచారం జరుగాల్సి వుందన్నారు.ఈ సభకు ముందు ప్రఖ్యాత గజల్ రచయిత రసరాజు అధ్యక్షతన జరిగిన సాహిత్య సదస్సులో తెలుగులో గజల్స్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలు తదితరంశాలపై చర్చ జరిగింది.డాక్టర్ రమణ యశస్వి రచించిన గజల్ సంపుటిను తీపి"ని గజల్ మాస్ట్రో కేతిరాజు శ్రీనివాస్ ఆవిష్కరించారు.అద్భుతమైన గజల్స్ పాడిన శ్రీనివాస్ ప్రేక్షక ప్రశంసలు పొందారు.గజల్ రచయితలు రెంటాల వెంకటేశ్వరరావు,ఎంవిడి శ్యామల,గోలి విజయ సభలో ప్రసంగించారు. వీరందరిని అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు,మల్లెతీగ వ్యవస్దాపకులు కలిమిశ్రీ. నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బతుకు భవితను చెప్పే సాధు నుదిటి గీతలు,ఆకలి కేకలకు చిహ్నాలని తెలంగాణా శాసనమండలి సభ్యుడు,కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరేటి వెంకన్న స్పష్టం చేసారు.సాహిత్యంలో అంతర్లీనంశం ఎక్కువ జీవన ఆవేదననే అన్నారు.ఇందుకు వర్గ తారతమ్యాలుండవన్నారు. జాతీయ సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా తెలుగుసాహిత్యంలో ప్రజాపాట అనే అంశంపై డాక్టర్ ఘంటా విజయకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోరేటి మాట్లాడుతూ ఏ భాషలోనైనా సాహిత్య ప్రక్రియలన్ని ప్రజాజీవనం నుంచే వస్తాయన్నారు. ఆయా జీవితాలను లోతుగా చూసినప్పుడు ఉద్వేగభరిత సాహిత్యం ఉంటుందన్నారు. ఉద్యమ సాహిత్యమైనా,ఎదైనా జీవితాన్ని కవి చూసే దిశలో గేయం,కవిత్వం ఉంటాయన్నారు.సాంస్కృతి చైతన్యం సమాజగతిని మారుస్తోందన్నారు.చలనచిత్రగేత,గజల్స్ రచయిత బిక్కి కృష్ణ,మల్లెతీగ నిర్వాహకులు కలిమిశ్రీ,ఇతర ప్రతినిధులు ఈ కార్యక్రమంలో గజల్స్‌కు సంబంధించిన వివిధ రచయి(త్రి)లు రచించిన 10కిపైగా సంపుటాలను ఈ కార్యక్రమంలో గోరేటి వెంకన్న ఆవిష్కరించారు.సాహిత్య,సాంస్కృతిక సమ్మేళనాన్ని విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రఖ్యాత మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో గ్రంథాలయ పరిషత రాష్ట్ర అధ్యక్షులు ఎం.శేషగిరిరావు మాట్లాడుతూ గ్రంథాలయ వ్యవస్దలో అనేక సంస్కరణలను తీసుకుని వస్తున్నట్లు తెలిపారు.విలేజీ/వార్డు సచివాలయాల్లో గ్రంథాలయాలు తప్పని సరిగా ఉండేందుకు సీఎం జగన్ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు,ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతమరెడ్డి,పర్టీ9 పర్టిలిటీ సెంటరు విజయవాడ ప్రాంతీయ కన్సల్టెంట్ డాక్టర్ సుమవర్ష,గాంధీదేశం సాంఘిక సంక్షేమ సంస్ద వ్యవస్దాపకులు ఆర్ఆర్ గాంధీ నాగరాజన్, రాజేష్, చలపతిరావు.రాఘువేంద్రశేఖర్ పాల్గొన్నారు.

# తిరుమలలో వారాంతం భక్తుల రద్దీ

**తిరుమల,నవంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతంతో కలియుగవైకుంఠం తిరుమలలో శనివారం ఉదయానికే భక్తులు భారీగా తరలివచ్చారు గత రెండు రోజులుగా మోస్తరుగా పెరిగిన శనివారం ఉదయానికి అనూహ్యంగా ఎక్కువయ్యారు. మధ్యాహ్నానికి కొండపై వైకుంతమ్ క్యూకాంప్లెక్స్- 2లో 30కంపార్టుమెంట్లు నిండిపోయాయి. పెరిగిన భక్తుల రద్దీతో స్వామివారి సాధారణ సర్వదర్శనానికి 24గంటలు సమయం పడుతోంది. సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు, 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ ఆన్‌లైన్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సుమారు ఆరు గంటల సమయం పడుతోంది. సాయంత్రానికి సర్వదర్శనంలో 52వేలమంది భక్తులు మహాలఘులో ఇష్టదైవాన్ని దర్శనం చేసుకున్నారు. ఆలయం లోపలకు వెళ్ళే భక్తుల సంఖ్యకు తగ్గట్లు స్వామివారి దర్శనానంతరం అంతేసంఖ్యలో భక్తులు వెలుపలకు చేరుకుంటున్నారు. ఈ రద్దీ సోమవారం వరకు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని టిటిడి వర్గాలు భావిస్తున్నాయి.

# గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్


సీజ్ చేసిన గంజాయితో సిఐ సతీష్‌కుమార్, టౌన్ ఎస్సై గోవిందరావు

**ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), నవంబర్ 19 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి పురుషోత్తపురం స్మశానవాటిక సమీపంలో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్‌చేసినట్లు సిఐ డివివి సతీష్‌కుమార్ చెప్పారు. సర్కిల్ కార్యాలయ ఆవరణలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పట్టణ ఎస్సై కె.గోవిందరావుకు వచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారుల సమక్షంలో సోదాలు నిర్వహించగా ఒడిశా కె.సువాని గ్రామానికి చెందిన ఘనశ్యామ్‌బెహరా గజపతి జిల్లా నుంచి 33 కిలోల గంజాయిని ద్విచక్ర వాహనంపై తీసుకు వచ్చినట్లు చెప్పారు. వీటిని పురుషోత్తపురం గ్రామానికి చెందిన రెయ్యి త్రినాధ్ మరియు పైల వాసులకు అమ్మకం నిమిత్తం అందిస్తుండగా ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనం స్వాధీన పర్చుకున్నట్లు చెప్పారు. గంజాయి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని చెప్పారు. గజపతి జిల్లా ఉదయ్‌పూర్ తదితర ప్రాంతాల నుంచి గంజాయిని మూటల్లో తీసుకు వచ్చి ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా స్థానిక వ్యాపారులు హైవే పక్కన ఉన్న పాన్‌షాప్‌లలో చిన్నచిన్నప్యాకెట్లుగా చేసి లారీ డ్రైవర్లుకు, ఇతరులకు విక్రయిస్తున్నట్లు తెలిసిందని సిఐ చెప్పారు. ముగ్గురిని అరెస్ట్‌చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

# రాయలసీమ ద్రోహి చంద్రబాబు

## శ్రీబాగ్ ఒడంబడికకు మీరు తూట్లు పొడవలేదా?

## రాయలసీమ హైకోర్టు ఎందుకు వద్దంటున్నారు!

## అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి అధ్యక్షుడు కె.వి.రమణ

**అనంతపురం, నవంబర్ 19, ప్రభాతవార్త బ్యూరో:** టిడిపి జాతీయ అధ్యక్షుడు ఎన్.చంద్రబాబు నాయుడు రాయలసీమ ద్రోహి అని, శ్రీబాగ్ ఒడంబడికకు తూట్లు పొడిచాడని, అభివృద్ధి వికేంద్రీకరణసాధన సమితి అధ్యక్షులు కె.వి.రమణ ధ్వజమెత్తారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ, కర్నూలు పర్యటనలో హైకోర్టు బెంచ్‌కు ప్రతిపాదించింది నేనే అని సిగ్గు విడిచి చెప్పుకుంటున్నాడని, బెంచ్ తీసుకురావడానికి రాయలసమీ వాసులు సవతితల్లి బిడ్డలా? నీవు ఏ ప్రాంతం వాడివి, 1937 నవంబర్ 16న చేసిన శ్రీబాగ్ ఒడంబడిక నీకు తెలియదా? ఆ ఒప్పందం ప్రకారం కోస్తాలో రాజధాని అయితే రాయలసీమలో హైకోర్టు, రాయలసీమలో రాజధాని అయితే కోస్తాలో హైకోర్టు అని వ్రాసుకోలేదా?దానిని తూట్లు పొడిచే అధికారం నీకు ఎవరు ఇచ్చారంటూ దుయ్యబట్టారు. ఈ విషయంలో రాయలసీమ ప్రజలకు సమాధానం చెప్పి రాయలసీమలో అడుగుపెట్టాలన్నారు. అది నిజమైన రాయలసీమ పౌరుషమన్నారు. న్యాయబద్ధంగా రాయలసీమకు రావాల్సిన హైకోర్టును ఎందుకు వద్దంటున్నారో చెప్పాలని, అది అడిగిన వారిని రౌడీలు, గుండాలు, అంతుచూస్తా, తొక్కతీస్తా, చెప్పులతో కొట్టండి అని హూంకరించే నీరు రౌడివా? ప్రజాస్వామ్య బద్ధంగా అడిగిన వారు రౌడీలా? ఇలాంటి పరుష భాషలో మాట్లాడిన నీపై కర్నూలు పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేసి కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. చంద్ర బాబుపై కేసులు నమోదు చేయకపోతే వీధి రౌడీలు కూడా పోలీసులను వెక్కరిస్తారని, ఇది పోలీసు వ్యవస్థ పరువు, ప్రతినిష్టలను దిగ జార్చడం కాదా? అంటూ ప్రశ్నించారు.



14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా ఉండి రాయలసీమకు ఏమి చేశావో చెప్పా లన్నారు. అభివృద్ధి వికేం ద్రీకరణపై జెఏసి బహిరంగ చర్చకు పిలుస్తున్నదని, ప్రపంచ మేధావులైన శ్రీకృష్ణకమిటీ, శివ రామకృష్ణన్ కమిటీ, బోత్సన్ కమిటీ సిఫారసులు ఉండగా, అమరావతి రాజధానిప్రతిపాదన ఎలా వచ్చిందన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలను నెలకొల్పి, పెద్ద ఎత్తున విద్యను అమ్ముకొని పేద విద్యార్థుల రక్తమాంసాలని జలగలా పీల్చి ఎదిగిన నారాయణ కమిటీ సిఫార్సులకు ప్రాధాన్యత నిచ్చే అధికారం మీకు ఎవరిచ్చారన్నారు. రాష్ట్ర ఆదాయం అంతా అమరావతికే వెచ్చించే హక్కు మీకు ఎవరిచ్చారని, లక్షల కోట్లు ఒక్క అమరావతికే ఖర్చు పెడితే మిగిలిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల పరిస్థితి ఏమిటని? 85 సంవత్సరాల క్రితమే చేసుకున్న శ్రీబాగ్ ఒడంబడికలో పెద్ద మనుషుల ఒప్పందంలోనే అభివృద్ధి వికేంద్రీకరణ అంశం కనబడుతుంటే 85 సంవత్సరాల తరువాత దానిని ఉల్లంఘించి మిగిలిన ప్రాంతాలనునిర్లక్ష్యం చేసిన కారణంగానే నేడు ప్రాంతాల మధ్య చిచ్చు రగులుతున్నది నిజం కాదా? దీనికి నీవు నీ దిక్కుమాలిన రాజకీయాల కోసం ఆజ్యం పోస్తున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు.

ప్రజా స్వామ్యంలో సమిష్టి నిర్ణయాలకు కట్టుబడకుండా తనకు అధికారం ఇచ్చారన్న అహంకారంతో అధికారాన్ని, ప్రభుత్వ సంపదలను దుర్వినియోగం చేశారని, కేంద్రంతో కుమ్మక్కై విభజన చట్టంలోని అంశాలను తాకట్టు పెట్టి తమకు లాభదాయకమైన ప్యాకేజీలను తీసుకొని 10 సంవత్సరాల ఉమ్మడి రాజ్ధాంగా ఉండాల్సిన హైదరాబాద్‌ను వదులుకొని దొంగల్లా పారిపోయి వచ్చి రాష్ట్రం అధోగతి పాలుకావడానికి కారణం నువ్వు కాదా? అన్నారు.

ఇన్ని తప్పులు చేసిన నువ్వు సిగ్గుతో మూలన కూర్చోక తగుదనమ్మా అని సిగ్గు విడిచి రాయలసీమ, ఉత్తరాంధ్రలో తిరిగే నైతిక హక్కు నీకెక్కడిదన్నారు.

బుకాయించినంత మాత్రాన ఈ ప్రాంత ప్రజలకు నువ్వు చేసిన గాయాలు కనిపించకుండా పోతాయా అంటూ ప్రశ్నించారు.

# అయ్యప్ప భక్తులతో పోటెత్తిన కాణిపాకం

## పార్కింగ్ స్థలాల్లో వాహనాల కిటకిట

**కాణిపాకం, నవంబర్ 19 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినా యక స్వామి అలయం శనివారం అయ్యప్ప భక్తుల రద్ధీతో పోటెత్తింది. కాణిపాకంలో నూతన ఆలయం ప్రారంభమైనప్పటి నుండి భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. ఈనేపథ్యంలో గత నాలుగు రోజుల క్రితం కార్తీకమాసం శబరిమల అయ్యప్ప ఆలయంలో స్వామివారి దర్శనాలు ప్రారంభం కావడంతో భక్తులు పెద్దఎత్తున తరలివెళుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి అయ్యప్ప దీక్షా భక్తులు పెద్దఎత్తున తరలివెళుతున్నారు. శబరిమల దర్శనంకు వెళ్ళే అయ్యప్పభక్తులు ముందుగా విఘ్ననాయకుడైన కాణిపాకం వినాయకునికి దరి ్శంచుకోవడం ఆనవాయితీ. ఈమేరకు శనివారం అయ్యప్ప భక్తులు వివిధ ప్రాంతాల నుండి స్వామిదర్శనం కోసం భారీగా తరలివచ్చారు. అలాగే శనివారం వారాంతపు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. సాధారణ భక్తులతో పాటు అయ్యప్ప భక్తులు తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని అయ్యప్ప భక్తులతో పోటెత్తింది. అయ్యప్ప భక్తులు వేకువజామున నుండి స్వామి దర్శనంకోసం క్యూలైన్లలో బారులు తీరి నిలబడ్డారు. అయినప్పటికి భక్తులు గంటల


అయ్యప్ప భక్తులతో కిటకిటలాడుతున్న కాణిపాకం ఆలయం.

తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు నాలుగు గంటల వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే అయ్యప్పభక్తులు వచ్చిన వివిధ రకాల వాహనాలతో కాణిపాకం పరిసరాలు, వాహన పార్కింగ్‌లు పూర్తిగా నిండిపోయాయి. సుమారు 20 వేల మంది వరకు భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా.

రద్దీ దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

# టాలీవుడ్, కోలీవుడ్ మధ్య వివాదం

- థియేటర్లలో తెలుగు మూవీలకే ప్రాధాన్యతపై గరంగరం
- వివాదాస్పదంగా నిర్మాతల మండలి నిర్ణయం

**హైదరాబాద్, నవంబరు 19, ప్రభాతవార్త:** సంక్రాంతి, ఉగాది పండుగల సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని థియోటర్లు తెలుగు సినిమాల విడుదలకే ప్రాధాన్యత ఇవ్వాలని తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమవుతోంది. దీనిపై ఈ నెల 22వ తేదీన రెండు చిత్ర పరిశ్రమల ప్రముఖుల మధ్య చర్చలు జరగనున్నట్లు సమాచారం. పండుగలకు డబ్బింగ్ చిత్రాలను పక్కన పెట్టాలనే నిర్ణయం పట్ల తెలుగు చలన చిత్ర పరిశ్రమ, తమిళ (కోడంబాకం) చిత్ర పరిశ్రమ (కోలీవుడ్) మధ్య మనస్పర్థలు తలెత్తాయి. తెలుగు సినిమాలకు థియోటర్లను కేటాయించాలని తెలుగు చిత్ర నిర్మాతల మండలి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనినఎగ్జిబిటర్లకు అధికారికంగా లేఖ రాయడంపై ముఖ్యంగా తమిళ దర్శకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మా సినిమాలకు థియేటర్లు ఇవ్వకపోతే తెలుగు సినిమాలకు మేము కూడా ఇవ్వమని కొందరు కోలీవుడ్ దర్శకులు బహిరంగంగా ప్రకటిస్తున్నారు. తెలుగు సినిమాలను కోలివుడ్ ఆదరిస్తుండగా, తమిళ సినిమాలను (తెలుగు డబ్బింగ్) ఆపడం ఏమటని తమిళ చిత్ర పరిశ్రమ తప్పు పడుతోంది. తెలుగు సినిమాలను కోలివుడ్‌లో ఏ విధంగా ఆడిస్తారో మేమూ చూస్తామంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య, బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి విడుదలకు ఏర్పాట్లు జరుగుతుండగా, మరోపక్క అనూహ్యంగా ప్రముఖ తెలుగు చిత్ర నిర్మాత దిల్ రాజు తమిళ హీరో విజయ్‌తో నిర్మించిన ద్విభాషా చిత్రం (తమిళం, తెలుగు) వారసుడు, అలాగే అజిత్ కుమార్ నటించిన తునీవ్ చిత్రాలను కూడా వచ్చే సంక్రాంతికే విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. వారసుడు, తునీవ్ లాంటి అనువాద చిత్రాలకు రెండో ప్రాధాన్యతగా ప్రదర్శించాలని, కేవలం తెలుగు చిత్రాలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి ఎగ్జిబిటర్లకు రాసిన లేఖలో వెల్లడించింది. తెలుగు చలన చిత్రాల పెరిగిన నిర్మాణ వ్యయంతో పాటు, నిర్మాతల శ్రేయస్సు కోరి తెలుగు సినిమాను కాపాడుకోవాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపింది. వచ్చే ఏడాది సంక్రాంతి, దసరా పండగలకు స్ట్రయిట్ తెలుగు సినిమాల ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలని సూచించింది. దీనికి సంబంధించి 2017 సంవత్సరంలో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి సైతం నిర్ణయం తీసుకుందని ఆ లేఖలో వెల్లడించింది. అంతే కాకుండా స్ట్రయిట్ సినిమాలు ఉండగా, డబ్బింగ్ చిత్రాలకు థియోటర్లు ఎలా ఇస్తామంటూ గతంలో ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఘాటుగా వ్యాఖ్యలు చేశారని ఈ సందర్భంగా నిర్మాతల మండలి గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో తమిళ చిత్ర పరిశ్రమ స్పందిస్తూ ఈ నిర్ణయాన్ని తప్పుపట్టింది. అంతే కాకుండా ఇలాగైతే కోలీవుడ్‌లో తెలుగు సినిమాలను థియోటర్లలో ప్రదర్శించకుండా నిలుపుదల చేయాల్సి వస్తుందని హెచ్చరించింది. దీంతో నిర్మాతల మండలి నిర్ణయంపై తెలుగు చలన చిత్ర పరిశ్రమలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సైతం అభ్యంతరం వ్యక్తం చేశారు. డబ్బింగ్ సినిమాలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల థియోటర్లలో ఆపడం సాధ్యమయ్యే పనికాదని వ్యాఖ్యానించారు. ఇదే దారిలో పలువురు నిర్మాతలు సైతం వ్యతిరేకిస్తున్నట్లు తెలియవచ్చింది.

# ఇది రైతు ప్రభుత్వం

## ఎంపి విజయసాయిరెడ్డి

**ప్రభాతవార్త, విశాఖపట్నం:** ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సారధ్యంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని ఆది నుంచి రైతులకు మద్దతుగా నిలిచిన ప్రభుత్వమని రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ట్విట్టర్ వేదికగా శనివారం పలు అంశాలు వెల్లడించారు. ఐదేళ్ళ చంద్రబాబు పాలనలో వివిధ పంటల కొనుగోలు కోసం చేసిన ఖర్చు కంటే మూడున్నరేళ్ళలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన ఖర్చు రెట్టింపు కన్నా అధికంగా ధాన్యం కొనుగోలు కోసం గత చంద్రబాబు ప్రభుత్వం వెచ్చించిన మొత్తం కంటే ఎక్కువగా జగన్ ప్రభుత్వం మూడేళ్ళలోనే వెచ్చించింది. చంద్రబాబు ప్రభుత్వంలో ఐదేళ్ళలో పంటల కొనుగోలు కోసం పెట్టిన ఖర్చు రూ.3,322, సేకరించి ధాన్యం రూ.43,134 కోట్లు కాగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కేవలం మూడున్నరేళ్ళలో పంటల కొనుగోలు కోసం చేసిన ఖర్చు రూ.7,157 కోట్లు, మూడు సీజన్లలోనే సేకరించిన ధాన్యం రూ.48,793 కోట్లు అని అన్నారు. నిజమైన రైతు ప్రభుత్వం ఎవరిదో ఈ గణాంకాలే చెబుతున్నాయని అన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్ళ రూపురేటలు మార్చి, అత్యుత్తమ విద్యను అందించేలా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని విజయసాయిరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా రూ.3,364 కోట్లతో 3,013 సంక్షేమ హాస్టళ్ళ, గురకుల పాఠశాలల ఆధునికీకరణకు నాడు-నేడు కార్యక్రమాన్ని చేపడుతోంది. హాస్టళ్ళలో మౌలిక సదుపాయాలతో పాటు కిచెన్లు ఆధునికీకరించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని సీఎం జగన్ ఆదేశించారని తెలిపారు. ఫిర్యాదులకు ప్రత్యేకంగా ఒక నంబర్, ఖాళీగా ఉన్న పోస్టులు, యుద్ధప్రాతిపదికన భర్తీకి ఆదేశాలు, జారీ చేశారన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ పెట్టాలనుకున్నానని చెబుతున్న చంద్రబాబు 14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా ఉండి ఏం చేశాడని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. బుకాయింపులు, అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబుకు వేరెవ్వరూ సాటిరాలేరని అన్నారు. చంద్రబాబుకు మొదట్లోనే చంద్రగిరి ఛీ పొమ్మంది. ఆ తరువాత హైదరాబాద్ తన్ని తరిమింది. ఇంతకు ముందే ఉత్తరాంధ్ర ఉమ్మేసింది. ఇప్పుడు రాయలసీమ కూడా గో బ్యాక్ అంటోందని అన్నారు.

అవుతుంది. చదువు పూర్తి అయ్యాక ఇక ఇంట్లో ఎందుకండీ వీళ్లు? మీతో పాటు కొండకు తీసుకెళ్లండి. వేద పఠనంలో పాల్గొంటారు. వీళ్ల పనిలో కుదిరితే ఎవరైనా వచ్చి పిల్లనిచ్చి పెళ్లి చేస్తారు. జీవితంలో స్థిరపడ్తారు" అంది లక్ష్మీదేవి భర్తకు అన్నం వడ్డిస్తూ.

"ఏం? మన కూతురు రుక్మిణిని మీ తమ్ముడికిచ్చి పెండ్లి చెయ్యాలని లేదా?" అన్నాడు లక్ష్మీదేవితో భట్టాచారి తీక్షణంగా చూస్తూ.

"మా వాడికి పెద్దగా ఆస్తిపాస్తులు లేవు గదండీ? మా నాన్నగారు కాలం చేశారు. మీరు రుక్మిణిని ఇస్తారో? లేదో? నాకు ఇంతవరకు స్పష్టంగా చెప్పలేదు. అందుకే అలా అన్నాను" అంది లక్ష్మీదేవి.

"కుమారిల భట్టు గొప్ప పండితుడు. నేను వాడిని గమనిస్తూనే ఉన్నాను మన శ్రీధర భట్టుతో వాదోపవాదాలు చేసేటప్పుడు. ఇద్దరూ ఒకరికొకరు తీసిపోరు. ఇద్దరూ వాదాల్లో తప్ప మిగతా విషయాల్లో అన్యోన్యంగా ఉంటారు. మనకు కుమారిల భట్టు కన్నా మంచి సంబంధం వస్తుందంటావా? మన కళ్లముందు పెరిగినవాడు. మనకు చేదోడు వాదోడుగా ఉంటాడు. వాడికి మనమంటే ప్రాణం. వాడికే తొందర్లో మన రుక్మిణినిచ్చి పెళ్లి చేస్తాను. ఈలోగా శ్రీధర భట్టుకు ఎవరో ఒకరు వచ్చి పిల్లనిస్తారులే. కళ్యాణమొచ్చినా కక్కొచ్చినా ఆగదంటారు కదా?" అన్నాడు భట్టాచార్య భోజనం చేసి లేస్తూ.

తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు క్షణాల్లా గడిచిపోయాయి. అందరూ ప్రసాదాలను మూట గట్టుకొని తెచ్చుకొంటే శ్రీధర భట్టు, కుమారిల భట్టులు అనుభవాల్ని, అనుభూతుల్ని మూట కట్టుకొని తెచ్చుకొనేవారు. కొన్నాళ్లకు కుమారిల భట్టు, రుక్మిణిలకు భట్టాచార్య దంపతులు కొండ మీద దేవుని సమక్షంలో ఘనంగా పెళ్లి చేశారు.

కుమారిల భట్టు శ్రీధర భట్టుకు కాస్త దూరమై భార్యకు దగ్గరయ్యాడు. పైగా కొండ మీద వైదికుడిగా కొలువులో చేరాడు.

"ఏరా! చదువు పూర్తయింది. ఊరకే అలా గాలితిరుగుళ్లు తిరక్కుండా నువ్వు కూడా కొండ మీద కొలువుకెళ్లొచ్చుగా?" అంది లక్ష్మీదేవి కొడుకు శ్రీధర భట్టుతో.. ఏకాంతంగా, అదోలా తిరుగుతుండడాన్ని చూసి.

"నాకు ఇప్పుడిప్పుడే కొలువులో చేరాలని లేదు. నాకింకా ఏదో నేర్చుకోవాలనే తపన కలుగుతోంది. నేనింకా తెలుసుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయేమోనని అనిపిస్తోంది. దయచేసి నన్ను విసిగించకండి" అన్నాడు తల్లితో శ్రీధర భట్టు.

వానలు పడి కపిలతీర్థానికి వరదలు పోటెత్తాయి. కొండకెళ్లే యాత్రికులతో పాటు, చుట్టుపక్కల పల్లెలవాళ్లు కూడా కపిలతీర్థం చూడడానికి తండోప తండాలుగా రావడం మొదలుపెట్టారు. కపిలతీర్థం జలపాతానికేసి తదేకంగా చూస్తున్న శ్రీధర భట్టు మొదటి పేటులో దారి తెలియక అటు ఇటు కొండనెక్కి దిగుతున్న బౌద్ధ భిక్షువును చూశాడు. వెంటనే గబగబ కొండెక్కి మొదటి పేటును చేరుకొని ఆ బౌద్ధ భిక్షువు చేయి పట్టుకొని కొండ దిగడానికి సాయపడ్డాడు.



"ధన్యవాదాలు మానవకా?" అన్నాడు బౌద్ధ భిక్షువు.

"మానవకా.. అంటే ఏమిటి స్వామీ?"

"శిష్యా అని అర్థం"

"మీరెందుకు తీర్థంపైకి వెళ్లారు?"

"కింద జనం ఎక్కువగా ఉంటే పైకెళ్లి స్నానం చేసి, కాసేపు ధ్యానంలో గడిపాను. ఎటువైపు దిగాలో అర్థంగాక తటపటాయిస్తుంటే నువ్వొచ్చి నన్ను కిందికి దింపావు. బుద్ధ భగవానుడే మనల్ని ఇలా కలిపాడనుకుంటాను" అన్నాడు బౌద్ధ భిక్షువు.

గుండు తల, ముదురు రంగు కాషాయ వస్త్రాలు, భుజానికి వేలాడుతున్న జోలె.. చూడడానికి చాలా సాదాసీదాగా ఉన్నా ముఖంలోని ఆకర్షణ, వర్చస్సులోని నిర్మలత్వం, చూపుల్లోని కరుణ, పెదాలపై చిరునవ్వు శ్రీధర భట్టును కట్టిపడేశాయి.

"ఏదో అసహనంగా.. అశాంతిగా కనిపిస్తున్నావు?" అడిగాడు బౌద్ధ భిక్షువు.

"వేద వేదాంగాలు చదివినా, ఏదో తెలుసుకోవాలనే తపన నన్ను నీడలా వెంటాడుతోంది స్వామీ"

"నాతో వస్తావా? నీ సమస్యకు పరిష్కారం చూపిస్తా"

"మీతోనా? నేను హిందువును.. కొండ మీద స్వామిని కొలుస్తాం"

"నేను బౌద్ధ భిక్షువును.. బౌద్ధాన్ని పాటిస్తా. అయినా కొండ మీద స్వామిని చూడడానికి ఎన్నో యోజనాల నుంచి నడచి వచ్చాను"

"ఎందుకు?"

"కొండ మీద స్వామిని మేం బుద్ధుడిగానే భావిస్తాం. నువ్వు బుద్ధుడిని మీ స్వామిగా ఎందుకు చూడవు? దశావతారాలలో బుద్ధుడుతున్నాడుగా! మేం మీ స్వామిని కొలిచినప్పుడు.. నువ్వు మా బుద్ధుడిని ఎందుకు ఆరాధించకూడదు? మీ కొండలు, కోనలు, తీర్థాలు, ఊళ్లు, అద్భుతాలు మేం చూడనొచ్చాం. నువ్వెందుకు మేముండే ప్రదేశాలను చూడకూడదు? నువ్వు ఏదో తెలుసుకోవాలనుకునే తపన మా దగ్గరెందుకు తీరదు. కొంత మంది అన్నం తింటారు, కొంత మంది రొట్టెలు తింటారు. పరమార్థం ఒక్కటే కడుపు నిండడం. మీ స్వామిలో మా స్వామి కనిపిస్తున్నాడు. మా స్వామిలో మీ స్వామి కనపించడా? బాగా ఆలోచించు. నేను కొండ మీద స్వామివారిని దర్శించుకొని వస్తాను. నువ్వేదో తెలుసుకోవాలను కుంటున్నావు కదా? నాతో వచ్చి తెలుసుకో. రేపు మళ్లీ ఇక్కడే కలుస్తాను. బాగా ఆలోచించుకో. బలవంతమేమీ లేదు. అన్ని ధర్మాల సారమొక్కటే. వెళ్లొస్తా" అంటూ ముందుకు దకిలాడు బౌద్ధ భిక్షువు.

"స్వామీ! మీ పేరేమి?" అన్నాడు శ్రీధర భట్టు.

"నా పేరు ఈశ్వర సేనాని"

"బౌద్ధ మతం పేరులా లేదే?"

"ఏమో? మా బౌద్ధ గురువు గారు నాకు పెట్టిన పేరు అదే. బుద్ధునికి మరో పేరు అవలోకితేశ్వర తెలుసా?"

"అవునా?" "పేరులోనే ఉన్నది పెన్నిధి" అంటూ ఈశ్వర సేనాని అలిపిరి వైపుకు నడచి వెళ్లిపోయాడు.

ఈశ్వర సేనానిని కనుచూపు మేర చేశాడు శ్రీధర భట్టు. ఈశ్వర సేనానితో పాటు తన మనసు వెళ్లిపోయింది. ఇంటికెళ్లాడు. ఏం చేస్తున్నాడో అర్థం కావడం లేదు. తిన్నాడో? తిన్లేదో? పిచ్చి పిచ్చిగా రాత్రంతా నిద్రలేదు. బుర్ర ఆలోచనలతో వేడెక్కిపోతోంది.

**(మిగతాది వచ్చేవారం)**



# నట శిఖరం

కవర్ స్టోరీ

**షేక్ అబ్దుల్ వాకీం జాని**

**తెలుగు సినీచరిత్రలో సంచనాలకు ప్రతి రూపంలా నిలుస్తారు సూపర్‌స్టార్ కృష్ణ. పూర్తి పేరు ఘట్టమనేని శివరామకృష్ణమూర్తి. నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగానే కాకుండా తెలుగు సినిమాకు సరికొత్త టెక్నాలజీని పరిచయం చేసిన నటుడిగా ఖ్యాతినార్జించారు. ప్రయోగాలకు కేరాఫ్‌గా నిలిచిన సాహస నటుడు కృష్ణ.**

**తెలుగు** సినీ ప్రేక్షకులకు కౌబాయ్, జేమ్స్ బాండ్‌గా చెరగని ముద్ర వేశారు. టెక్నికల్‌గా తెలుగు సినిమాను ఎన్నో ఎత్తులకు చేర్చిన నటుడు సూపర్ స్టార్ కృష్ణ. 57 సంవత్సరాల సినీ ప్రస్థానంలో 350 చిత్రాలలో నటించి తెలుగునాట సంచనాలకు మారుపేరుగా నిలిచారు. వీరు 1943 మే 31 సోమవారం మధ్యాహ్నం 12.05 గంటలకు గుంటూరుజిల్లా తెనాలి సమీపంలోని బుర్రిపాలెం గ్రామంలో నాగరత్నమ్మ, వీరరాఘవయ్య దంపతులకు పెద్ద కుమారునిగా జన్మించారు. కృష్ణకు ముగ్గురు తోబుట్టువులు ఉన్నారు. వీరిది రైతు కుటుంబం. తల్లిదండ్రులు పెట్టిన పేరు శివరామకృష్ణమూర్తి కాగా సినిమాల్లోకి వచ్చినప్పుడు ఆదుర్తి సుబ్బారావు ఈ పేరును కృష్ణగా మార్చారు.

**బాల్యం-విద్యాభ్యాసం**

కృష్ణ బాల్యం ఎక్కువ భాగం తెనాలిలో గడిచింది. పాఠశాల విద్య తెనాలి తాలూకా హైస్కూల్‌లో కొనసాగింది. ఆ సమయంలో ఘట్టమనేని వెంకటప్పయ్య, మోటుపల్లి కృష్ణబాబు అనే మిత్రులతో ప్రతిరోజు బుర్రిపాలెం నుండి సైకిళ్లపై తెనాలి వచ్చి విద్యాభ్యాసం చేసేవారు. పాఠశాల సమయం ముగిసిన తరువాత ఈ మిత్రద్వయం తెనాలి కొత్తపేటలోని ములుకుట్ల లక్ష్మీనారాయణ అనే ఉపాధ్యాయుని వద్ద ఆంగ్లం, గణిత పాఠ్యాంశాల కోసం ట్యూషన్‌కు వెళ్లేవారు. బాల్యం నుండి పెద్దలంటే ఎంతో వినయ విధేయతలు కలిగి ఉండేవారు. చిన్నతనం నుండి తల్లి నాగరత్నమ్మా వీరగాథలు చెప్పి కృష్ణలో చైతన్య దీపం వెలిగించారు. కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్‌గానూ, గ్రామ మునసబుగా వ్యవహరించే తండ్రి వీరరాఘవయ్య కృష్ణకు గురువుగా వ్యవహరించేవారు.

కృష్ణ ఎంతో కష్టపడి చదివి 1956లో ఎస్ఎస్ఎల్‌సి పాసయ్యారు. ఆ తరువాత ఇంటర్మీడియేట్‌లో ఎం.పి.సి సీటు కోసం ప్రయత్నించారు. గుంటూరు కళాశాలలో సీటు దొరకకపోవడంతో పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఎం.పి.సి గ్రూపుతో ఇంటర్ చేరి మొదటి సంవత్సరం పూర్తి చేసి రెండవ సంవత్సరం ఏలూరులోని సి.ఆర్.రెడ్డి కళాశాలకు మారారు. అక్కడే ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన తర్వాత అదే కళాశాల నుండి 1960లో బిఎస్సీ పట్టా అందుకున్నారు. సి.ఆర్.రెడ్డి కళాశాలలో కృష్ణ, తర్వాతి కాలంలో సినిమాల్లో నటునిగా ఎదిగిన మురళీమోహన్ క్లాస్‌మేట్లు, మంచి స్నేహితులు. కృష్ణ డిగ్రీ చదువుతుండగా ఏలూరులో ప్రఖ్యాత నటుడు అక్కినేని నాగేశ్వరరావుకు ఘనంగా పౌర సన్మానం జరిగింది. ఆ కార్యక్రమానికి హాజరైన కృష్ణకు నాగేశ్వరరావు నటుడు కావడం వల్లనే ఆ స్థాయిలో ప్రజాభిమానం పొందగలుగుతున్నాడని అర్థం చేసుకుని సినీ నటుడు కావాలన్న అభిలాష పెంపొందించుకున్నారు. పైగా కృష్ణ బాల్యం నుంచి ఎన్.టి.రామారావు అభిమాని. డిగ్రీ పూర్తి చేశాకా ఇంజినీరింగ్ చదవాలని ప్రయత్నించినా కృష్ణకు సీటు రాలేదు. దాంతో కృష్ణ విద్యార్థి జీవితం ముగిసింది.

**తొలి అవకాశం కోసం తీవ్ర ప్రయత్నం**

సినీ రంగంలో కృష్ణ జీవితం వడ్డించని విస్తరి కాదు. తొలి అవకాశం కోసం అనేక ప్రయత్నాలు చేశారు. ఇంజినీరింగ్ సీటు రాకపోవడంతో అప్పటికే సినిమాల్లో హీరో కావాలని ఆశిస్తున్న తండ్రి అనుమతి తీసుకుని సినిమా ప్రయత్నాలు చేశారు.

కృష్ణ ఇష్టాన్ని అనుసరించి అతని తండ్రి రాఘవయ్య చౌదరి తనకు తెలిసిన సినిమా వారికి పరిచయం చేస్తూ ఉత్తరాలు రాసిచ్చి మద్రాసు పంపారు.

అప్పటి తెలుగు సినీ రంగానికి కేంద్రమైన మద్రాసులో తన స్వంత ప్రాంతమైన తెనాలి పట్టణానికి చెందిన సినీ ప్రముఖులు కొంగర జగ్గయ్య, గుమ్మడి వెంకటేశ్వరరావు, చక్రపాణి వంటివారిని కలిసి తన ఉద్దేశాన్ని చెప్పారు. ఆ రోజుల్లో జక్కన్నగా చిత్రసీమ లో అందరూ పిలిచే తెనాలికి చెందిన చక్రపాణి పరిచయమై "వయస్సులో నువ్వు చిన్నవాడివి. ఇంకా చాలా కష్టపడాలి. నీకు తప్పకుండా అవకాశం ఇస్తాను" అన్నారు. అప్పటికి కృష్ణ వయసురీత్యా చిన్నవాడు కావడంతో, కొంత కాలం ఆగి మద్రాసుకు తిరిగి రమ్మని అందరూ సలహా ఇచ్చారు. దాంతో కృష్ణ నాటకాల్లో నటించి అనుభవం సంపాదించాలని ప్రయత్నించారు.

మద్రాసులోన 'చేసిన పాపం', 'కాశీకి వెళ్లనా?' నాటకాలలో శోభన్‌బాబుతో కలిసి నటించారు. తర్వాత గరికపాటి రాజారావు దర్శకత్వంలో ప్రజానాట్యమండలివారు విజయవాడ జింఖానా మైదానంలో ప్రదర్శించిన ఛైర్మన్ నాటకంలో ఛైర్మన్ కుమారుడి పాత్ర పోషించాడు. తిరిగి మద్రాసు వచ్చి ప్రయత్నాలు ప్రారంభించగా ఎల్వీ ప్రసాద్ తీస్తున్న 'కొడుకులు కోడళ్ళు' అన్న సినిమాలో ఒక పాత్రకు ఎంపిక చేశారు. కానీ ఆ సినిమా మధ్యలోనే ఆగి పోయింది. మద్రాసులో సినిమా అవకాశాల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గంటల తరబడి అద్దం ముందు నిలబడి నటన ప్రాక్టీసు చేయమని స్నేహితులు సలహా ఇస్తే వేషాల కోసం కష్టాలు పడడం ఏమిటి? అదృష్టం ఉంటే వేషాలే వెతు క్కుంటూ వస్తాయని కొట్టిపారేసేవారు. సినిమా ప్రయత్నాలు చేస్తున్న దశలోనూ ఇబ్బందులేమీ పడలేదు. ఎప్పుడు డబ్బు అవసరమైనా ఇంటికి ఉత్తరం రాస్తే కృష్ణ తల్లి కావాల్సినంత డబ్బు పంపేవారు. రోజూ సెకండ్ షో సినిమాలు చూస్తూ, పగలు సినిమాల్లో వేషాల కోసం తెలిసిన వారిని కలుస్తూ ప్రయత్నాలు చేశారు. కొంగర జగ్గయ్య నిర్మించిన 'పదండి ముందుకు' (1962) సినిమాలో చిన్న పాత్ర పోషించాడు. 'కులగోత్రాలు'(1962), 'పరువు ప్రతిష్ఠ'(1963), 'మురళీకృష్ణ' (9164) సినిమాల్లోనూ చిన్న చిన్న పాత్రల్లో కనిపించారు. 'కాదలిక్క నేరమిల్లై' అన్న తమిళ సినిమా కోసం దర్శక, నిర్మాత



సి.వి.శ్రీధర్ కొత్త నటులను వెతుకుతూ కృష్ణను కథానాయకుడిగా ఎంపిక చేశాడు. అయితే కృష్ణకు తమిళం రాకపోవడంతో అవకాశం పోయింది. దీనితో కృష్ణ తిరిగి తెనాలి వెళ్లిపోయారు.

**చిత్రసీమలో ప్రవేశం**

బాల్యం నుండి కృష్ణకు నటన పట్ల ఎంతో ఆరాధనా భావం ఉండేది. ఈ విషయం అందరికీ చెబితే హేళన చేస్తారని మనసులో కొంత న్యూనతా భావం ఉండేది. చిత్రసీమ లో పెద్దల సలహాపై నాటకానుభవం కూడా సంపాదించారు. ఇదే సమయంలో 1962లో బాబూ మూవీస్ సంస్థ తాము నిర్మించబోయే నూతన చిత్రానికి కొత్త నటీ నటులను ఆహ్వానిస్తూ ప్రకటన చేశారు. వెంటనే కృష్ణ తన ఫొటోలను పంపారు. నటీనటుల ఎంపికలో ఆ సంస్థవారు అను భవం పండిన దిగ్గజ నటీనటులను నియ మించారు. నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు, మహానటి సావిత్రి, దుక్కి పాటి మధుసూదనరావు ఇత్యాది ప్రముఖు లు నూతన నటీనటులను పరిశీలించారు. చివరకు కృష్ణను హీరోగా, ఆయన సరసన సుకన్యను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. ఆ చిత్రం 1965లో ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో విడుదలైన 'తేనెమనసులు'. ఈ చిత్రం కృష్ణకు చిత్ర పరిశ్రమలో ఒక స్థానాన్ని కల్పించింది.

**వివాహం**

కృష్ణకు హీరోగా సినిమా 'తేనె మనసులు' ప్రారంభానికి ముందే తెనాలి సమీపంలోని కంచెర్లపాలెంకు చెందిన ఇందిరాదేవితో వివాహం అయింది. 1962 నవంబరు 1న వివాహం జరిగింది. ఈ దంపతులకు 1965లో తొలి సంతానం రమేష్‌బాబు జన్మించారు. 1968లో తొలి పుత్రిక పద్మావతి జన్మించారు. 1969లో ద్వితీయ కుమార్తె మంజుల, 1975లో ద్వితీయ కుమారుడు మహేశ్‌బాబు, 1981లో తృతీయ కుమార్తె ప్రియదర్శిని జన్మించారు. కృష్ణ తన సహ నటి విజయనిర్మలతో అనేక చిత్రాల్లో నటించారు. వీరి జంట కన్నుల పండుగగా ఉండేది. 1967లో బాపు-రమణలు దర్శకత్వం వహించిన 'సాక్షి' సినిమాలో కృష్ణ కథానాయకుడిగా, విజయనిర్మల కథానాయకిగా నటించారు. తర్వాత సర్కార్ ఎక్స్‌ప్రెస్ సినిమాలో హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సమయంలో విజయనిర్మలను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని కృష్ణ చెప్పారు. వీరిద్దరి భావాలు, మనసులు కలిశాయి. స్నేహబంధం వివాహ బంధంగా మారింది. ఆమెను ద్వితీయ వివాహం చేసుకున్నారు. 1969 మార్చి 24న శ్రీ వెంకటేశ్వరుని సన్నిధిలో కృష్ణ, విజయనిర్మల దంపతుల య్యారు. మొదటి భార్య ఇందిర విజయ నిర్మలను కుటుంబ సభ్యురాలిగా స్వీకరిం చడమే కాక ఆమెను ఆదరించారు.

**చిత్రసీమలో సూపర్ స్టార్**

కృష్ణ నటించిన 'తేనె మనసులు' మార్చి 1965 మార్చి 31న విడుదలై అఖండ విజయం సాధించింది. ఆ తరువాత ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో 'కన్నె మనసులు' చిత్రంలో నటించారు. మద్రాసుకు మకాం మార్చిన తరువాత పరిచయాలు పెరిగాయి. నటనతోపాటు పోరాటాల్లో సైతం ప్రతిభను కనబరుస్తున్న కృష్ణతో క్రైమ్ చిత్రం 'గూఢచారి 116' నిర్మించారు. ఈ చిత్రంలో కృష్ణ సమకాలీన నటుడు శోభన్‌బాబు చిన్న పాత్రను ధరించారు. మూడవ చిత్రంతో కృష్ణకు నూతన ఇమేజ్ వచ్చింది. గూఢచారి 116 సినిమా సంచలన విజయం సాధించి కృష్ణ కెరీర్ మలుపుతిప్పింది. కృష్ణకు ప్రేక్షకుల్లో ఆంధ్రా జేమ్స్‌బాండ్ అన్న పేరు వచ్చింది. అనంతరం 1968 'మంచి కుటుం బం' చిత్రంలో అక్కినేనితో కలిసి నటించి ఆయన ప్రశంసలందుకోవడంతో కృష్ణ దశ తిరిగింది. గూఢచారి 116 వల్ల కృష్ణకు వచ్చిన ఇమేజీ ప్రభావం చాలాకాలం పాటు ఉంది. 2 దశాబ్దాల్లో మరో 6 జేమ్స్ బాండ్ చిత్రాలు చేసిన కృష్ణకు దాదాపు అన్నీ విజయాన్ని సంపాదించి పెట్టాయి. ఈ విజయంతో కృష్ణ ఒకేసారి 20 సినిమా ల్లో హీరోగా బుక్ అయ్యారు. 1967లో కృష్ణ నటించిన ఆరు సినిమాలు విడుదల య్యాయి. వీటిలో ఇద్దరు మొనగాళ్లు అన్న జానపదచిత్రం, బాపు-రమణల తొలి

చిత్రం, విజయనిర్మలతో నటించిన మొదటి సినిమా అయిన సాక్షి, తర్వాతి కాలంలో కృష్ణతో అనేక విజయవంతమైన సినిమాలు తీసిన దర్శకుడు వి. రామచంద్రరావుతో తొలి కాంబినేషన్ మరపురాని కథ ఉన్నా యి. ఈ దశలోనే కృష్ణ వచ్చిన అవకాశా లన్నీ అంగీకరిస్తూ సినిమాలు చేశారు. 'ఎవరికి ఏ సినిమా ఎందుకు చేస్తున్నావో చూసుకునే తీరిక కూడా ఉండేది' కాదని చెప్పుకున్నారు. మోసగాళ్లకు మోసగాడు తొలి తెలుగు కౌబాయ్ సినిమా స్వంత ఇమేజ్, స్టార్‌డమ్ సాధించేందుకు స్థాపించిన నిర్మాణ సంస్థ పద్మాలయా రెండవ చిత్రంగా విడుదలై కృష్ణకు స్టార్‌డం సాధించిపెట్టిన సినిమా ఇది.

పరుగులు తీసిన సినీ పయనం

ఇక సూపర్ స్టార్ కృష్ణ సినీ జీవితం పరుగులు తీసింది. వెనుతిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. ఒక దశలో కృష్ణ నటించిన చిత్రాలు రికార్డు స్థాయిలో విడుదలై వాటి మధ్యనే పోటీ ఏర్పడింది. 1968లో కృష్ణ నటించిన 10 సినిమాలు విడుద లయ్యాయి. 1969లోరికార్డు స్థాయిలో 19 సినిమాలు విడుదలయ్యాయి. 1970లో 16 సినిమాలు, 1971లో 11 సినిమాలు, 1972లో 18 సినిమాలు, 1973లో 15 సినిమాలు, 1974లో 13 సినిమాలు, 1975లో 8 సినిమాలు విడుదలయ్యాయి. తీరికలేకుండా ఇంత కష్టపడి పనిచేసిన ప్పటికీ కుటుంబాన్ని ఏనాడూ అశ్రద్ధ చేయలేదు. కుటుంబంతో కలిసి భోజనం చేసేవారు. పిల్లలకోసం సమయం కేటాయిం చేవారు. అంతా ప్రణాళికా బద్ధంగా జీవన పయనం సాగించారు. కృష్ణ రోజుకు మూడు షిఫ్టుల చొప్పున విరామం ఎరుగక సినిమాలు చేయడం ప్రారంభించారు.

**పద్మాలయ సంస్థ స్థాపన**

సినిమా అవకాశాల మీద అవకాశాలు వస్తున్నా, విజయవంతం అవుతున్నా అప్పటివరకు నటునిగానే ఉన్నానని భావించిన కృష్ణ తనకు స్టార్‌డం తెచ్చిపెట్టే సినిమాలు తీయాలని ఆశించి 1970లో తన స్వంత నిర్మాణ సంస్థ పద్మాలయా పిక్చర్స్ ప్రారంభించారు. 1982 జులై 8న అప్పటి అవిభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి భవనం వెంకట్రామ్ పద్మాలయా స్టూడియోను ప్రారంభించారు. కృష్ణ తమ్ముళ్లు హనుమంతరావు, ఆదిశేషగిరిరావులు నిర్మాతలుగా వ్యవహ రిస్తూ నిర్మాణ వ్యవహారాలు పర్య వేక్షిం చారు. పద్మాలయా వారి మొదటి సినిమాగా అగ్నిపరీక్ష సినిమా నిర్మితమైంది. ఇది పెద్ద విజయం సాధించలేదు. అయితే రెండవ సినిమాగా 1971లో తీసిన మోస గాళ్లకు మోసగాడు మాత్రం భారీ విజయాన్ని, సాహసిగా కృష్ణకు పేరును తెచ్చిపెట్టింది. మోసగాళ్లకు మోసగాడు సినిమా ఆంగ్లంలోకి ట్రెజర్ హంట్ పేరిట అనువాదమై 123 దేశాల్లో విడుదలైంది. మంచి విజయాన్ని సాధించింది. కృష్ణ ఆశించిన విధంగా అతనికి స్టార్ హోదా సాధించిపెట్టింది. మోసగాళ్లకు మోసగాడు తొలి తెలుగు కౌబాయ్ సినిమా, స్వంత ఇమేజ్, స్టార్‌డమ్ సాధించేందుకు స్థాపించిన



నిర్మాణ సంస్త పద్మాలయా రెండవ చిత్రంగా విడుదలై కృష్ణకు స్టార్‌డం సాధించిపెట్టిన సినిమా ఇది. 1972లో నటుడు ప్రభాకర్ రెడ్డిని భాగస్వామిగా తీసుకుని కుటుంబ కథాచిత్రమైన పండంటి కాపురం నిరి ్మంచారు. ఇదీ మంచి విజయాన్ని సాధించింది. 1974లో సొంత బ్యానర్‌పై అల్లూరి సీతారామరాజు సినిమాతీశారు. 1973లోనే కృష్ణ, విజయనిర్మల కలిసి విజయకృష్ణా నిర్మాణ సంస్థని స్థాపించి విజయనిర్మల దర్శకురాలిగా తొలి సినిమా మలయాళంలోనూ, మలి చిత్రం తెలుగులోనూ తీశారు. విజయనిర్మల తెలుగులో కృష్ణ, తాను ప్రధాన పాత్రలుగా తీసిన తొలి సినిమా నవలా చిత్రం మీనా మంచి విజయాన్ని సాధించింది. ఈ దశలో కృష్ణకు అనేక క్రైమ్ చిత్రాలు మంచి విజయాలు సాధించిపెట్టాయి. 1968-1970 మధ్య కాలంలో పలు క్రైం సినిమాలు చేసినా 1970లో వచ్చిన 'పగ



సాధిస్తా' సినిమా కృష్ణ దశ మార్చింది. దీని తర్వాత రెండేళ్లలో కృష్ణ నటించిన ఎనిమిది క్రైం సినిమాలు విడుదలయ్యాయంటే దీని ప్రభావం అర్థం చేసుకోవచ్చు. ఆ తరువాత దాసరి కేశవరావుతో కలిసి శాయికృష్ణ పంపిణీ సంస్థను 1980లో ప్రారంభించారు. కృష్ణ నేతృత్వంలో 1984లో కృష్ణా ఎంటర్ ప్రైజెస్ ప్రారంభమైంది. హిందీ రంగంలో తమ సత్తా చాటాలని పద్మాలయ ఫిలిం డిస్ట్రిబ్యూషన్ సంస్థను స్థాపించారు. వారు విడుదల చేసిన 'పాతాళ భైరవి' అఖండ విజయాన్ని సాధించింది. ఆ తరువాత మహాగురు, హిందీ శంకరాభరణం చిత్రాలను పద్మాలయ విడుదల చేసింది. పద్మాలయ బ్యానర్‌పై కృష్ణ నిర్మించిన పలు భాషా చిత్రాలు అద్భుత విజయాలను సాధించాయి. వెలుగులు విరజిమ్మే సూర్యుడుతో పద్మాలయా విజయాలను అనేకమంది పోల్చారంటే ఎంతటి ఘన విజయాలు సాధించారో అర్థమౌతుంది.

**దర్శకుడిగా కృష్ణ**

'సింహాసనం' తరువాత కృష్ణ కలియుగ కర్ణుడు, ముగ్గురు కొడుకులు, కొడుకు దిద్దిన కాపురం చిత్రాలకు కృష్ణ దర్శకత్వం వహించారు.

**తొలికి నాంది**

కృష్ణ నటించిన తొలి సాంఘిక వర్ణ చిత్రం తేనె మనసులు. తొలి కౌబాయ్ చిత్రం 'మోసగాళ్లకు మోసగాడు. తొలి ఓ ఆర్‌డబ్ల్యూ రంగుల చిత్రం 'గూడుపుఠాణి'. తొలి ఫ్యూజీ కలర్ చిత్రం 'భలేదొంగలు'. తొలి సినిమా స్కోప్ చిత్రం 'అల్లూరి సీతా రామరాజు'. తొలి సాంఘిక స్కోప్ చిత్రం 'దాసు'. తొలి పౌరాణిక స్కోప్ చిత్రం 'కురుక్షేత్రం'. తొలి అపరాధ పరిశోధక స్కోప్ చిత్రం 'ఏజెంట్ గోపి'. తొలి సినిమా స్కోప్ త్రిపాత్రాభినయం చిత్రం 'కుమార రాజు'. తొలి తెలుగు అపరాధ పరిశోధక చిత్రం 'గూఢచారి 116'.



కృష్ణ కుమార్తెలు

తొలి తెలుగు ఆర్ట్ ఫిల్మ్ 'సాక్షి'. తొలిసారి పాటకు నేషనల్ అవార్డు వచ్చిన చిత్రం 'అల్లూరి సీతారామరాజు'. తొలిసారిగా నటించిన శత దినోత్సవం జరుపుకున్న చిత్రం (హీరోల్లో) తేనె మనసులు. తొలి 70 ఎం.ఎం. స్టీరియో సౌండ్ చిత్రం సింహాసనం. తొలిసారిగా ద్విభాషా చిత్రానికి దర్శకత్వం వహించిన తెలుగు హీరో కృష్ణ. భారతదేశంలో ఇంటర్నెట్ ఆన్‌లైన్‌లో విడుదలైన తొలి తెలుగు చిత్రం శ్రీశ్రీ. కేవలం 9 సంవత్సరాలలో 100 చిత్రాలు పూర్తి చేసుకున తొలి హీరో కృష్ణ.

**కృష్ణతో పరిశ్రమకు పరిచయమైన ప్రముఖులు**

అనేకమంది నటీనటులు, సాంకేతిక నిపుణులు, గాయకులు, సంగీత దర్శకులు కృష్ణ నటించిన సినిమాలతో పరిచయమ య్యారు. రావుగోపాలరావు, నరేష్, సాక్షిరంగారావు, ఆనంద్‌మోహన్, కె.వి.చలం, పెమ్మసాని రామకృష్ణ, అంజాద్‌ఖాన్(తెలుగు తెరకు), జయసుధ, వాణిశ్రీ, మంజుల, విజయశాంతి, రాధాకుమారి, జ్యోతిలక్ష్మి, మంజుభార్గవి, శుభ, హలం, జయశీల, సుమలత, మందా కిని (తెలుగు తెరకు), రూపాగంగూలీ (తెలుగు తెరకు), వర్ష, షహీన్ ఇత్యాది నటీనటులు పరిచయమయ్యారు. బాపు, పి.చంద్రశేఖరరెడ్డి, బోయిన సుబ్బారావు, కట్టా సుబ్బారావు, బీరం మస్తాన్‌రావు, ఎస్.పి.రాజారాం, విజయనిర్మల, పోసా ని కృష్ణమురళి, బిపిన్, శశీ గణేష్ ఇత్యాది దర్శకులు పరిశ్రమకు పరిచయమై నారు.

**రాజకీయాలలో..**

అభిమానుల కోరిక, రాజీవ్‌గాంధీ ప్రోత్సా హంతో కృష్ణ రాజకీయాలలోకి అడుగు పెట్టారు. 1989లో జరిగిన ఎన్నికల్లో ఏలూరు పార్లమెంటరీ స్థానం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి 80 వేల మెజారిటీ సాధించి ఢిల్లీ లోక్‌సభలో అడుగుపెట్టి ప్రమాణ స్వీకారం చేశారు. ఎం.పి.గా ఏలూరు నియోజకవర్గాన్ని కృష్ణ ఎంతగానో అభివృద్ధి చేశారు. రాజీవ్‌గాంధీ మరణంతో అనేక పార్టీలు ఆహ్వానించి నప్పటికీ రాజకీయాలకు స్వస్తి పలికారు.

సూపర్‌స్టార్‌కు తీరని కోరికలు

కృష్ణకు ఛత్రపతి శివాజీగా పూర్తి స్థాయి చిత్రంలో నటించాలనే కోరిక ఉండేదట. అన్ని సన్నాహాలు చేసుకుని ఆ చిత్రాన్ని నిలిపివేశారు. కొన్ని సన్నివేశాలు ముస్లింల మనోభావాలను దెబ్బతీసేవిగా ఉన్నాయని, తన అభిమానులలో అనేకమంది ముస్లింలు ఉన్న కారణంగా వారికి మనస్థాపం కలిగించడం ఇష్టం లేక ఛత్రపతి శివాజీగా నటించలేదని కృష్ణ పలు ఇంటర్వ్యూలలో తెలిపారు. కృష్ణ ఆంధ్రా జేమ్స్‌బాండ్‌గా పేరు తెచ్చుకున్నారు. తన తనయుడు మహేశ్‌బాబును జేమ్స్‌బాండ్‌గా చూడాలని ఆశపడ్డారట. కానీ మహేశ్‌బాబు కౌబాయ్‌గా నటించిన 'టక్కరి దొంగ' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో జేమ్స్‌బాండ్ రోల్ చేయడానికి మహేశ్‌బాబు మక్కువ చూపలేదు. ఆ కోరిక తీరలేదు. పెద్ద కుమారుడు రమేష్‌బాబు, మహేశ్‌బాబులతో కలిసి తెర పంచుకున్న కృష్ణకు మనవడితో నటించాలని ఉండేదట. కానీ అది కుదరలేదు. అమితాబ్ బచ్చన్ చేసిన కౌన్ బనేగా కరోడ్‌పతి లాంటి ఒక షో చేయాలని కోరుకునేవారు. ఓ సందర్భంలో స్వయంగా ఆయనే ఈ విషయాన్ని చెప్పారు కూడా. కానీ అది కార్యరూపం దాచలేదు. కృష్ణ కోరిక నెరవేరలేదు. స్వగ్రామాన్ని మరవని కృష్ణ స్వగ్రామమైన బుర్రిపాలెంలో పాటు తాను తిరుగాడిన తెనాలిని మరవలేదు. బుర్రిపాలెంలో కృష్ణ కుటుంబ సభ్యులు అనేక సేవా కార్యక్రమాలను చేశారు. అనేక సందర్భాలలో బుర్రిపాలెంలో చాలా చిత్రాలు చిత్రీకరించారు.





**టీ కప్పులో తుపానులు**

సూపర్‌స్టార్ కృష్ణ ఎవరితోనూ తగాదా వేసుకునే మనస్తత్వం కాదు. వివాదాలకు దూరంగా ఉంటారు. ఏదైనా చిత్రం పరాజయమైతే నిర్మాతకు భరోసా ఇచ్చే వారు. టీ కప్పులో తుపానులా కొన్ని వివాదాస్పద సంఘటనలు జరిగాయి. గాయ కుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాట పాడితే అచ్చంగా కృష్ణ పాడినట్లే ఉంటుంది. అటు వంటి బాలుతో మనస్పర్థలు రావడంతో చాలా చిత్రాలలో ఆయనతో తన చిత్రాలకు పాటలు పాడించలేదు. రాజ్ సీతారామ్ అనే నూతన గాయకుడితో చాలా కాలం పాడిం చారు. ఆ తరువాత బాలుతో కలిసిపో యారు. రాజకీయాలలో ప్రవేశించినప్పుడు అధిష్ఠాన వర్గం కోరిక మేరకు ఎన్టీఆర్‌ను విమర్శిస్తూ మండలాధీశుడు, నా పిలుపే ప్రభంజనం ఇత్యాది చిత్రాలలో ఎన్టీఆర్‌ని పోలిన వ్యక్తులను పెట్టి నిర్మించడం సంచలనం



అయింది. ఎన్టీఆర్ నిర్మించిన 'దాన వీర శూర కర్ణ'కు పోటీగా కృష్ణ 'కురుక్షేత్రం' నిర్మించారనే వాదన ఉంది. 1982లో తెలుగుదేశం పార్టీ పెట్టి ఎన్టీ రామారావు ఏడాదిలోపు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కావడం, రాజీవ్‌గాంధీ సహకారంతో కాంగ్రెస్‌తో అనుబంధం ఏర్పడడంతో కృష్ణ ఈ దశలో రాజకీయ నేపథ్యంలో పలు సినిమాలో నటించారు.

**కృష్ణ నిజాయితీ- సేవాకార్యక్రమాలు**

అల్లూరి సీతారామరాజు చిత్రం ప్రివ్యూ సందర్భంగా ఎలా ఉంది అని అందరినీ అడిగితే సూపర్ అని ముక్తకంఠంతో అన్నారు. కానీ దర్శక నిర్మాతఎల్వీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ చిత్రం తరువాత విడుదలైన కృష్ణ చిత్రాలు డజను వరకు అపజయం పాలౌతాయి అన్నారు. కారణం ప్రేక్షకుడు అల్లూరి సీతారామరాజు చిత్రం తరువాత కృష్ణ చిత్రాలను అదే స్థాయిలో ఊహించుకోవడమే అన్నారు. ఆ తరువాత అదే జరిగింది. నా చిత్రాలు ఇన్ని

పరాజయం అయ్యాయి అని ధైర్యంగా ఒప్పుకున్న ఏకైక హీరో సూపర్‌స్టార్ కృష్ణ. దివి సీమ ఉప్పెనలో నాశనమైనప్పుడు తాను విరాళాలు ఇవ్వడమే కాక పలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని విరాళాలను సేకరించి బాధితుల సహాయనిధికి అందించి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. దివి సీమ ఉప్పెన నేపథ్యంలో ఊరికి మొనగాడు అనే చిత్రాన్ని నిర్మించారు. ఒక్కమాటల్లో చెప్పాలంటే కృష్ణ లెక్కలేనన్ని సేవాకార్యక్రమాలు చేశారు.

### సినీ వ్యాపారంలో పట్టు

కృష్ణకు సినిమాల విషయంలో చాలా మంచి జడ్జిమెంట్ ఉండేది. సినిమా వ్యాపారం మీద మంచి అవగాహన, పట్టు, అంచనా ఉన్న నిర్మాత అతను. విడుదలైన సినిమాల కలెక్షన్లైనా, సినిమా ఆడబోయే రోజులెన్ని అన్నదైనా మంచి అంచనా ఉండేది. తాను నటించిన సినిమాల ఫలితం ఏమవుతుందో తెలుసుకోవడానికి విడుదలయ్యాక విజయవాడ వచ్చి సినిమా చూసి ప్రేక్షకుల స్పందన ఎప్పటికప్పుడు అంచనా వేసుకునేవారు. ఏ థియేటర్ కెపాసిటీ ఎంత అన్న దగ్గర నుంచి సినిమా వ్యాపారానికి సంబంధించిన లెక్కలు, అంచనాలు కృష్ణ చెప్తుంటే తోటి నటులు, సాంకేతిక నిపుణులు ఆశ్చర్యంగా వినేవారు. సినిమా వ్యాపారంలో స్టూడియో అధినేత, నిర్మాత, పంపిణీదారు, ఎగ్జిబిటర్ వంటి అన్నిదశల్లోనూ కృష్ణ సొంతంగానూ, భాగస్వామ్యంలోనూ వ్యాపారాలు చేసి అనుభవం గడించారు. సంక్రాంతికి సినిమాలు విడుదల చేసే సంక్రాంతి పోటీ విషయంలోనూ కృష్ణ రికార్డు సృష్టించారు. నాలుగు దశాబ్దాల సినీ కెరీర్‌లో 30 సంక్రాంతులకు కృష్ణ నటించిన సినిమాలు విడుదల అయ్యాయి. 1976 నుంచి 1996 వరకు 21 సంవత్సరాల పాటు ప్రతియేటా వరుసగా సంక్రాంతికి సినిమాలు విడుదల చేశారు. సంక్రాంతి విడుదల విషయంలో అక్కినేని నాగేశ్వర రావు (33 సంక్రాంతులు) ఎన్.టి రామారావు (31 సంక్రాంతులు) తర్వాత మూడవ స్థానంలో కృష్ణ నిలిచారు.

### కోలుకోలేని దెబ్బ

80 సంవత్సరాల వయస్సులో కృష్ణకు కోలుకోలేని దెబ్బలు అనేకం తగిలాయి. రెండవ భార్య విజయ నిర్మల మరణించడంతో కృష్ణ కకావికలమైనారు. ఆ తరువాత పెద్ద కుమారుడు రమేష్‌బాబు, ప్రథమ భార్య ఇందిరాదేవి మరణించడంతో కృష్ణకు కోలుకోలేని దెబ్బ తగిలింది.




ముగిసిన శకం తెలుగు చలన చిత్రసీమ పురుడు పోసుకున్న తర్వాత ఎంతో మంది తారలు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఇక మొదటి తరంలో ఎన్టీఆర్, ఏఎన్నార్ తెలుగు చిత్ర పరిశ్రమకు రెండు కళ్లలా మెలిగారు. ఆ తర్వాత తరంలో కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు టాలీవుడ్ త్రిమూర్తులుగా చక్రం తిప్పారు. తాజాగా సూపర్ స్టార్ కృష్ణ మృతితో తెలుగులో ఓ తరం శకం ముగిసింది. తెలుగు చలన చిత్ర సీమ పురుడు పోసుకున్న తర్వాత ఎంతో మంది తారలు తమ అదృష్టాన్ని పరీక్షించుకు న్నారు. ఓ నక్షత్రం నేల రాలింది. తెలుగు చలన చిత్ర స్వర్ణయుగంలో ఓ అధ్యాయం ముగిసిందనే చెప్పాలి.




### పురస్కారాలు

కృష్ణ సుదీర్ఘ నట జీవితంలో నటనకు గాను ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు. అల్లూరి సీతారామరాజు సినిమాలో అల్లూరి పాత్రలో చేసిన నటనకు 1974లో ఉత్తమ నటునిగా నంది పురస్కారం అందుకున్నారు. కమర్షియల్ విజయాలు అనేకం ఉన్నాయి. అంతేకాక తెలుగు సినిమా రంగంలో పలు సాంకేతిక మార్పులను ప్రవేశపెట్టడం, పలు విభిన్నమైన ప్రయోగాలు చేయడం వంటివి తెలుగు చలన చిత్ర రంగంలో కృష్ణ స్థానాన్ని ప్రత్యేకంగా నిలుపుతున్నాయి. ఈ పరంగా అతని సేవలను గుర్తిస్తూ 1997లో ఫిల్మ్‌ఫేర్ సౌత్ జీవిత సాఫల్య పురస్కారం, 2003లో ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, 2008లో ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, 2009లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం వంటి గౌరవాలు కృష్ణకు లభించాయి. ఆస్ట్రేలియా ప్రభుత ్వం కృష్ణను గౌరవిస్తూ ఓ పోస్టల్ స్టాంప్ కూడా విడుదల చేసింది. 1976లో కేంద్ర కార్మిక శాఖ మంత్రి కె.వి. రఘునాథరెడ్డి చేతుల మీదుగా కృష్ణ 'నటశేఖర' బిరుదును అందుకున్నారు. డేరింగ్, డాషింగ్ హీరోగా పేరు తెచ్చుకున్న కృష్ణ 2022 నవంబరు 15 ఉదయం 4.20కు అనారోగ్యంతో హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన మృతితో సినీ పరిశ్రమ శోకసంద్రంలో మునిగిపోయింది. ఆయన మంచి మనసు గలిగిన హిమాలయ పర్వతం. సాహసానికి ఊపిరి, ధైర్యానికి పర్యాయపదం, ధైర్యం, సాహసం, పట్టుదల, మానవత్వం, మంచితనం వీటి కలబోత సూపర్‌స్టార్ కృష్ణ. అటువంటి మహా మనిషి తెలుగు సినీ పరిశ్రమలోనే కాదు, భారత సినీ పరిశ్రమలోనే అరుదు అనే చెప్పాలి. వారు భౌతికంగా మన మధ్యలేకున్నా తాను నటించిన సినిమాల ద్వారా ఎప్పటికీ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారు. తెలుగు సినీ పరిశ్రమ సగర్వంగా తలెత్తుకోగల అనేక సహసాలు చేసిన కృష్ణకి అశ్రునివాళి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుందాం.






# పెద్దలు రాసిన పిల్లల కథలు

రెండు తెలుగు రాష్ట్రాల సాహిత్య, పత్రికా రంగాలలో పరిచయం అక్కర్లేని పేరు మణికొండ వేదకుమార్. వీరు చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమి చైర్మన్‌గా ఉంటూ, దాదాపు మూడు దశాబ్దాలుగా బాల వికాసం కోసం పని చేస్తూ 'బాల-చెలిమి' పత్రిక, బాల చెలిమి గ్రంథాలయాలు, ప్రతినెల నెలా బాల చెలిమి ముచ్చట్లు నిర్వహిస్తూ బాల సాహిత్యానికి ఎనలేని సేవ చేస్తున్నారు. బాలల్లో సాహిత్యాభిలాష చిగురించడానికి నిరంతరం కృషి చేస్తున్నారు. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ద్వారా పిల్లలు రాసిన అనేక పుస్తకాలను ముద్రించి, వారి రచనలు వెలుగులోకి తెస్తున్నారు. అదే క్రమంలో 2019 మార్చిలో సిద్ధిపేట జిల్లా జక్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాసిన కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. వేదకుమార్ సంకల్పానికి, బాల సాహితీవేత్తలు గరిపెల్లి అశోక్, పత్తిపాక మోహన్‌లు తోడయ్యారు. తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా బడి పిల్లలు రాసిన కథలను సేకరించారు.



చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో మెదక్-18, కరీంనగర్-25, నిజామాబాద్-18, వరంగల్-10, ఆదిలాబాద్-15, నల్గొండ-12, ఖమ్మం-18, మహబూబ్‌నగర్-13, రంగారెడ్డి-13, హైదరాబాద్-21 కథలను ఎంపిక చేసి, కథలకు అనుగుణంగా ఆయా జిల్లాలకు చెందిన చిత్రకారులతో అందమైన బొమ్మలు కూడా వేయించింది. ఉమ్మడి పది జిల్లాల పేరుతోనే 'బడి పిల్లల కథలు' సంకలనాలుగా అందమైన బొమ్మలతో, ఆకర్షణీయమైన ముఖచిత్రాలతో పుస్తకాలు రూపొందించింది.

అలాగే పిల్లల కోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన 'పెద్దలు రాసిన పిల్లల కథలు' ఉమ్మడి పది జిల్లాల పేరుతో పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించడమనేది బాల సాహిత్యంలో చారిత్రాత్మక ఘట్టం.



ఈ బాల సాహిత్య యాగం తెలంగాణకే పరిమితం కాకూడదని ఆంధ్రప్రదేశ్‌లోని బడి పిల్లల నుండి కథల సేకరణ ప్రారంభించారు. వాటిని కూడా జిల్లాల వారీగా పుస్తకాలు ముద్రించి విద్యార్థులకు అందించే ఆలోచనలో ఉన్నారు. బాల చెలిమి గ్రంథాలయాలు స్థాపించడం, బాల చెలిమి ముచ్చట్లు నిర్వహించడం, బాల చెలిమి పత్రికకు సంపాదకత్వం వహించడం, బాలలు రాసిన కథలను ముద్రించడం లాంటి అనేకానేక కార్యక్రమాలు కేవలం బాలల కోసమే నిర్వహిస్తున్న బాలల నేస్తం, అక్షర తపస్వి, వేదకుమార్ నుండి మరెన్నో సృజనాత్మక కార్యక్రమాలు పిల్లల లోకాన్ని ఆహ్లాదపరచాలని హృదయ పూర్వకంగా ఆశిస్తున్నాను.

ఏ సమాజంలో అయినా బాల సాహిత్యం కచ్చితంగా బాలల సమగ్ర వికాసం కోసం ఉపయోగ పడుతుంది. విద్యార్థులు కథల పుస్తకాలు చదవడం ద్వారా భాషా పరిజ్ఞానం పెరగడమే కాకుండా విషయ పరిజ్ఞానం కూడా పెరుగుతుంది. ఒక కథ ఒక సమస్యని పరిష్కరించేలా సహాయపడుతుంది. అనేక సామాజిక అంశాల ఇతివృత్తాలతో, సందేశాత్మక, నీతిని ప్రబోధించే కథలు విద్యార్థులను ఆలోచింపచేస్తాయి. సామాజిక స్ఫూర్తి కలుగుతుంది. తాము చదివిన కథల్లోని సామాజిక రుగ్మతలను, భవిష్యత్‌లో తొలగించాలి అనే నిర్ణయాలకు మొదటి అడుగులు ఇప్పుడే వేస్తారు. కనుక భాషాభిమానులు బాల సాహిత్యంకోసం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**(పెద్దలు రాసిన పిల్లల కథలు, రచన: మణికొండ వేదకుమార్.ప్రతులకు: బాలచెలిమి, భూపతి సదన్, 3-6-716, హిమాయత్‌నగర్, హైదరాబాద్)**

**- దుర్గమ్ భైతి**

## పుస్తక సమీక్ష

## 'ఒక దేశం- అనేక ప్రశ్నలు'



'ఒక దేశం అనేక ప్రశ్నలు' సమకాలీన ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రజల ప్రశ్నల సమాహారమైన వ్యాససంపుటి మేకిరి దామోదర్ (మేదాజీ) పత్రికా వ్యాసరచయితగా పాలనా వ్యవస్థ పారదర్శకత, సామాన్య పౌరుడు ఎదుర్కొనే సమస్యలకు సామాజిక స్పృహతో పరిష్కారం సాధించే ఆలోచనలతో ప్రశ్నలకు పట్టాభిషేకం చేయటం ఈ వ్యాసాలలో స్పష్టమవుతోంది. వ్యవస్థాపరమైన లోపాల కారణంగా సమాజంలోని సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న అవకతవకలను ఎత్తి చూపించడమే కాకుండా ప్రజాపాలకులు ప్రశ్నించేతత్వాన్ని అణచివేసే వైఖరులపై మేకిరి దామోదర్ ధ్వజం ఎత్తారు. సుమారు 51 వ్యాసాలు ప్రచురించబడిన ఈ సంపుటి, అమలుకు నోచుకొని మహిళాబిల్లు, మార్కెట్ మాయాజాలంలో ప్రపంచం, రైతేరాజు కావాలి, రాజకీయ ప్రక్షాళన తక్షణ అవసరం, రాజ్యాంగ అమలుపై పాలకుల తీరు, అమ్మభాషను కాపాడుకుందాంవంటి వైవిధ్య భరితమైన అంశాలు చోటు చేసుకొన్నాయి. సమకాలీన జీవనస్థితిగతులలో ఉపాధ్యాయునిగా, రచయితగా, ఉద్యమకారునిగా పాలకులు తమ బాధ్యత సక్రమంగా నిర్వర్తించాలని అభిలషిస్తూ సూటిగా ప్రశ్నించే నైజంతో చైతన్యవంతమైన సమాజ నిర్మాణాన్ని రచయిత అభిలషిస్తారు. రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య విలువల పునాదులపై నిలబడాలని ప్రజలు అవినీతి రాజకీయాలను ప్రక్షాళనకు ఓటు వజ్రాయుధంగా ప్రజాస్వామ్య ప్రతిష్ఠను పరిరక్షించాలని రచయిత నిర్మాణాత్మకంగా మార్గ దర్శనం చేస్తారు. ప్రశ్నకు తన పుస్తకం అంకితమివ్వడం మేదాజీ రచనా ఔన్నత్య విలువలకు నిదర్శనం. (ఒక దేశం అనేక ప్రశ్నలు, రచన: మేకిరి దామోదర్ (మేదాజీ), వెల: రూ100, ప్రతులకు: ఇ.నం.23-6-234/4/ఎ, న్యూశ్యాంపేట్, టైగర్ హిల్స్ కాలని, హంటర్ రోడ్, హన్మకొండ, వరంగల్-506001) **- ఎర్రమిల్లి**



# కొరవడిన మహిళల భద్రత

డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి,
సైకాలజిస్ట్

భారతీయులు ప్రపంచానికి గురువులని చాలమంది కీర్తిస్తుంటారు. సనాతన ధర్మాలకు, మానవ విలువలకు, సంస్కృతికి మన దేశం నిలయంగా చెప్పుకుంటాం. వేల సంవత్సరాల నుంచి భారతీయులు మహిళలను దేవతలుగా పూజిస్తున్నారు. దేవుడు అయినా, మనిషి అయినా వారి పేరుకంటే ముందు వారి భార్య పేరు రాస్తుంటాం. ప్రతి స్త్రీలో మాతృత్వాన్ని చూడటం సాంప్రదాయంగా పాటిస్తున్నాం. మన దేశంలో ప్రాణం కంటే శీలం(గుణసంపద) గొప్పదని భావిస్తాం. ఇంత సుసంపన్నమైన విలువలతో కూడినట్లు చెప్పుకునే మన దేశంలో ఇప్పుడు మహిళల పరిస్థితి అతిదారుణంగా తయారవుతున్నదని సామాజికవేత్తలు ఆందోళన చెందుతున్నారు. మహిళల రక్షణ సూచిలో మన దేశం 133వ స్థానంలో ఉందని సర్వేలు చెపుతున్నాయి. మన దేశంలో ప్రతిరోజు సగటున 80 మందికి పైగా మహిళలు అత్యాచారా నానికి గురవుతున్నారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఏడాదికి ఏడాది మహిళలపై జరుగుతున్న దాడులు పెరిగిపోతున్నాయి. 2020 సంవత్సరంతో పోలిస్తే 2021వ సంవత్సరం 15.3 శాతం నేరాలు పెరిగాయని స్పష్టంగా తెలుస్తోంది. 2021వ సంవత్సరం 4,28,278 కేసులు నమోదయ్యాయి. 2022వ సంవత్సరంలో మహిళలపై నేరాలు, దాడుల కేసులు పెరుగుతు న్నాయి తప్ప తగ్గడం లేదని అంటున్నారు. దేశ రాజధాని ఢిల్లీలోనే మహిళలకు తగిన రక్షణ లేదని నేషనల్ క్రైం రిపోర్ట్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బి) నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2020 సంవత్సరంతో పోలిస్తే ఢిల్లీలో మహిళలపై 2021వ సంవత్సరం 40 శాతం ఎక్కువ నేరాలు జరిగాయని రిపోర్టులు వెల్లడిస్తున్నాయి. ఇలా మన లెక్కలు చూసుకుంటూ పోతే కడుపు చించుకుంటే కాళ్లపై పడిన చందంగా ఉంటుంది. మహిళలు, బాలికల రక్షణ కోసం నిర్భయ, పోక్సో, దిశ లాంటి చట్టాలను ప్రభుత్వం తీసుకొచ్చింది. అయినా మన సమాజంలోని కొందరు మానవ మృగాల్లో మార్పు రావడం లేదు. మహిళల హక్కులకు అనేక రూపాల్లో భంగం కలుగుతున్నది. మహిళల హింసపై నమోదవుతున్న కేసుల్లో గృహ హింస ప్రథమ స్థానం పొందింది. మొత్తం కేసుల్లో గృహ హింస కేసులు 30 శాతం కాగా, బయట, పనిచేసే స్థలాలలో 21 శాతం, కిడ్నాప్‌కేసులు 19 శాతం, మిగిలిన పలు రకాల కేసులు 30 శాతం ఉన్నాయని సర్వేల ద్వారా తెలుస్తోంది. రామాయణంలో రావణుడు సీతను అపహరించి నప్పటికీ ఆమెకు ఎలాంటి హాని చేయలేదు. మహాభారతంలో దుర్యోధనుని ఆదేశంతో దుశ్శాసనుడు ద్రౌపదిని వివస్త్రను చేయడానికి ప్రయత్నించాడు. ఆ రోజుల్లో ఆ సంఘటనలే వారి వినాశనానికి కారణం అయ్యాయి. అయితే ఇప్పుడు మహిళలు, బాలికలు ఒంటరిగా దొరికితే అత్యాచారం, సామూహిక అత్యాచారాలకు తెగబడుతున్నారు. వికలాంగులు, బుద్ధిమాంద్యం వున్నవారు, వృద్ధులు, చిన్నారి బాలికల్ని కూడా కిరాతకంగా అనుభవించి వదిలి పెడుతున్నారు. కొన్ని సందర్భాలలో అత్యాచారం చేసి ఆఖరికి హత్య చేసి పారిపోతున్నారు. ఈ దురాగతాలను చూసిన తరువాత తల్లిదండ్రులు ఆడపిల్లల్ని ఒంటరిగా బయటికి పంపడానికి భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో సమాజంలో సగమైన మహిళల్ని రక్షించుకోవడం ఎలా అన్నది ప్రశ్నగా మిగిలింది. కారణాలు అన్వేషిస్తేగానీ పరిష్కారాలు స్ఫురించవని మేధావులు అంటున్నారు.

### కారణం ఎవరు?

మహిళలు బాలికలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, లైంగిక వేధింపులకు కారణం ఎవరంటే వెంటనే సమాధానం చెప్పడం కష్టం. దీనికి అనేక సామాజిక, మానసిక, చట్టపర, వ్యవస్థీకృత అంశాలు కారణంగా చెప్పవచ్చు. మన సమాజంలో రాను, రాను విలువలు క్షీణిస్తున్నాయి. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, మార్కులు, ర్యాంకుల మోజులో పడి విలువలను నేర్పించడం మరచిపోతున్నారు. ఉమ్మడి కుటుంబాలు క్షీణించిపోవడంతో పిల్లలకు నీతి, నియమాలు నేర్పించేవారు కరువయ్యారు.

కుటుంబ మానవ సంబంధాలు క్షీణించిపోవడంతో స్వార్థ ప్రయోజనాలు పెరిగిపోయాయి. డబ్బు సంపాదన, విలాసవంత మైన జీవితాలకు అలవాటు పడిన వ్యక్తులు నీతి, నియమాలకు తిలోదకాలు ఇస్తున్నారు. ఇదిలా ఉండగా ఆధునిక సాంకేతిక ప్రగతి విజ్ఞానంతో పాటు వింత పోకడలను సమాజానికి

అందిస్తోంది. సినిమాలు, టి.వి.కార్యక్రమాలు, ఇంటర్నెట్, యూట్యూబ్, సోషియల్ మీడియాలో చాల అపశృతులు చోటు చేసుకుంటున్నాయి. అనేక కారణాల వల్ల వాటిని పూర్తిగా నియంత్రించడం, కట్టడి చేయడం కష్టంగా ఉంది. సమాచారం, విజ్ఞానం, వినోదం, విద్యను అందించడానికి ఉద్దేశించిన మీడియాలో కొంత భాగం పక్కదారి పడుతున్నది. అశ్లీల దృశ్యాలు, నీలి చిత్రాలను అన్ని వయస్సులవారు యధేచ్ఛగా చూసే పరిస్థితులు దాపురించాయి. అరచేతిలో విశ్వంతో పాటు, విధ్వంసం, అశ్లీలం కూడా కనిపిస్తోంది. ప్రతికూల అంశాలు పురుషులకు ప్రేరకాలుగా మారుతున్నాయి. ఒక్కోసారి నియంత్రణ కోల్పోయి నేరాలకు పాల్పడేలా చేస్తున్నాయి. నేరాలు చేయడం, తప్పించుకోవడం లాంటి అంశాలను కూడా మీడియా ద్వారా నేర్చుకుంటున్నారు. అంటే మీడియా వల్ల ప్రతివారు చెడిపోతారని చెప్పడం లేదు. మానసికంగా రుగ్మతలతో బాధపడేవారికి మీడియా ప్రకోపించే ప్రేరకంగా మారుతున్నది. దీనికితోడు కొందరు మానసిక రోగులు చికిత్స చేయించుకోకుండా సమాజంలో తిరుగుతున్నారు. అసాంఘిక ప్రవృత్తి, సైకోసిస్, శాడిజం, లైంగిక వైపరీత్యం లాంటి కొన్ని ప్రవర్తక లోపాలు, రుగ్మతలు ఉన్నవారు నిస్సంకోచంగా నేరాలకు పాల్పడటం జరుగుతున్నది. పైగా ఇలాంటివారు నేరాలు చేసి హీరోల్లా బయట తిరుగుతున్నారు. ఇలాంటి వారిని పట్టుకుని శిక్షించడం లేదా నియంత్రించడంలో మన వ్యవస్థలు అనేక విధాలుగా విఫలం చెందుతున్నాయని చెప్పక తప్పదు. నేరాలు జరిగిన వెంటనే నిందితులను పట్టుకుని శిక్షించడంలో మన పోలీసులు, న్యాయస్థానాలు పూర్తి స్థాయిలో సఫలం కావడం లేదని చెప్పక తప్పదు. కొందరు పోలీసులు రాజకీయ పలుకుబడి, లంచాలకు లొంగి నేరస్తులను తప్పిస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఒకవేళ పకడ్బందీగా కేసులు పెట్టినా కోర్టులో తీర్పు రావడానికి ఏళ్లు పడుతుంది. అత్యాచారం, హత్య, కిడ్నాప్ లాంటి తీవ్రనేరాలు చేసినవారు సైతం వారం నుంచి నెల లోపల బెయిలుపై బయట తిరగగలుగుతున్నారు. ఏళ్ల తరబడి కోర్టులో పెండింగు ఉండటం వల్ల ఆఖరికి సాక్షులు లేక, రాక తారుమారై కేసులు కొట్టివేసే పరిస్థితులు తలెత్తుతున్నాయి. దీంతో నేరం చేసేవారికి భయం కలగడంలేదు. కొంత మంది మానసిక రోగులు వ్యసనపరులు కూడా మహిళల్ని వేధిస్తుంటారు. తాగుడు, మాదక ద్రవ్యాల వినియోగం, ఇతర వ్యసనాలకు బానిస అయిన భర్తలు భార్యలను అనేక రకాలుగా హింసిస్తుంటారు. అలాగే శాడిస్టులు



భార్యా పిల్లలను హింసకు గురి చేస్తుంటారు. అనుమానపు రుగ్మత (ప్యారనాయిడ్ సైకోసిస్) ఉన్న భర్తలు భార్యలను అనుమానించి అవమానాలకు గురి చేస్తుంటారు. ఇలాంటి వారికి చికిత్సలు చేయడానికి ఎవరూ ప్రయత్నించడంలేదు. అవన్నీ వారి ప్రవర్తన, ప్రవృత్తి, ఇష్టాలు, ఆలోచనలుగా భావించి భార్యలనే సర్దుకోమని సలహాలు ఇస్తున్నారు. పోలీసుస్టేషన్‌లో ఉన్న సలహా కేంద్రాలు కోర్టులో ఉన్న మధ్యవర్తిత్వ కేంద్రాలలో కూడా ఇదే తంతు కొనసాగుతున్నది. రుగ్మతలను గుర్తించి చికిత్స చేయించడానికి అక్కడ తగిన వ్యవస్థ లేదు.

అన్నింటికీ ఒకే మందు అన్నట్టు భార్యాభర్తలు అన్నాక సర్దుకోవాలి, ఇంటిగుట్టు కాపాడుకోవాలి, పిల్లల కోసం కలిసివుండాలి.. లాంటి మాటలు చెప్పటమే కౌన్సెలింగ్ అన్న భావన కనిపిస్తోంది. సమస్యలకు మూలాలు అన్వేషించి సరైన పరిష్కార మార్గాలు సూచించేవారు అతితక్కువ శాతం మాత్రమే ఉన్నారు. కొంతమంది వృద్ధులు ప్యారాఫిలియా, ఫిదోఫిలియా లాంటి తీవ్రమైన లైంగికపర రుగ్మతలతో బాధపడుతుంటారు. ఇలాంటివారు చిన్నారి బాలలు, మైనర్ బాలికలను లైంగికంగా వేధించడం, దాడులు చేయడం లాంటి నేరాలకు పాల్పడుతుంటారు. అలాంటి సంఘటనలు బయటికి వచ్చినపుడు ఏదో విధంగా అణచిపెట్టడానికే చూసుకుంటారు తప్ప ఆ వృద్ధులకు చికిత్స చేయించడానికి ప్రయత్నం చేయరు. ఈ నేపథ్యంలో సమాజంలో మార్పుకోసం, నేర స్వభావుల్లో పరివర్తన కోసం గట్టిగా కృషి చేయాలి.

**పటిష్ట రక్షణ అవసరం**

మహిళలు, బాలికల రక్షణకు తగిన చర్యలు అవసరం. సహజంగా మహిళలపై జరిగే నేరాలు, దాడులను వివిధ రకాలుగా వర్గీకరిస్తుంటారు. మానభంగాలు, అపహరణ, హత్యలు, వరకట్న చావులు, లైంగిక వేధింపులను నేరపూరిత హింసలుగా చెపుతుంటారు. ఆడపిల్లల్ని గర్భంలోనే తొలగించడం, ఆడపిల్లల్ని వేధించడం, కట్నంకోసం వేధించడం ఉన్నాయి. అయితే వాటిని పటిష్టంగా అమలు చేయడంలో కొంత అలసత్వం, లోపాలు కనిపిస్తున్నాయని చెప్పక తప్పదు.

ప్రభుత్వం, పోలీసులు, న్యాయస్థానాలు చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయడానికి కృషి చేయాలి. మహిళా పోలీసుల స్టేషన్లను పెంచాలి. అలాగే మహిళా న్యాయస్థానాలు, న్యాయమూర్తుల సంఖ్య పెంచాలి. మహిళలు, బాలికలపై జరిగే నేరాలను సత్వరం విచారించి కఠినంగా శిక్షించడానికి తగిన వసతులు, విధానాలు రూపొందించాలి. నేరాలు జరిగిన తరువాత కనీసం ఏడాదిలోపల విచారణ పూర్తి చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి. చట్టాలు కఠినంగా ఉన్నంత మాత్రాన సరిపోదని, వాటి అమలు కఠినంగా ఉండాలని సామాజికవేత్తలు సూచిస్తున్నారు. దీనికితోడు సమాజంలో పరివర్తన తీసుకురావడానికి ప్రతిఒక్కరు కృషి చేయాలి.

**(మిగతా 27వ పేజీలో)**





కథ

# గద్ద చేసిన మేలు

రుద్రకోన అనే అడవిలో ఒక తెల్లని పావురం ఒక చందన వృక్షం మీద ఆనంద నిలయం లాంటి అందమైన గూడును నిర్మించి తన ముగ్గురు పసికూనలతో కలసి నివసిస్తోంది. ఒకరోజు ఆ పావురం పిల్లలకు ఆహారం తీసుకురావడానికి గూడు విడిచి దూరంగా వెళ్లింది. అలా ఆహారాన్ని తీసుకువస్తుండగా ఉరుములు మెరుపులతో పెద్ద గాలివాన మొదలయింది. దాంతో పావురం తిరిగి వెళ్లలేకపోయింది. పావురం ఒక గుబురు వృక్షం వెదకి తల దాచుకోడానికి ఆ చెట్టుకొమ్మపై వాలింది. ఆ చెట్టుకు ఒక తొర్ర వుంది. ఆ తొర్రలో మూడు గుడ్లగూబ పిల్లలున్నాయి. ఆ పిల్లల తల్లి కూడా ఎక్కడికో వెళ్లినట్లుంది. ఎప్పుడు తిన్నాయో ఏమో ఆకలితో నకనకలాడుతున్నాయి. పావురం వచ్చి వాలగానే ఆహారం అందించడానికి ఎవరో వచ్చారని పావురంవైపు చూస్తూ నోళ్ల తెరిచి అరవసాగాయి. మొదట్లో పావురం వాటి గురించి పట్టించుకోలేదు. ఎందుకంటే గుడ్లగూబజాతి అంటే అసహ్యం. వాటిది వికృత రూపం. కనుగుడ్లు అటు ఇటు కదలక నేరుగా చూస్తూ భీతి గొల్పుతూ వుంటాయి. అవి రాత్రిళ్లు మేల్కొంటాయి.

తన దగ్గరున్న ఆహారాన్ని గుడ్లగూబ పిల్లలకు పెట్టాలనిపించలేదు. క్షణ క్షణానికి వాటి ఆకలికేకలు ఎక్కువవుతుంటే పావురంతల్లి మనస్సు చలించిపోయింది. జాతిభేదం మరచిపోయింది. తన పిల్లలు గుర్తుకు రాలేదు. తన దగ్గరున్న ఆహారాన్ని ఆ పిల్లలకు ప్రేమగా అందించింది. వాటి ఆకలి తీరడంతో అవి హాయిగా నిద్రపోయాయి. తను ఒక మంచి పని చేశానని ఆనందించింది పావురం.

ఇక్కడ పావురం గుడ్లగూబ పిల్లలపై ప్రేమ కురిపిస్తూ వుంటే అక్కడ పావురంపిల్లలు ఎడతెగని గాలివానకు తల్లడిల్లిపోతున్నాయి. ఆకాశం ఉరిమినప్పుడల్లా పిల్లలు ఉలిక్కిపడుతున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో అక్కున చేర్చుకోవాల్సిన తల్లి చెంత లేక పోవడంతో అవి పూర్తిగా ధైర్యాన్ని కోల్పోయాయి. ఇలా వుండగా పావురం పిల్లలకు మరో ప్రమాదం ముంచుకొచ్చింది. వర్షం నుండి తల దాచుకోవడానికి ఒక గద్ద పావురం పిల్లల గూటి పక్కన వచ్చి వాలింది. చూడగానే భయం కలిగించేలా యమదూతలా వుంది అది. అప్పుడు దానికి చాలా ఆకలిగా వుంది. పక్కనే తనకు ఆహారం కాగల పావురం పిల్లల్ని చూసి ఆనందంతో రెక్కలు అల్లార్చింది. గద్దను చూడగానే వాటి గుండెలు జారిపోయాయి. తాము గద్దకు ఆహారంగా మారడానికి ఇక ఎంతో సమయం పట్టదని అవి ఏడుస్తూ ఒకదాని చాటున మరొకటి దాక్కోసాగాయి.

అలా అవి భయపడుతుంటే ముచ్చటగా వున్నాయి. అటువంటి పసికూనల్ని ఎందుకు చంపి తినాలని అనుకుంది. అకస్మాత్తుగా వాటిపై ప్రేమ పుట్టుకొచ్చింది. జాతివైరాన్ని మరచిపోయి సరదాగా వాటితో గద్ద ఆడుకోసాగింది. పిల్లలు భయం వదిలేసి గద్దకు చెలిమి అయ్యాయి. పావురం కడగండ్లు అంతిటితో ముగియలేదు. పావురం పిల్లలు వుంటున్న చెట్టుకు కొద్ది దూరంలో ఒక పాముపుట్ట వుంది. అందులో వున్న విషసర్పం అంతకుముందు రోజు పావురం పిల్లల్ని చూసింది. తల్లిపావురం వుండగా వాటిని కబళించడం కష్టమని వేచి వుంది. పావురం గూడు విడిచి వెళ్లగానే చెట్టుపైకి పాకుతూ బయలుదేరింది. అది గద్ద కళ్లలో పడింది. దానికి దుర్గతి ప్రాప్తించింది. పావురం పిల్లల్ని కాపాడాల్సిన కర్తవ్యం తన మీద వుందని గుర్తించింది గద్ద. అదే సమయంలో తన ఆకలి కూడా తీరాలి. వెంటనే పావురంపిల్లల కోసం వస్తున్న సర్పాన్ని చంపి వాటిని కాపాడింది. చంపిన పాముతో ఆకలి తీర్చుకుంది. ఆ తరువాత గాలివాన తగ్గగానే వెళ్లిపోయింది.

చేతనైతే కష్టాల్లో వున్నవారికి సహాయపడాలి. ప్రేమను పంచితే ప్రేమ దక్కుతుంది. జగమంత ప్రేమమయం అవుతుంది. తరువాత గూటికి చేరుకున్న పావురం జరిగిన సంగతి తెలుసుకొని చాలా సంతోషించింది.

**- గుండ్రాతి సుబ్రహ్మణ్యం గౌడు**








# పిల్లల హరివిల్లు

వార్త ఆదివారం

## బాలగేయం

### చీమనమ్మ చీమను



నేను రాణీ చీమను
చీమలన్నిటికి
పెద్దను నేను
నేను చెప్పినట్లు
నడుతురు వాళ్లు
ఎవరే పని
చేయ్యాలో
నేనే చెబుతాను
తెచ్చిన ఆహారం
సమంగా తింటాం
మాలో మాకు
గొడవలు లేవు
ఐకమత్యంగా
మేముంటాం
పరాయి చీమలొస్తే
ఎదిరించి నిలబడతాం
చీమనమ్మ చీమను
నేను రాణి చీమను

**- వైదా ఈశ్వరరావు**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- కె.అనూష,** కనిగిరి

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వలస సమయాలలో పక్షులకు ఆహారం ఎలా?

**జవాబు: అనూష!** పక్షులు తమ వలస సమయాలలో బృందాలతో కలిసి ప్రయాణిస్తుంటాయి. మధ్య మధ్యలో ఆహార నిమిత్తం అన్వేషణలు చేయలేవు. వలస సమయానికి పక్షులు తమకు అవసరమైదానికంటే ఎక్కువ ఆహారాన్ని తీసుకుని కొవ్వు రూపంలో శక్తిని నిలువ చేసుకుంటాయి. మరీ అవసరమైతే మధ్య మధ్యలో చెరువుల ఒడ్డుల మీద విశ్రాంతి తీసుకుంటూ, సేద తీర్చుకుంటూ ఆహారాన్ని సంపాదించి నోట కరుచుకుని ప్రయాణం సాగిస్తాయి.

**- పి.వాగ్దేవి,** విజయనగరం

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కీటకాలకు చెవులుంటాయా?

**జవాబు: వాగ్దేవి!** మనకున్నట్లు క్రిమికీటకాలకు చెవులుండవు. అయినప్పటికీ అవి ధ్వనిని గ్రహించగలుగుతాయి. మన చెవిలో వినికిడికి అవసరమైన 'ఇయర్ డ్రమ్' వున్న తరహాలోనే వాటి శరీరంలో 'టింఫానిక్ లేయర్' (వినికిడిశక్తి గల పొరగా చెప్పుకోవాలి) ఉంటుందని శాస్త్రవేత్తలు వివరించారు. ఆ వివరాల ప్రకారం వినికిడికి ఉపయోగపడే ఈ టింఫానిక్ లేయర్ కొన్ని కీటకాల్లో బాహ్య అస్థిపంజరంలో ఉంటుంది. మరికొన్నింటిలో ముందుకాళ్లల్లోగానీ, ఉదరం కిందగానీ ఉంటుంది. కొన్ని కీటకాలలో అయితే ప్రత్యేకంగా వాటి చర్మం మీద వున్న వెంట్రుకలే శబ్దాలను వినగలవు. సహజంగా కీటకాలు తమ తోటి కీటకాలను కలుసుకోవడానికి శబ్దాలను చేయడం అలవరచుకుంటాయి. కొన్ని కీటకాలయితే తమను తాము రక్షించుకోవడానికి శబ్దాలను ఉపయోగించుకుంటాయి. ఉదాహరణకు గబ్బిలాలు ఎగురుకుంటూ ఆహారాన్ని అన్వేషించే సందర్భంలో వెలువడే శబ్దాలను గ్రహించిన కొన్ని రకాల కీటకాలు, పురుగులు తమను తాము కాపాడుకుంటాయి.







# ఇక్కడ సూర్యుడు అస్తమించడు

ఈ విశాల భూ ప్రపంచంలో ప్రకృతి అందాలు, అద్భుతాలకు ఎటువంటి కొదవ లేదు. ఏదో ఒక చోట చిత్రాతి విచిత్రాలకు సంబంధించిన రహస్యం దాగి ఉంటూనే ఉంది. భూమి మీద సూర్యోదయం, సూర్యాస్తమయం సహజం. సాధారణంగా సూర్యుడు తూర్పున ఉదయించి, పడమర అస్తమిస్తాడు. ఒక రోజులో 12 గంటలు పగలు, మరో 12 గంటలు రాత్రి ఉంటుంది. అయితే వర్షాకాలం, తుపాన్ సమయాల్లో రెండు, మూడు రోజులు సూర్యోదయం కనిపించదు. కానీ కొన్ని ప్రాంతాల్లో నాలుగు నెలల పాటూ రాత్రే ఉంటుంది. ఆర్కిటిక్ వలయం పరిధిలోని కొన్ని చోట్ల చలి కాలంలో రోజుల తరబడి రాత్రే ఉంటుంది. నెలలు గడచినా సూర్యోదయం కాదు. ఈ ప్రాంతాల్లో రెండు నెలల పాటు రాత్రి ఉంటే, మరికొన్ని ప్రాంతాల్లో నాలుగు నెలలూ చీకటే ఉంటుంది. అందులో భాగమే అర్ధరాత్రి సూర్యుడు ఉదయించడం. మరికొన్ని ప్రాంతాల్లో 24 గంటలూ సూర్యుడు వెలుగుతూనే ఉంటాడు. దీంతో అర్ధరాత్రి అయినా అక్కడ పట్టపగల్లాగానే ఉంటుంది. ఆశ్చర్యంగా ఉంది కదూ. కానీ ఇది నిజం. భూమి ధ్రువాల చుట్టూ ఉన్న ప్రాంతానికి పరిమితమైన ఈ అద్భుతమైన, అత్యంత సుందరమైన దృశ్యాన్ని వీక్షించాలని ప్రతీ ఒక్కరూ కోరుకోవడం సర్వసాధారణం. ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతాల్లో వేసవి నెలల్లో అర్ధరాత్రి దాటిన తర్వాత అక్కడ సూర్యుడు ఉదయిస్తాడు. అంటే అక్కడ 24 గంటలూ సూర్యుడు వెలుగుతూనే ఉంటాడు. అలాంటి రవి అస్తమించని, అర్ధరాత్రి ఉదయించే ప్రకృతి అద్భుతమైన ప్రదేశాల గురించి మనం తెలుసుకుందాం.

**నార్వే**

నార్వేని అర్ధరాత్రి సూర్యుడు ఉదయించే ప్రాంతంగా పిలుస్తారు. ఏడాదిలో చాలా కాలం పాటు నార్వేలో సూర్యుడు అస్తమించడు. అర్ధరాత్రి కూడా పట్టపగలు మాదిరి ఎండ కొడుతుంది. అందుకే నార్వే దేశాన్ని అర్ధరాత్రి సూర్యుడు ఉదయించే ప్రాంతం (ల్యాండ్ ఆఫ్ మిడ్ నైట్ సన్) అని కూడా పిలుస్తారు. అక్షాంశానికి ఎక్కువ ఎత్తులో ఉండటం వల్లే ఇక్కడ కొద్ది రోజుల పాటు సూర్యుడు అసలు అస్తమించడు. ఇక్కడ నివసించే ప్రజలు మిడ్ నైట్ సన్ సౌందర్యాన్ని ఎదుర్కొంటుంటారు. మే, జూలై నెలల మధ్య దాదాపు 76 రోజుల పాటు ఇక్కడ సూర్యుడు అస్తమించకుండా ప్రకాశిస్తూనే ఉంటాడు. అయితే ఒక్కొక్కసారి ఒక రోజులో కేవలం నాలుగు గంటలు మాత్రమే సూర్యుడు మబ్బుల చాటుకు వెళుతుంటాడు. నార్వేలోని స్వాల్ బార్డ్‌లో ఏప్రిల్ నెల 10వ తేదీ నుండి అగస్టు నెల 23వ తేదీ వరకూ సూర్యుడు నిరంతరం ప్రకాశిస్తూనే ఉంటాడు. అర్ధరాత్రి సూర్యుడిని అన్వేషించాలనుకునేవారు ఎవరైనా ఉంటే ఈ ప్రదేశానికి వెళ్లడం ఉత్తమం.






## అలస్కా

యునైటెడ్ స్టేట్స్ అయిన అమెరికాకు చెందిన అలాస్కా విశాలమైన నగరం. అలస్కాలోని బోరోలో కొన్ని నెలల పాటు సూర్యుడు అస్తమించడు. అందుకనే ఈ ప్రాంతాన్ని అర్ధరాత్రి సూర్యుడు ఉదయించే ప్రాంతంగా కూడా పిలుస్తుంటారు. కానీ నవంబర్ నెలలో 30 రోజులు మాత్రం చీకటిగా ఉంటుంది. దీన్నే పోలార్ నైట్ అని పిలుస్తారు. అలస్కాన్ స్థానిక సంస్కృతి, మెరిసే మంచుతో కప్పబడిన పర్వతాలు. హిమానీనదాలకు ప్రసిద్ధి చెందింది ఈ ప్రాంతం. మే నెల చివరి నుండి జులై చివరి వరకూ, ఆ తర్వాత చలికాలంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అలాస్కాలోని బారో అనే నగరంలో మాత్రం 24 గంటలూ సూర్యుడు కనిపిస్తూనే ఉంటాడు.

## ఐస్‌లాండ్



యూరప్‌లో ఉన్న అతి పెద్ద ద్వీపం ఐలాండ్. ఇక్కడ ఆవాస ప్రాంతాలు తక్కువగా ఉన్నప్పటికీ పర్యాటకంగా దీనికి మంచి ఆదరణ ఉంది. ఇక్కడ జూన్ నెలలో సూర్యుడు అసలు అస్తమించడు. ఆ నెల రోజులూ పగలు, రాత్రి తేడా ఉండదు. అందుకే జూన్ నెలలో ఇక్కడి పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. ఐస్‌లాండ్‌లో దోమలు కూడా ఉండకపోవడం మరో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

ఫిన్లాండ్

ఫిన్లాండ్ నార్తర్న్ లైట్స్ కోసం ఒక ఆకర్షణీయమైన పర్యాటక ప్రదేశం. ఇక్కడ అంతమైన సరస్సులు, ద్వీపాలకు పెట్టింది పేరు. ఈ దేశంలో ఎండా కాలంలో 70 రోజుల పాటు సూర్యుడు అసలే అస్తమించడు. అర్ధరాత్రి పట్ట పగలు లాగ ధగధగమని లైటింగ్ మెరుస్తూ ఉంటుంది. అయితే చలి కాలంలో మాత్రం అసలు సూర్యుడే కనిపించక పోవడం విశేషం. దీంతోపాటు, ఇక్కడ అర్ధరాత్రి సూర్యుడిని కూడా చూసే అవకాశం ఉంది. ఫిన్లాండ్ భూ భాగాలు ఆర్కిటిక్ సర్కిల్‌కు సమీపంలోనే ఉన్నాయి.

## కెనడా


ప్రపంచంలోనే రెండో అతి పెద్ద దేశం కెనడా. ఇక్కడి యూకోన్‌లో ఏడాది పొడవునా మంచు కురుస్తూనే ఉంటుంది. అయితే 50 రోజులు మాత్రం వేసవి కాలం ఉంటుంది. ఈ కాలంలో అర్ధరాత్రి కూడా సూర్యుడు ఉదయిస్తూనే ఉంటాడు.



అందుకే ఈ 50 రోజుల్లో అనేక పండుగలు, ఉత్సవాలు నిర్వహిస్తారు అక్కడి ప్రజలు. ఇందులో భాగంగానే ప్రతీ ఏటా జులై నెల మధ్యలో గ్రేట్ నార్తర్న్ ఫెస్టివల్ కూడా జరుపుకొంటారు. గోల్ఫ్ ఈవెంట్లు కూడా నిర్వహిస్తారు. చలి కాలంలో మాత్రం నునావట్‌లో 30 రోజుల పాటు సూర్యుడు అసలు కనిపించడు.

## స్వీడన్

స్వీడన్‌లోని కిరున్ నగరంలో అయితే ఏడాదిలో దాదాపు 100 రోజుల పాటు సూర్యుడు అస్సలు అస్తమించడు. మే నెల నుండి అగస్టు నెల మధ్యలో సూర్యుడు ఎప్పుడూ ప్రకాశిస్తూనే ఉంటాడు. అందుకే ఈ సమయంలో ఈ నగరాన్ని చూసేందుకు ప్రజలు, పర్యాటకులు తరలి వస్తారు. దీంతోపాటు కిరున్ ఆర్ట్ నోయువే చర్చి కూడా చాలా పాపులర్. ఈ చర్చి ఆర్కిటెక్చర్ చాలా అద్భుతంగా ఉంటుంది. సూర్యుని కిరణాల ప్రకాశానికి ఈ చర్చి అత్యంత అద్భుతంగా కనిపిస్తుంది. అందుకే ఈ సమయం లో కిరున్‌లోని ఈ చర్చిని చూసేందుకు టూరిస్టులు క్యూ కడతారు. ఇక్కడ సూర్యుడు అర్ధరాత్రి అస్తమించి, తెల్లవారు జామున మళ్లీ ఉదయిస్తాడు. స్వీడన్‌లో మిడ్ నైట్ సన్‌ను వీక్షించే అనుభవం చాలా గొప్పది. ప్రతీ ఒక్కరూ తమ జీవితం లో ఒక్కసారైనా దానిని చూడాలని కోరుకుంటారు. ❑



కథ

# మా నాన్న నాకు యాభై వేలిచ్చాడు

డా॥ వి.రాజేశ్వర్ శర్మ

'మా నాన్న నాకు యాభై వేలిచ్చాడు!"
"ఏమిటీ? నీకు మీ నాన్న యాభై వేలిచ్చాడా?!"
ఆశ్చర్యంతో నోళ్లు వెళ్లబెట్టారు ఆకాశ్ స్నేహితులు.
"ఔను.. వచ్చే నెల కూడా మరో యాభై వేలు ఇస్తానన్నాడు" వాళ్ల ఆశ్చర్యాన్ని మరింత పెంచుతూ చెప్పాడు ఆకాశ్.
"ఎందుకిచ్చాడు? అలా ఎందుకిస్తున్నాడు?" వెంట వెంటనే అతణ్ణి ప్రశ్నించారు తేజ, విహార్‌లు.
ఆకాశ్ అతని స్నేహితులు తొమ్మిదవ తరగతి పాసై ఇప్పుడు పదో తరగతిలోకి వచ్చారు. అది జూన్ నెల. కరోనా ప్రభావం చాలా వరకు తగ్గిపోయి పాఠశాలలు త్వరలో తెరిచేలా ఉన్నారు. ఆ ఏడుగురు ఆకాశ్ స్నేహితులు. వాళ్లంతా ఆ అపార్ట్‌మెంట్‌లో టెర్రస్ పైన చేరి మాట్లాడుకుంటున్నారు. వాళ్లు రోజూ సాయంత్రాలు కాసేపు ఆడుకుని, కబుర్లు చెప్పుకుంటారు.
తమకు తమ తల్లిదండ్రులు పాకెట్ మనీగా నెలకు కనీసం రెండు వందలు ఇవ్వడమే ఎక్కువ. అలాంటిది ఆకాశ్‌కు వాళ్ల డాడీ ఏకంగా యాభై వేలిచ్చాడట! వచ్చే నెల కూడా యాభై వేలిస్తాడంటే నమ్మశక్యం కాకుండా ఉంది. ఆకాశ్ తమను ఆట పట్టిస్తున్నాడు అంతే కావచ్చు.. అంతే! ఆకాశ్ చెప్పిన మాటలు వాళ్లకు ఆశ్చర్యంతో పాటు ఈర్ష్య కూడా పుట్టిస్తున్నాయి. "నిజం చెప్పరా బాబూ! నీకు నిజంగా మీ డాడీ యాభై వేలిచ్చాడా?" పల్లవి మరోసారి అడిగింది ఆకాశ్‌ను.
"నిజమే" అన్నట్టు నవ్వుతూ తల వూపాడు ఆకాశ్.
"ఐతే ఆ మనీని ఏం చేస్తావ్? ముందుగా మాకో పెద్ద పార్టీ ఇవ్వాలి" అంది రక్షిత.
"ఔను.. ఔను.." అంటూ కోరస్‌గా అరిచారు.
"ఆగండ్రా బాబూ! మా నాన్న నాకు యాభై వేలిచ్చింది నిజం. వాటిని నేను ఖర్చు పెట్టాలని చెప్పింది నిజం. కానీ అందుకో పద్ధతి కూడా ఉంది" వాళ్లతో చెప్పాడు ఆకాశ్.
"అరేయ్, ఖర్చు పెట్టడానికో పద్ధతా! మాకు పార్టీ ఎగేయడానికి ఇదో ఫిట్టింగా?" అన్నాడు అనుమానంగా నితిన్.
"ఔను, ఆ యాభై వేలు మా నాన్న జీతం. నేను అడిగింది కొనివ్వడం లేదనే కోపంలో నేను "మీ జీతం డబ్బంతా ఏం చేసుకుంటారని, మేం అడిగినవి కొనివ్వడానికి ఎందుకంత పీనాసితనమని" అనేసాను.
ముందుగా మా నాన్న ఫీలయ్యాడు నా మాటలకు. నేను సారీ చెప్పాను.
కానీ తను వెంటనే చెప్పేశాడు తన జీతం మొత్తం నాకే అప్పగిస్తానని, దాని నెలంతా ఇంటి ఖర్చులకు, మా కుటుంబ అవసరాలకు వాడాలని చెప్పాడు. అలా వాడగా ఎంత మిగిలితే అంత నన్నే తీసుకోమన్నాడు".
"కనీసం ఇరవై వేలయినా మిగులుతాయి కదరా!" ఆశగా అడిగాడు విహాన్.
"నేనూ అలాగే అనుకున్నాను. కానీ మొన్న పధ్నాలుగో తేదీ నాటికే పూర్తిగా ఖర్చయిపోయాయి" ఆకాశ్ మాటలతో వాళ్ల ఉత్సాహం మీద పెద్ద జడివాన కురిసినట్టయింది. సారీరా, నేనూ మీలాగే అనుకున్నాను, బోలెడు డబ్బు మిగులుందని, ఫుల్‌గా ఎంజాయ్ చేయొచ్చని, ఎన్నో కొనుక్కోవచ్చని అనుకున్నాను. కానీ అవి పదిహేను రోజులకే పూర్తిగా మా కుటుంబ ఖర్చులకే అయిపోయాయి. ఇంకా పదిహేను రోజులు మా ఇంటి ఖర్చులు ఎలా పూర్తి చేయాలో అర్థం కాలేదు.
మా అమ్మా నాన్న మాత్రం "తమకేమీ సంబంధం లేదని, నేనే చూసుకోవాలని" చెప్పారు. ఇంకా మిగిలిన రోజుల కోసం వాళ్లు చెప్పిన కనీస ఖర్చుల లిస్టు చాలా ఉంది. పైగా అనుకోని ఖర్చులుండొచ్చని, ప్రయాణాలు, జ్వరాలు వస్తే ఏం చేయాలో ఆలోచించమని చెప్పారు. దగ్గరివాళ్ల పెళ్లిళ్లు, పుట్టిన రోజుల వంటివి కూడా ఉండొచ్చని అన్నారు. వాటన్నిటికీ డబ్బులు ఎలా అనేది నన్నే ఆలోచించుకోమన్నారు".



"ఈరోజు ముప్పై తారీకు కదా! నువ్వు చెప్పింది పధ్నాలుగో తారీకు సంగతి. మరి ఈ పదిహేను రోజులు ఎలా మేనేజ్ చేశావు? అనుకోని ఖర్చులేమీ రాలేదా? రేపు మళ్లీ మీ డాడీ యాభై వేలు ఇస్తాడా?" ఆ పిల్లలు ప్రశ్నల వర్షం కురిపించారు. ఇప్పుడు వాళ్లకు ఇదో సస్పెన్స్ థ్రిల్లింగ్ కథలా అనిపిస్తోంది. కుతూహలంగా ఆకాశ్ చెప్పేది వినాలని చూశారు.

ఆకాశ్ ఏది చెప్పినా అలాగే ఉంటుంది. అది ఓ అద్భుతమైన కథలాగా, సస్పెన్సును కలిపి ఎంతో ఆసక్తి కలిగించేలా చెప్తాడు. అది ఆ పిల్లాడి స్టయిల్. ప్రతిదాన్నీ ఓ కథలాగా మార్చే నైపుణ్యం వాడికి అబ్బింది. అందుకే ఆకాశ్ ఆ విషయాన్ని కూడా ఓ కథలా చెప్పడం మొదలు పెట్టాడు.

...

మా అమ్మా నాన్నలు వాసు, భాగ్యరేఖలు మిడిల్ క్లాస్‌వాళ్లు. వాళ్లకు వాళ్ల తల్లిదండ్రుల వల్ల వచ్చిన ఆస్తిపాస్తులు అంటూ ఏమీ లేవు. మా నాన్న వాసు ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు. మా అమ్మ భాగ్యరేఖ ఇంటర్ వరకు మాత్రమే చదువుకుంది. కొంత కాలం ప్రైవేటు పాఠశాలలో చిన్న తరగతులకు టీచర్‌గా పని చేసింది. ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత ఇంటిపని, పిల్లల పెంపకం కోసం ఆ ఉద్యోగం వదిలేయాల్సి వచ్చింది. ఆ కుటుంబానికి నాన్న జీతమే ఆధారం. మా చెల్లెలు అనుపమ పుట్టిన తరువాత ఓ అపార్ట్‌మెంట్‌లో కొన్న మూడు బెడ్ రూమ్‌ల ఫ్లాటు కోసం నెల నెలా మా నాన్న ఈ.ఎం.ఐ.లు కడుతున్నాడు. మిగిలిన జీతం డబ్బు పొదుపుగా వాడుకుంటూ జీవితం వెళ్లదీస్తున్నారు. టీచర్లకు కరోనా కాలంలో జీతాలు కూడా సరిగా రాలేదట. పిల్లలకు ఆన్‌లైన్ పాఠాలు స్టార్ట్ అయ్యాయి. అందరి పిల్లలకు సెల్‌ఫోన్‌లు కావలసి వచ్చాయి. పిల్లలకు పేరెంట్స్ కొందరు ట్యాబులు కొనిచ్చారు. మేం కూడా మంచివి, పెద్దవి ట్యాబులు, సెల్‌ఫోన్‌లు కావాలని అడిగాం. నాన్న కొనిస్తానన్నవి కాకుండా మేం కోరుకున్నవి, ఖరీదైన స్మార్ట్‌ఫోన్‌లు కావాలని పట్టుబట్టాం, ఏడ్చాం, తిండి మానేసాం, నానా యాగి చేశాం. ఇంట్లో అశాంతి సృష్టించాం. ఎంత కన్విన్స్ చేసినా మేం వినలేదు.

మా చెల్లెలికి కూడా రంగు రంగుల కలలు కనిపించాయి. అప్పుడే తాను కొనవలసిన వస్తువుల్ని మనసులోనే లిస్టు చేసేసుకుంటోంది.

చెల్లి కన్విన్స్ అయి "సరే.. మీ ఇష్టం" అని ఒప్పుకుంది.

కానీ నేను వినలేదు. చివరకు మా నాన్న ఇలా నిర్ణయం ప్రకటించాడు. "సరే! ఆకాశ్! ఓ పని చేద్దాం. నా జీతం మొత్తం నీకే ఇస్తాను. ఈ నెల నుంచి దాన్ని మన ఇంటి అవసరాల కోసం వాడు. మిగిలింది ఎంతైనా నువ్వే ఉంచుకో. రెండు నెలలు అలా చేద్దాం. మన ఇంటి అవసరాలకు పోగా మిగిలినదంతా నువ్వే ఖర్చు పెట్టుకో, నువ్వూ నీ చెల్లీ మీకిష్టమైనవి కొనుక్కోండి. మీ ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టుకోండి. నేను ఏమీ అనను. మీకిష్టమైతే ప్రతి నెలా నా జీతం మీ చేతుల్లోనే పెడతాను, సరేనా?"

నాన్నకు చాలా కోపం వచ్చిందని నాకు అర్థమైంది. "సారీ నాన్నా! నాకేమీ వద్దు" అని చెప్పాడు భయంతో.

"లేదు ఆకాశ్! నేనేమీ కోపంతో చెప్పడం లేదు. ఆలోచించే చెప్తున్నాను. ఇలా చేస్తే మన ఆర్థిక పరిస్థితి మీకు కొంత వాస్తవంగా అర్థమౌతుంది. అలాగే ఆర్థిక నిర్వహణ ప్రాక్టికల్‌గా తెలుస్తుంది. మనీ మేనేజ్‌మెంట్ ఈ వయసునుంచే అలవాటవుతుందని నాకు అనిపిస్తోంది. అది భవిష్యత్తులో మీకు చాలా అవసరం. అది స్కూల్లో మీకు తెలియదు. ప్రాక్టికల్‌గానే తెలియాలి. నేనూ, మమ్మీ ప్రతీదీ దగ్గరుండి గైడ్ చేస్తుంటాం. కనీసం రెండు నెలలు ఇలా చేద్దాం. తరువాత మీరు కాదంటే నేనే ఆ బాధ్యత మళ్లీ తీసుకుంటాను".

నాన్న ఆ మాటలు చెప్తున్నప్పుడు అమ్మ కూడా అక్కడే ఉంది. తాను కూడా ఆయన మాటల్ని సపోర్ట్ చేసింది. నాకూ లోలోపల ఎంతో సంతోషం కలిగింది. ఈ ఒప్పందం ఏదో బాగుంది. నేను బోలెడు డబ్బులు మిగిలించుకొని, నాకు కావలసినవన్నీ కొనుక్కోవచ్చు, నా ఇష్టం ఉన్నట్టు ఖర్చు చేసుకోవచ్చు.. అని అప్పుడే కలలు కనడం కూడా మొదలైపోయింది. "సరే నాన్నా! మీ ఇష్టం" అన్నాను నా సంతోషాన్ని దాచుకుంటూ.

మా చెల్లెలికి కూడా రంగు రంగుల కలలు కనిపించాయి. అప్పుడే తాను కొనవలసిన వస్తువుల్ని మనసులోనే లిస్టు చేసేసుకుంటోంది.

అలా మరుసటి రోజే, అంటే ఒకటవ తారీకునే మా నాన్న జీతంమ్మీద అధికారం నా చేతికి వచ్చేసింది. దాంతోబాటే ఇంటి ఖర్చుల వివరాల లిస్టు కూడా అందింది. ప్రతి నెలా కట్టవలసిన ఈఎంఐలు, తప్పనిసరి అవసరాల కోసం చేసిన అప్పులకు వడ్డీలు, కరెంటు, నీటి బిల్లులు, తాతయ్యవాళ్ల కోసం పంపాల్సి న డబ్బులు, పాలబిల్లు, కూరగాయలు, రేషన్ సామానులు, పెట్రోల్ ఖర్చులు.. ఇలా చాంతాడంత లిస్టు ఉంది. ప్రతిదానికీ నాన్నగానీ, అమ్మగానీ దగ్గరుండి ఏది ఎలా ఎక్కడ కొనాలో, ఎలా బేరాలు చేయాలో, వస్తువుల మంచిచెడ్డలు ఎలా చూడాలో, కూరగాయలు కూడా ఎలా ఏరుకోవాలో, బిల్లులు ఎలా చెల్లించాలో అన్నీ చూపించారు, ఒక రకంగా మాకు

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా**

**రచనలకు ఆహ్వానం**

**జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరే వారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

sunmagvaartha@gmail.com

నేర్పించారు. కేవలం రెండు వారాలు గడిచేసరికి డబ్బులన్నీ అయిపోయాయి. నెలలో ఇంకా రెండు వారాలు గడవాలి. కూరగాయల వంటి చిల్లర ఖర్చులెన్నో ఉంటాయి. బైక్ మీదనే నాన్న రోజూ డ్యూటీకి వెళ్లాలి కనుక పెట్రోల్ ఖర్చు తప్పనిసరిగా ఉంటుంది. మధ్యలో ఎవరి ఆరోగ్యమైనా పాడైతే ఎలా? ఏ పెళ్లిళ్లకో, ఇతర ఫంక్షన్లకో తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే ఎలా? ఏ సినిమాకో అందరం కలిసి వెళ్లాలనిపిస్తే ఎలా? ఇంకా అనుకోని ఖర్చులు ఏమైనా వస్తే ఏం చేయాలి?

ప్రతి నెలా ఇలాగే ఉంటుంది కదా! వీటితో బాటు స్కూల్ తెరవగానే ఫీజులు, పుస్తకాలు, డ్రెస్సులు, ఇంకా చదువుకు అవసరమైన తప్పనిసరి ఖర్చులు ఉంటాయి కదా! వాటికి డబ్బులు ఎలా? ఇలాంటి ప్రశ్నలకు ఎన్నిటికో నేనూ, చెల్లెలూ సమాధానాలు వెతుక్కోవలసి వచ్చింది. అమ్మా నాన్నలను అడిగితే "ఏం చేయాలో మీరే ఆలోచించండి" అన్నారు.

"ఎవరి దగ్గరైనా లోన్ తీసుకుంటే?" ఆలోచించి చెప్పాను నేను.

"ఎవరైనా ఎందుకిస్తారు? వాటికి వడ్డీ కట్టాలి. ఇప్పటికే జీతం సరిపోవడం లేదని తెలిసింది కదా? మరి ఆ వడ్డీ, అసలూ ఎలా కట్టాలి?" అడిగాడు నాన్న.

"పోనీ మమ్మీ కూడా జాబ్ చేస్తే ఇంకా డబ్బొస్తుంది కదా!" సలహా ఇచ్చింది చెల్లెలు.

"నిజమే! అలా అమ్మ కొంత కాలం ఉద్యోగం చేసింది. ప్రభుత్వ ఉద్యోగం ఎలాగు రాదు. ప్రైవేటు స్కూల్లో చేరాలి. వాళ్లిచ్చే ఎనిమిది, పది వేలకు విపరీతమైన పని వత్తిడి ఉంటుంది. అలా ఇద్దరం ఉద్యోగానికి వెళ్తే మిమ్మల్ని సరిగా పట్టించుకోలేమని అనిపించే ఆ ఉద్యోగం వదిలేసింది. సరే.. మళ్లీ ఉద్యోగం వెతికే ప్రయత్నం చేయొచ్చు. ఐనా ఆ ఇన్‌కమ్ సరిపోతుందా? మనకూ, మనలాంటి మధ్య తరగతి వాళ్లకూ ఇంకా ఏమైనా మార్గాలు ఉన్నాయేమో ఆలోచించండి" చెప్పాడు నాన్న.

నేను కొంతసేపు ఆలోచించి చెప్పాను "ఖర్చులు తగ్గించుకోవాలి" అని.

"ఏ ఖర్చులు?" ప్రశ్నించాడు వెంటనే మా నాన్న.

"అనవసరమైన ఖర్చులు" చెప్పింది చెల్లెలు.

"నిజమే! ఏ ఖర్చులు తప్పనిసరిగా మనకు ఉంటాయో, ఏవి తగ్గించుకోవచ్చో మీరే కూర్చొని ఓ లిస్టు ప్రిపేర్ చేయండి. ఇంకా ఏమైనా చేయొచ్చా?" అంది అమ్మ.

"పొదుపు చేయాలి" అన్నాను నేను.

"రైట్.. పొదుపు చేయాలి. అంటే అనవసరమైన వాటికి ఖర్చు పెట్టకపోవడం అన్నమాటే. సరే, ప్రతీ వస్తువు జాగ్రత్తగా ఆలోచించి అది అవసరమైతేనే కొనాలి. అనవసరమైన వస్తువులు కొనకుండా డబ్బును కాపాడుకొని పొదుపు చేయాలి. అలాంటి అనవసరమైనవి ఏం ఉండొచ్చు? తప్పనిసరిగా అవసరమైనవి ఏముంటాయి? మీకు సంబంధించిన లిస్టు మీరు రాయండి, మాకు సంబంధించిన లిస్టు మేం రాస్తాం, అలాగే మన ఇంటికి కావలసినవాటి లిస్టు కూడా తయారు చేద్దాం. తరువాత మళ్లీ కలిసి కూర్చుని మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే చూద్దాం" చెప్పింది అమ్మ.

"అంతేనా.. ఇంకా ఏమైనా చేయొచ్చా?" మమ్మల్ని అడిగాడు నాన్న.

మేమిద్దరం కాసేపు ఆలోచిస్తూ ఉండిపోయాం.

"ఏమో నాన్నా! ఇంకా ఆలోచించి చూస్తాం, కానీ నాన్నా నాదో రిక్వెస్ట్" అన్నాను మెల్లగా నాన్న వైపు.

"సరే చెప్పు" అంటూ తల ఆడించాడు నాన్న.

నేను ఒప్పుకుంటాడో లేదో అని అనుమానపడుతూ అడిగాను "నాన్నా, ఇప్పుడు మాకు కుటుంబం మెయింటెన్ చేయడం ఎంత కష్టమో, అందుకు ఎంత బాధ్యత, ఎంత జాగ్రత్త అవసరమో అర్థమైంది. పిల్లలుగా ఇలాంటి పెద్ద విషయాలు తెలియక మిమ్మల్ని పిసినారులనీ, మా మీద ప్రేమ లేనివాళ్లనీ చాలా రకాలుగా తప్పుగా అర్థం చేసుకున్నాం. సారీ నాన్నా! సారీ అమ్మా! నాకు చాలా గిల్టీగా ఉంది" నా గొంతులో ఆ బాధ కనబడుతోంది.

"అవును... నేనూ అలాగే ఫీలవుతున్నాను" అంది చెల్లి కూడా.

"అయ్యో! ఇందులో బాధ పడేదేముంది? మీ అవగాహన తప్పని మీరే తెలుసుకున్నారు. రియలైజ్ అయ్యారు. అది చాలా మంచి విషయం కదా! ఒకే" అంటూ మమ్మల్ని దగ్గరికి తీసుకున్నాడు నాన్న.

అమ్మ కూడా మమ్మల్ని దగ్గరికి తీసుకుని ముద్దు పెట్టుకుంది.


...

"ఇంతకూ మన పార్టీ సంగతేమిటి? ఉన్నట్టా? లేనట్టా?" అడిగాడు పృథ్వి ఆకాశ్ చెప్పడం అయిపోగానే.

మిగతా వాళ్లంతా పృథ్వి వైపు చూశారు వీడికింకా అర్థమైనట్టు లేదు అన్నట్టు.

ఆకాశ్ ఓ నిట్టూర్పు విడిచి చెప్పాడు "సారీరా! ఆరోజే నేను ఆ డబ్బు తీసుకునే బాధ్యతలోంచి బయట పడ్డాను. ఆ రోజే మా నాన్నకు చెప్పేసాను, నా తప్పు తెలుసుకున్నాను. డబ్బు గురించి, కుటుంబం గురించి, పొదుపు గురించి, కుటుంబంలో పిల్లల బాధ్యత గురించీ తెలుసుకున్నాను. అందుకే నాన్నకు ఆ బాధ్యతలు తిరిగి ఇచ్చేసాను.

ఆకాశ్ మాటలూ, అతడు చెప్పిన కథా ఆ పిల్లాడి ఫ్రెండ్స్‌పై ఒక మేరకైనా ప్రభావం చూపించాయా లేదా అని తెలియడానికి మరికొంత కాలం పడుతుంది. ❒



తెలుగు సాహిత్యంలో ప్రస్తుత సమాజంలో 'పాట' నేటికీ ఒక సజీవ కళారూప ప్రక్రియగా చరిత్ర మలచుకొంటోంది. తెలుగు ప్రజల సాంస్కృతిక జీవనంలో తరతరాలుగా జానపద కళారీతులలో భాష్యావేశం, దేశభక్తి భావోత్తేజం, అభ్యుదయ, విప్లవ రాజకీయ నేపథ్యంలో పాట పరవళ్ల తొక్కింది. పద్య నాటక పౌరాణిక, ఆధ్యాత్మిక, సాంఘిక రాజకీయ సందేశాత్మక సాహిత్యం క్రమేపీ పాటగా పరిణమించి, ఆత్మాశ్రయ సాహితీ చైతన్య ఉద్యమ గీతికలు, గత వైభవాన్ని నెమరు వేసుకోవడం నుండి వర్తమాన ఉద్యమాల పాట జన సామాన్యాన్ని ఆలోచింపచేస్తుంది. తెలంగాణ గుండెచప్పుడు పాటగా, ధూంధాం దరువులల్లో ఉద్యమానికైనా, విప్లవానికైనా, తిరుగుబాటుకైనా ఊపిరి పోస్తుందని చరిత్ర నిరూపిస్తోంది. ప్రజా కళాకారులు కాళ్లకు గజ్జె కట్టి, డప్పు చేత పట్టి, చిన్న పంచె కట్టు, గొంగడి పెద్ద దస్తీతో, గళం విప్పి వేదికల పైన కదం తొక్కడం, తాము నమ్మిన సిద్ధాంతాల కోసం అమరులైనవారి కోసం రక్తాశ్రువులు సమర్పించడం తెలంగాణకు కొత్త కాదు. ఎందరో పాటను భుజాన మోసి ఉన్నోళ్ల దోపిడీ, లేనోళ్ల గోసను, పల్లె బాణీలలో సుఖదుఃఖాలు, ఆవేశ ఉద్వేగాలను ప్రతిబింబింపచేసింది. బుర్రకథలు, యక్షగానాలు, పౌరాణిక పద్యాలు, వివిధ బాణీల సంకీర్తన గీతాల, గేయాల తత్త్వాలు పాటలో కూర్చు చేసి ధ్వనింపచేయడంలో తెలంగాణ పాట విశిష్ట మాధుర్యం పొందింది.
తెలుగు సాహిత్యంలో వెల్లివిరుస్తున్న పాటల సాహిత్యంలో ఆంధ్ర, తెలంగాణలోని గాయకులు, సాహితీవేత్తలు కవితాత్మకంగా కలం, గళం సంధానపరిచి సాహిత్య సమర శంఖం పూరించారు. ఎందరో ప్రజా కళాకారులు, కళాకారిణుల సామాజిక

# కాల్మొక్కని తూటా-పాటకు పట్టాభిషేకం



సాహిత్యం

జన సమీకరణకు ప్రచార ఆయుధంగా పురోగమించటం 'పాట' లక్ష్యమైంది. 1910లో గురజాడ అప్పారావు ముత్యాల సరాలు, పదాల జిగి బిగీ కాకుండా జాతీయ కవితా వైతాళికత్వంతో క్రమేపీ రాయప్రోలు, నాయని, నండూరి, బసవరాజు, దేవులపల్లి, దువ్వూరి, శ్రీశ్రీ, దాశరథి, సినారె, విశ్వనాథ ఎందరో అభ్యుదయ, నవ గేయ గాన రీతులతో నేటి పాట ఉద్భవించింది. తెలుగుభాష, భావ కవితా భావనలు, ప్రదర్శన యోగ్యంగా సంగీత, నృత్య సమ్మిళితంగా గత శతాబ్దిలో సినీ, రేడియో యితర జానపద మాధ్యమాలలో పాట జనరంజకమైంది. తెలుగులో నవ్య, భావ, అభ్యుదయ, విప్లవ సాహితీ ధోరణులలో ఎందరో సాహితీ మూర్తులు, సమాజాన్ని ప్రభావితం చేస్తూనే వున్నారు. పద్యమైనా, వచనమైనా, నాగరిక, జానపద పలుకుబడి లేదా మాండలిక భాషాజాలంతో, సామాన్య జనాన్ని కదిలిస్తూనే వున్నారు. శ్రమశక్తి దోపిడీ, రాజ్యాధికార వ్యామోహం సృష్టించే అణచివేత, హింసాయుత దుష్ట విధానాలపై కొత్త గొంతుకలు వినిపిస్తూనే వున్నాయి. రాజ్యాహింసను ప్రతిఘటించే తీవ్ర భావోద్వేగంతో కవులు, రచయితలు నాడూ నేడూ త్యాగాలు, కష్టాలు, కన్నీళ్లు, ప్రాణాలు సైతం అర్పిస్తూ కలాలు కొరడాలుగా ఝళిపిస్తూనే ఉన్నారు. గొంతెత్తి, మౌఖికంగా గళం విప్పి వినిపించే ప్రతిధ్వనింప చేస్తున్నారు. తెలంగాణ ప్రజా జీవనంలోని చారిత్రక విషాద ఘడియలు, పెల్లుబికి న ఆవేదనాయుత ఆకాంక్ష లు, అణచివేత, అన్యాయ, అక్రమ నిర్బంధాలు తిరుగుబాటుకు పుట్టిల్లుగా పాటకు ఊపిరి అందించాయి. భక్తరామదాసు గోల్కొండ బందిఖానాలో ఏళ్ల తరబడి బందీగా శ్రీరామచంద్ర భక్త్యావేశంతో తన అనుభవాలను సంకీర్తనాచార్యునిగా ప్రశంసించినా, దైవాన్ని మందలించినా వ్యక్తీకరించిన చరిత్ర పుక్కిటి పురాణం కాదు. తెలంగాణ నవ సమాజ నిర్మాణంలో వివిధ చారిత్రక పరిణామ దశలలో కాలానుగుణంగా జైళ్లలో అయినా, ప్రజల నోళ్లల్లో అయినా పాట పల్లవిస్తూనే వుంది. తదనంతరం మహాకవి దాశరథి వంటి కవులు గుండె గాయపడి మళ్లీ జైలుగోడల మీద, అగ్నిధార వర్షింపచేసారు. 1940లో కమ్యూనిస్టు, సోషలిస్టు యితర ప్రజాస్వామ్యవాదులు భూస్వామ్య, నిజాం, రజాకార్ల పీడనను ప్రతిఘటించే పోరాటాలకు పాట ప్రాణప్రదమైంది 'తెలంగాణము రైతుదే' అంటూ ఎలుగెత్తి చాటింది.
తెలంగాణ పాట ప్రధానంగా అస్తిత్వ వేదన, ప్రాంతీయ వివక్ష లక్ష్యంగా ఉద్యమ పంథాలో కదం తొక్కింది. తెలంగాణ సజీవ జీవన స్రవంతిగా, బాధిత జీవన పోరాటాలను ప్రతిబింబింపచేసి పేదల విప్లవం నినాదంగా తెలంగాణ సీమలో కాగడాలు జ్వలింపచేసారు. ప్రస్తుతంలో కొందరి స్వరం మారుతున్నా, వేదిక ఎక్కడైనా, పరిస్థితులు వేరైనా పోరుబాట ఊపిరి సాగుతూనే వుంది.
తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించే ఉద్యమ పోరాటాలతో జీవం అందించిన గాయకులు, కళాకారులు, కవులు రచయిత లను నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం, సత్కార గౌరవ పురస్కారాలతో గౌరవిస్తోంది. 550 మందితో సాంస్కృతిక సంఘం ఏర్పాటైంది. ఉద్యమ పాటకు ఊపిరూదిన మణిదీపాలకు ప్రతిష్ఠాత్మక కాళోజీ అవార్డులు, జాతీయ స్థాయి పురస్కారాలు లభించటం అభినందనీయం. తెలుగు పాటకు తెలంగాణ ప్రభుత్వం పట్టాభిషేకం చేసిందనడంలో సందేహం లేదు. ఎందుకంటే నిరక్షరాస్యులైన అసం ఖ్యాక సామాన్య జనావళిని పాట ఒక్కటే కదిలించగలుగుతుంది. లలిత సంగీత గేయమైనా, సినీ పాట అయినా సమాజం లో అత్యధిక సంఖ్యాకులను అలరించడానికి వాటిని చదవటం వల్ల సాధ్యం కాదు, వినడం వల్లనే. సాహితీ రంగం నుంచి సినీ రంగానికి ప్రవేశించిన శ్రీశ్రీ, సినారె, దాశరథి, కృష్ణశాస్త్రి, ఆత్రేయ, ఆరుద్ర వం టి కవులు నేటికీ వారి పాటలతో సినీ జనా వళిని సమ్మోహితం చేస్తున్నారు. పరవశింప చేస్తున్నారు. అదే సజీవ తార్కాణం.

**- జయసూర్య**

# టెక్స్ట్ మెసేజెస్



ఈ వారం కవిత్వం

**నిన్ను** తలచుకుంటే/ నేను కొవ్వొత్తి నువ్వు వెలుగు.
పడేదాకా పట్టుకుని/ పడ్డాక తట్టుకుని
జీవితాన్ని పరుస్తూ/ నువ్వొచ్చాక వెలుగొచ్చింది
చీకటి నాలో రంగు మార్చింది
నీపై వాలింది./ నిన్ను వింటాను
నన్ను చూస్తాను/ ధ్వనులు జీవిస్తాయి నాలో
నాలో రుణాత్మక ప్రవాహం/ నీలో రూపాంతరం
ధనాత్మకం బహిర్గతం/ నీవైనవన్నీ బావుంటాయ్
ఎప్పుడో అవీ పరాయివై/ మసక బారుతయ్
ఇప్పుడే తెల్లారింది నాకు/ సూర్యుడు నా తల నుంచి
కాళ్ల వైపుకు సాగుతున్నాడు
ఆలోపు మధ్యలో/ చందమామతో ప్రయాణం
సంధ్యలో సమాప్తం/ నీ చిత్రం ఈ వేళ
నాకో ఉషోదయం/ నా ఊపిరికి కొత్త వస్త్రం
పగలు చందమామలు/ కొందరికే అగుపడతాయి
చెట్టు కింద ముసలవ్వలాగా / విచిత్రాలు అనుకోకుండా జరగవు
వాటి స్పృహ అనుకోకుండా కలుగుతుంది
గుచ్చుకున్న ముళ్లు తీస్తున్నటు/ వ్యంగ్యానికి కూడా
ప్రేమించడం నేర్పగలను/ పొద్దున్నే టీ పొగవాసన లాగా
ఒప్పుకోకు/ అహం బద్దలవ్వుద్దిఒప్పుకుంటే
నా గుండె/ నువ్వు పట్టుకున్న
కుందేలుకు మూడైతే / నావి ఆరు(ఆరు నూరైనా)
ఏవైనా మరపించగలవు/ చివరికి నా పేరునైనా
నీపై ప్రేమను ససేమిరా/ ఎంతైనా తప్పించుకోగలవు
ఎక్కడికైనా పారిపోగలవు/ నా మనోచక్షువు నుంచి ససేమిరా
తెలివి చాలా రకాలు/ జ్ఞానం చాలా పొరలు
జ్ఞానోదయం గర్భగుడిలో గడ్డిపరకలు అవి.

**- రఘు వగ్గు**

---

# మైత్రీవనం



పుట్టిందెక్కడో!/ పలకా బలపం
చేతబట్టినపుడు
నాతో కొన్ని మొక్కలు
ఆ మొక్కలతోనూ నేనూ..
పాఠశాలలో/ పెన్ను పుస్తకం
చేతబట్టినపుడు/ నాతో ఓ పూలవనం
ఆ పూలవనంలోనే నేనూ..
కాలేజీ మెట్లెక్కినపుడు
బతుకు పాఠాలు వినేటపుడు
నాతో ఓ నదీ ప్రవాహం
ఆ నదీ ప్రవాహంలోనే
నేనూ..
పెళ్లీ పిల్లలూ/ బాధ్యతల బరువుతో
మా బతుకు సంసార సాగరమే
ఆ సాగరంలో నాది ఎదురీతే..
ముసలితనంలో
తీపి చేదు జ్ఞాపకాలను
ఊత కర్రలో భద్రపరచుకుని
చూస్తుంటాను ఆకాశం వేపు

**- పేరూరు బాలసుబ్రమ్మాణ్యం**

# మన కోసం



చెలీ..!
మనకోసం వసంత కోకిల/ ఎదురుచూస్తోంది
మన పరిణయ ఘడియలలో
పాట పాడాలని
మనకోసం ముదిత మయూరి
ఉవ్విళ్ళూరుతోంది/ మన ప్రణయ భంగిమలకు
నృత్యం చేయాలని/ మన కోసం
కలహంస/ కమ్మని కలలు కంటోంది
మన పెళ్లి ముహూర్తానికి/ హొయలు
పలకాలని
మనకోసం గూటిలో గువ్వ
గుసగుసలాడుతోంది
మన ప్రేమలేఖ త్వరలో
శుభలేఖగా మారాలని

**- కయ్యూరు బాలసుబ్రమ్మాణ్యం**

**దుకాణాదారులు, వ్యాపారులకు సాధారణంగా వచ్చే సందేహాలు/కంప్లయింట్స్.**

1) వ్యాపారం బాగానే జరుగుతోంది కానీ చేతిలో డబ్బు నిలవటం లేదు 2) సరుకులు కొనడానికి జమ చేసిన డబ్బు మరొకదానికి ఖర్చుయిపోతోంది 3) దుకాణంలో పరిస్థితి బాగేఉంది కానీ ఇంట్లో పరిస్థితులు ఏమాత్రం బాగాలేవు 4) సరుకు అమ్ముడు పోతోంది కానీ అన్నీ అరువు బేరాలే, డబ్బులు రాబట్టం కష్టంగా ఉంది... మొదలైనవి.

వాస్తుబలం వున్నదయినప్పటికీ తను ఎక్కడో తాత్కాలికంగా బస చేసిన చోటు వాస్తుకు పూర్తిగా విరుద్ధంగా వుంటే- అంటే ఆ చోటులో ఈశాన్యంలో లెట్రిన్స్ గానీ, వంటగదులుగానీ, చీకటి కొట్టాలుగానీ వుండటం లేదా నైరుతిలో గొయ్యిలు, బావులు లేదా నైరుతి, ఆగ్నేయ, వాయువ్య మూలలు పెరగటం లాంటి వాస్తు విరుద్ధమైన పద్ధతులుంటే ఆ యజమాని ఆ ప్రాంతంలో పూర్తి దుష్ఫలితాలను అనుభవించవలసి వస్తుంది. ఆ ఊళ్లో ఉండగా అనారోగ్య

**వాస్తువార్త**
**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**
**డా॥ దంతూరి పండరినాథ్**
**3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్**
**సెల్: 9885446501/9885449458**

సాధారణంగా జరుగుతుంటుంది. ఒక వ్యక్తికి ఈశాన్యం పెరిగిన ఇల్లు వుంటే అతడు కొంటున్న స్థలంగానీ, ఈశాన్యం పెరిగినవే అయివుండటం చాలా సార్లు యాదృచ్ఛికంగా జరుగుతుంటుంది. ఒక ఇల్లు వాస్తు పరంగా బాగా లేకపోతే ఆ ఇంటి యజమానికి వాస్తుపరంగా

# వ్యాపారం లాభసాటిగా జరగాలంటే?



ఇలాంటి కంప్లయింట్స్‌లో ఏ కంప్లయింట్ గురించి ఆలోచించినా దానికి కారణం గానీ, బాధ్యుడుగానీ ఆ దుకాణదారుడు, వ్యాపారస్తుడు ఒక్కడే కాదనీ, ఎంతో మంది సమన్వయ కృషి వల్ల మంచి ఫలితం, నిర్లక్ష్యం వల్ల చెడు ఫలితం అతడు అనుభవిస్తున్నాడని అనిపిస్తుంది. అది నిజం కూడా. అయితే ఆ సమన్వయ కృషికయినా, నిర్లక్ష్యానికయినా చుక్కాని లాంటిది 'వాస్తు ప్రభావం' అని చెప్పవచ్చు.

ఒక వ్యాపారి ఇల్లు వాస్తుపరంగా బాగా లేకపోవడం వల్ల లేదా దుకాణం వాస్తు పరంగా బాగుండి, ఇల్లు వాస్తు పరంగా బాగా లేకపోవడం వల్ల ఇలాంటి మిశ్రమ ఫలితాలు కనిపిస్తాయి.

ఉన్న ఊళ్లో తలెత్తుకోలేనివాళ్లు పై ఊళ్లో పైకి రావటం, ఉన్న ఊళ్లో పటిష్టంగా ఉన్నవాళ్లు పై ఊళ్లో అణగదొక్కబడటం...లాంటి ఫలితాలకు స్వగృహ వాస్తుకీ పరాయి ఊళ్లో అతడు బస చేసిన వాస్తుకీ మధ్య కలిగే ప్రభావాలే కారణం.

ఇల్లు ఒక పై అధికారి లాంటిది. పై అధికారికి మన ప్రవర్తన వల్ల మన మీద ఇష్టాయిష్టాలేర్పడి, అవి అతని చేతుల్లో ఎలా బహిర్గతమవుతాయో అలాగే మనం మన ఇంటిని తీర్చిదిద్దే పద్ధతులను అనుసరించి ఇల్లు ఇచ్చే ఫలితాలు బహిర్గతమవుతాయి. ఇంటిని అశాస్త్రీయంగా తీర్చిదిద్దితే ఫలితాలు అసమ్మతమయినవిగా ఉంటాయి. శాస్త్రీయంగా చక్కదిద్దితే ఫలితాలు కూడా బాగుంటాయి.

తన స్వంత ఇల్లు ఎంతో గొప్ప

సమస్యలు వస్తాయి. దాన్ని సూచనగా గ్రహించి మకాం మార్చటం మంచిది.

తన స్వంత ఇల్లు వాస్తుకు ఎంత విరుద్ధంగా ఉన్నప్పటికీ తాను తాత్కాలికంగా బస చేసిన చోటు చాలావరకు వాస్తుబలం కలిగివున్నదయినట్టయితే- అంటే ఈశాన్యంలో పూజగది, తెరచిన ద్వారాలు, బావి, బోర్‌వెల్, నైరుతిలో ఎత్తయిన కట్టడాలు, నైరుతి మూత, ఈశాన్యం పెరగటం, మిగతా మూలలు పెరగకపోవడం లాంటి సద్గుణాలు కలిగిన చోటు అయితే ఆ వ్యక్తి పరాయి ప్రాంతంలో ఉన్నప్పటికీ పూర్తి సత్ఫలితాలను అనుభవిస్తాడు.

ఆ చోటికి వెళ్లగానే మనసు ప్రశాంతంగా వున్నట్టు 'ఫీల'వుతాడు. అయితే- ఒక ఇల్లు వాస్తు పరంగా బాగుంటే ఆ ఇంటి యజమానికి వాస్తు పరంగా బాగున్న చోటనే బస దొరకటం

బాగాలేని చోట్లో బస దొరకటం సాధారణంగా జరుగుతుంటుంది. ఒక వ్యక్తి వాస్తుదోషం ఉన్న స్థలానికి యజమాని అయితే కొంటున్న వేరే ఇల్లుగానీ, స్థలంగానీ సాధారణంగా అటువంటి దోషాలతో కూడుకున్నదే అవటం యాదృచ్ఛికం.

ఎందుకంటే? జవాబు లేని ప్రశ్నల్లో ఇది ఒకటని చెప్పవచ్చు.

అందువల్ల.. ముందు ఇంటి వాస్తుబలాన్ని పెంచుకుంటే దుకాణంలో వాస్తుబలం పెరిగే అవకాశాలు ఎక్కువ. తద్వారా ధనయోగం దానంతట అదే కలిసి వస్తుంది. ఇంటి వాస్తుబలం ప్లస్ అయి, దుకాణ వాస్తుబలం మైనస్ అయినా; ఇంటి వాస్తుబలం మైనస్ అయి, దుకాణ వాస్తుబలం ప్లస్ అయినా కష్టమే. రెండు వాస్తుబలాన్ని కలిగివున్నవయితేనే అభివృద్ధి సాధ్యమవుతుంది.

# ఠాగూరు హైకూల సంపుటి

**రాజకీయవాదులలో కొందరు పుస్తకాల పురుగుల గురించి ఆ నోటా ఈ నోటా విన్న రోజులున్నాయి. అటువంటివారు మరీ వెతికి వెతికి పుస్తకాలు కొనుక్కుని చదువుతుంటారు. అంతేకాదు, తాము చదివిన వాటిలో మంచి పుస్తకాలు అంటూ ఉంటే వాటిని ఇతరులకు ఇచ్చి చదవమంటారు కూడా.**


తన ప్రయాణంలో ఎప్పుడూ కొన్ని పుస్తకాలను ఉంచుకుంటారు. అటువంటి వారిలో ఓ అపూర్వ మనిషి తమిళనాడుకు శాసనసభలో స్పీకరుగా ఉండిన కా.కాళిముత్తు. ప్రయాణంలో ఆయన తీసుకుపోయే లగేజీలో తప్పనిసరిగా ఓ జత బట్టలు, నాలుగైదు పుస్తకాలు తీసుకుపోతుండేవారని మిత్రుడు ఎస్.రామకృష్ణన్ ద్వారా తెలిసింది. ఆయన అటు తమిళంలోనూ ఇటు ఇంగ్లీషులోనూ దిట్ట. మంచి వక్త కూడా. ఆయన రచయిత కూడా అయిన రామకృష్ణన్‌కి అనేక పుస్తకాలు కూడా ఇచ్చారు.

కాళిముత్తు ఓమారు ఢిల్లీ విమానాశ్రయంలో కొని చదివాను, మీరు తప్పక చదవండి. దీని గురించి మీరు తీరిక ఉన్నప్పుడు మాట్లాడుకుందాం అని చెప్తూ ఓ పుస్తకం రామకృష్ణన్‌కి ఇచ్చారు. ఈ పుస్తకాన్ని రామకృష్ణన్‌కి ఎప్పుడు పంపించారనుకున్నారు.. ఓ రోజు రాత్రి పదకొండు గంటలకు.

అది అప్పటికి ఓ వారం క్రితమే విడుదలైన ఓ ఇంగ్లీషు పుస్తకం. అది ఒక నవల.

ఆ పుస్తకాన్ని రామకృష్ణన్ రెండు రోజుల్లో చదవడం పూర్తి చేశారు. ఆ పుస్తకం చదువుతుంటే రచయిత దానిని రాయడానికి ఎంతటి పరిశోధన చేసి ఉంటారో కదా! అనిపించిందట రామకృష్ణన్‌కి.

ఓ వారాంతంలో కలిసి భోంచేద్దామంటూ కాళిముత్తు రామకృష్ణన్‌కి పిలిచారు. ఆయన చెప్పిన రోజు ఇద్దరూ కలుసుకున్నారు. ఆ నవలలో ముద్రించిన ఓ పెయింటింగ్ గురించి, జీసస్ క్రైస్ట్ ఆఖరి విందు గురించి బైబిల్ ఆధారంగా చేసుకుని రాసిన విషయాల గురించి వారి మాటల్లో చోటు చేసుకున్నాయి.




శాసనసభ కార్యక్రమాలు, పార్టీ పనులు, పర్యటనల మధ్య వీలున్నప్పుడల్లా ఆయన ఈ పుస్తకాన్ని చదవడం ఆశ్చర్యం. బహుశా ఈ నవల గురించి చాలా మంది మాట్లాడుకోవచ్చు అనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారాయన. ఈ ఏడాది నేను చదివిన గొప్ప పుస్తకాలలో ఇదొకటి అని చెప్పారు. ఇంతకూ ఆయన చెప్పిన పుస్తకం దేని గురించి అంటే.. డాం బ్రౌన్ రాసిన డావిన్సీ కోడ్. ఈ పుస్తకాన్ని చదివినప్పుడే ఆయన ఆ పుస్తకానికి జనాదరణ తప్పక లభిస్తుందని అంచనా వేయడం విశేషం. ఇది ఆయన చదివే తత్వాన్ని చెప్పక చెప్తోంది. మరికొంత కాలానికే ఆ పుస్తకానికి విశేష ఆదరణ లభించింది. ఆ పుస్తకం మీద చర్చలు, వాదనలు జరిగాయి. అలాగే కాళిముత్తు ఓమారు రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన స్ట్రే బర్డ్స్




అనే పుస్తకాన్ని రామకృష్ణన్‌కి ఇచ్చి ఇది నీకు తప్పక నచ్చుతుందన్నారట. ఆ పుస్తకం 1926లో అచ్చయింది.

ఆయన తప్పకుండా ఈ పుస్తకాన్ని రోడ్డు పక్కన అమ్మే పాత పుస్తకాలవారి దగ్గరే కొని వుంటారని రామకృష్ణన్ అనుకున్నారు. ఆ పుస్తకం ఠాగూర్ రాసిన హైకూ కవితా సంపుటి.

ఈ పుస్తకాన్ని నేను మిత్రుడు తల్లావజ్ఝల లలితా ప్రసాద్ ద్వారా నేను చదివాను. ఈ పుస్తకం ఎంతో బాగుంటుంది. ఠాగూరు భావాలు అమోఘం. ఓ చోట ఠాగూరు అంటారు...

ఖ్యాతి
నన్ను అవమానపరుస్తోంది
ఎందుకంటే..
అది నేను రహస్యంగా
తీసుకున్న భిక్ష అని.

ఈ కవితా పంక్తులు చదివినప్పుడు 'ఇది ఠాగూర్ కవితా' అని ఆశ్చర్యం వేసింది. కారణం.. ఇది నేను అంతకుముందు ఓ ఉపన్యాసంలో ఓ ప్రముఖుడు ప్రస్తావించగా విన్న మాటలవి. అప్పుడు నాకు అవెవరివో నాకు తెలీదు. కానీ ఆ పుస్తకం చదివినప్పుడు తెలిసింది.


1916లో ఠాగూరు జపాన్‌కి వెళ్లారు. అక్కడ ప్రసంగించారు. తన జపాన్ పర్యటన అనుభవాల గురించి ఠాగూరు కొన్ని వ్యాసాలు కూడా రాశారు. హైకూ అనేది జపాన్ సాహిత్యంలో ప్రధానమైన ప్రక్రియ. మూడు పంక్తులలో చిన్న చిన్న మాటలుంటాయి. భావం మాత్రం ఎంతో ఘనంగా ఉంటుంది. తక్కువ మాటలలో బరువైన భావాన్ని చెప్పడం అంత సులభం కాదు. ఈ పద్ధతినే ఆయన రాసిన కవితా సంపుటి స్ట్రే బర్డ్స్. నేను మొదట ఇంగ్లీషులో చదివినా ఆ తర్వాత తమిళ అనువాదాన్ని చదివి

తన్మయుడనయ్యాను. జపాన్ హైకూల మీద తమిళ జాతీయ కవి సుబ్రహ్మణ్య భారతియార్ 1916లో సుదేశమిత్రన్ అనే తమిళ పత్రికలో వ్యాసం రాశారు. అది నేను ఓ అంతర్జాలంలో చదివాను. ఆ పుస్తకంలోని ఒకటి.. రెండు మాటలు:

కొలనును చూసి చెప్పింది
మంచుబిందు
నేను ఆకు మీదున్న చిన్న బిందువును.
నువ్వు తామరాకు కింద ఉన్న
పెద్ద బిందువు

...

ఓ పండూ,
ఇంకా ఎంత దూరంలో ఉన్నావు
అన్నది పువ్వు.
నీ హృదయంలోనే దాక్కున్నాను పువ్వా




అంది పండు.

ఠాగూరు హైకూ కవితలు చైనా భాషలో 1920లో అనువదించబడ్డాయి. ఇప్పటికీ చైనా యువకులకు ఠాగూరు కవితలంటే ప్రియం ప్రియం.

తెలుగులో తుర్లపాటి రాజేశ్వరి ఈ పుస్తకాన్ని అనువదించినట్టు, నేను చదివినట్టు గుర్తు.

**- యామిజాల జగదీశ్**



## కొరవడిన మహిళల భద్రత

**(15వ పేజీ తరువాయి)**

తల్లిదండ్రులు పిల్లల పెంపకం పట్ల శ్రద్ధ చూపాలి. బాల్యం నుండే వ్యక్తిత్వం నిర్మాణం చేయాలి. మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు పెంపొందించాలి. ఆడపిల్లల్లో అమ్మ, అక్క, చెల్లెళ్లను చూడటం నేర్పించాలి. బాల్యం నుంచి నీతికథలు చెప్పి వికాసం కల్పించాలి. విద్యాసంస్థలు కేవలం మార్కుల సాధనే ముఖ్యం అనుకోకుండా వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు చేపట్టాలి. పాత రోజుల్లోలాగా వారానికి ఒక్కసారైనా మోరల్ పీరియడ్ ఏర్పాటు చేయాలి. వ్యక్తిత్వం, సమాజిక విలువలను పెంపొందించాలి. క్రీడలకు ప్రాధాన్యం కల్పించాలి. మొత్తంమీద సమగ్ర వ్యక్తిత్వ వికాసం కల్పించడానికి కృషి చేయాలి.

అవగాహన అవసరం

ఆడపిల్లలు, మహిళలకు అవగాహన కల్పించడం చాల అవసరం ప్రభుత్వం, పోలీసులు, స్వచ్ఛంధ సంస్థలు మహిళా రక్షణకు ఉద్దేశించిన చట్టాలపై అవగాహన కల్పించడానికి కృషి చేయాలి. బాలికలు, మైనర్లకు పురుషులతో ఎలా మెలగాలో నేర్పించాలి. తాతయ్య, మామయ్య, ఇతరులు పట్టుకోవడం, ముట్టుకోవడంలోని భావాలను గ్రహించడంపై అవగామన కల్పించాలి. స్పర్శలో, అనుభూతుల్లో ఉన్న తేడాలను తెలుసుకునేలా వివేకం కల్పించాలి. పాఠశాలలు, కళాశాలలు, జనసమ్మర్ద ప్రదేశాలలో పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన పెంచాలి. ఎక్కడైనా ప్రమాదకర పరిస్థితులు ఎదురైతే ఎలా తప్పించుకోవాలి, ఎలా ఎదుర్కోవాలి అన్న మార్గాలు తెలపాలి. ఆడపిల్లలతో తల్లి మనసు విప్పి మాట్లాడుతుండాలి. ఎక్కడైనా వేధింపులు ఎదురవుతున్నట్లు తెలిస్తే సత్వరం పరిష్కార మార్గాలు వెదకాలి. అవసరమైనపుడు పోలీసుల సహాయం పొందడానికి వెనకాడకూడదు. నలుగురికి తెలిస్తే పరువు పోతుందని దాచిపెట్టడం ఎప్పటికీ మంచిది కాదని గుర్తించాలి. కాగా... కొందరు తల్లిదండ్రులు అబ్బాయిలు తప్పు చేస్తే వారిని వెనకేసుకొస్తుంటారు. అది మంచిది కాదు. మొక్కై వంగనిది మానై వంగదన్న సామెత గుర్తించి మొదట్లోనే మగపిల్లలకు కౌన్సెలింగ్ చేసి పరివర్తన తీసుకురావాలి. ఇప్పటికైనా సమాజంలోని అన్ని వ్యవస్థలు, సంస్థలు మహిళలు పిల్లల రక్షణకు కృషి చేయాలి. ప్రకృతిలో భూమి ఎంత ముఖ్యమో సమాజాభివృద్ధికి ఆడపిల్ల అంత ముఖ్యమన్న విషయం గుర్తించాలి. ప్రతి ఆడపిల్ల కాబోయే అమ్మ కాబట్టి మనమందరం అమ్మలను రక్షించుకుందాం. ❑





# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. దూర ప్రాంత ప్రయాణం చేస్తారు. ఆధ్యాత్మిక చింతన అలవడుతుంది. స్త్రీలకు స్థిరాస్తులు కలిసి వస్తాయి. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి పోటీ ఉంటుంది. వృత్తి విద్యాకోర్సులు అభ్యసించిన వారికి ఉన్నతోద్యోగం లభిస్తుంది. కుటుంబ ఖర్చులు అధికం.

## వృషభం



కుటుంబంలో ఐకమత్యం కొరవడుతుంది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. శుభ కార్యాలకు హాజరవుతారు. అకారణంగా మానసిక ఆందోళనకు లోనవుతారు. డ్రైవింగ్‌లో మెళకువలు నేర్చుకుంటారు. ఎంతో కఠినం అనుకున్న పనులు సునాయాసంగా పూర్తి చేస్తారు. చిన్ననాటి మిత్రులకు ఆర్థిక చేయూతనిస్తారు. గృహ యోగం.

## మిథునం



బంధు, మిత్రులను కలుసుకుంటారు. వృత్తి విద్యల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. వ్యవసాయదారులకు బాగుంటుంది. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. తీర్థ యాత్రలు చేయాలన్న కోరిక తీరుతుంది. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. బ్యాంకు రుణాలు తీర్చడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. ఉద్యోగులకు స్థానచలనం.

## కర్కాటం



కొత్త విషయాలు తెలుసుకుంటారు. అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయి. ఖర్చులు కూడా అదే స్థాయిలో ఉంటాయి. శత్రువులు మిత్రులవుతారు. వాక్చాతుర్యంతో ముఖ్యమైన పనులు చక్కబెట్టుకుంటారు. ఉద్యోగ ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు. హోల్ సేల్ వ్యాపారులకు బాగుంటుంది. వివాదాలు తీరుతాయి.

## సింహం



వివాదాల జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. విదేశాల్లో ఉన్న ఆత్మీయుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. వృత్తి వ్యాపారస్తులకు పోటీ ఏర్పడుతుంది. సహోద్యోగులతో సఖ్యత ఏర్పడుతుంది. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం మంచిది కాదు. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. చిరకాల వాంఛ తీరుతుంది.

## కన్య



అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. సామాన్యంగా ఉంటుంది. కళాకారులకు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. బ్యాంకు రుణాలు మంజూరు. అందరూ మీ మాటే వేదవాక్కులా ఆచరిస్తారు. జీవిత భాగస్వామితో స్వల్ప అభిప్రాయ విభేదాలు వచ్చే ఆస్కారం.

## తుల



కుటుంబంలో మనస్పర్థలకు అవకాశం, సంయమనం పాటించండి. ఆరోగ్య సమస్యలుంటాయి. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి ముఖ్యమైన సమాచారం తెలుస్తుంది. మొండి బకాయిలు వసూలవుతాయి. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఫలిస్తాయి. కాలానుగుణంగా చేసే వ్యాపారాలు బాగా కలిసివస్తాయి. ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేసి అందరి మెప్పు పొందుతారు. నూతన వాహన యోగం.

## వృశ్చికం



ధర్మ రక్షణకై పాటు పడతారు. వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారు. అనుకోని ఖర్చులు వచ్చి పడతాయి. దంపతుల మధ్య స్వల్ప మనస్పర్థలు వచ్చే ఆస్కారం. గతంలో వాయిదా పడిన పనులు వారాంతంలో తిరిగి ప్రారంభిస్తారు. ఆహార, ఆరోగ్య నియమాలు తూచా తప్పకుండా పాటించండి. బ్యాంకు రుణాలు తీర్చి ఊరట పొందుతారు. స్త్రీలకు శుభ యోగం. ఉద్యోగులకు స్థానచలనం/పదోన్నతి సూచన.

## ధనుస్సు



శత్రువులు మిత్రులవుతారు. సామాన్యంగా ఉంటుంది. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. సాహస యాత్రలు చేస్తారు. ఆదాయానికి మించిన ఖర్చులు ఆందోళన కలిగిస్తాయి. ఉద్యోగులకు పనివత్తిడి ఉంటుంది. విలువైన వస్తువులు కొనుగోలు. దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని నిశ్చయించుకుంటారు. భూ వివాదాలు తీరుతాయి. చిరు వ్యాపారులకు పోటీ ఎదురైనా ఎవరి లాభాలు వారికుంటాయి.

## మకరం



వారమంతా ఉత్సాహంగా గడుస్తుంది. ఆరోగ్యం కుదుట పడుతుంది. వృత్తి విద్యల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. కుటుంబంలో కలతలకు అవకాశం, ఓర్పుతో వ్యవహరించండి. వ్యాపారులకు కొన్ని చోట్ల స్వల్ప నష్ట సూచనలున్నాయి. ముఖ్యమైన నిర్ణయాలు అమలు చేస్తారు. తీర్థ యాత్రలు చేయాలన్న కోరిక తీరుతుంది. ఉద్యోగులకు శ్రమకు తగిన ప్రతిఫలం లభించకపోవచ్చు. వ్యవసాయ భూమి కొనుగోలు చేస్తారు.

## కుంభం



వ్యాపారులకు శ్రమ అధికం. సాహస యాత్రలు చేస్తారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం మంచిది కాదు. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. ఉద్యోగాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. ఆకస్మిక సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి.

## మీనం



ఎన్ని అవాంతరాలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. అందరూ మీ మాటే వేదవాక్కులా ఆచరిస్తారు. సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. ఉద్యోగులకు పై అధికారుల వత్తిడి పెరుగుతుంది. వృథా కాలక్షేపం చేయకండి. కుటుంబంలో వివాదాలు తొలగిపోతాయి. దీర్ఘకాలిక సమస్యలు వారాంతంలో పరిష్కారమవుతాయి. దేశాంతర ప్రయాణం చేస్తారు. ప్రభుత్వ సంబంధమైన పనులు పూర్తి.

# సరదాగా కాసేపు నవ్వుకోండి



### షాపింగ్‌కెళ్దాం

"ఇవాళ మన పెళ్లిరోజు కదా సినిమాకు వెళ్దామా?" ప్రేమగా అడిగాడు భర్త.
"వద్దు డబ్బులు దండగ. ఎలాగో తర్వాత టీవీలో వస్తుందిగానీ ఎంచక్కా షాపింగ్‌కు వెళ్దాం" అంది కూల్‌గా భార్యామణి.

### తెల్లగా ఉండాలని..

"నీకేమన్నా మెంటలా? వంటపాత్రలకు పెయింట్ వేస్తున్నావు?" చిరాకుగా అడిగింది కమలమ్మ.
"మీరే కదమ్మా! పాత్రలు తెల్లగా తళ తళ మెరవాలన్నారు అందుకే వైట్ పెయింట్ వేస్తున్నాను.

**- దండెం రాజయ్య,** డోర్నకల్


### తన్నులు తిన్నాను

"రవీ, దీపావళి సందర్భంగా ఏయే వంటకాలు, పిండివంటలు తిన్నారు?" అడిగింది టీచర్.
"వంటకాలతో పాటు ఇంకోటి కూడా తిన్నాను" అన్నాడు రవి.
"ఏంటది?"
"నేను అంటించిన రాకెట్ ఎదురింట్లోకి వెళ్లి వారిని గాయపరిచింది. అప్పుడు వాళ్లు కొట్టారు. దాంతో వాళ్లతో తన్నులు తిన్నాను.

### లైఫ్ జాకెట్లు

కొందరు ప్రయాణికులు ఓ లాంచీలో ప్రయాణిస్తున్నారు. లాంచీకి రంధ్రం ఏర్పడి లోపలికి నీరు రావడం మొదలైంది. ఒక పావు గంటలో లాంచీ మొత్తం నీట్లో మునిగిపోబోతుంది. అప్పుడు అందులో వున్న వ్యక్తుల సంభాషణ.
మొదటి వ్యక్తి: నేను మునిగిపోతున్నాను కాబట్టి చివరిసారిగా నా కుటుంబ సభ్యుల్ని చూడాలని అనుకుంటున్నాను.
రెండవ వ్యక్తి: నాకు ఎప్పటి నుండో ఫారిన్ విస్కీ తాగాలని ఉంది. ఇప్పుడు దొరికితే బాగుండు.
మూడవ వ్యక్తి: ఈ లాంచీని తయారు చేసినవాడు ఇప్పుడు దొరికితే నేను చావడానికి ముందు వాడ్ని చంపేస్తాను.
నాలుగో వ్యక్తి: మీ వెధవ సోది ఆపి నీటి మీద తేలే జాకెట్లు ఇందులోనే ఉంటాయి. ముందు వాటిని వెదకండి.

**- ఎస్.యాకుబ్‌పాషా,** ఖమ్మం




### గేటు

కాంతం: అక్కా, నువ్వు ఇంట్లోనే ఉన్నావా?
భవాని: ఎందుకలా అడిగావు?
కాతం: బావ, గేటు దగ్గర నిలబడి దర్జాగా నవ్వుతుంటే డౌట్ వచ్చింది.

### ముగ్గు

తల్లి: అమ్మాయ్! వాకిట్లో ముగ్గులేస్తున్నట్టు నటించి ఎదురింటి కోటిని ముగ్గులోకి దింపాలి. అప్పుడుగానీ కట్నం లేకుండా నీ పెళ్లి అవుతుంది.
కూతురు: నేను ఆ పని మీద ఉన్నానమ్మా!
తల్లి: వెరీ గుడ్. మీ నాన్నని నేను అలాగే పెళ్లి చేసుకున్నాను.

### సరదాగా...

సుబ్బారావు: ఏం, అప్పారావు! సాయంత్రం రోజూ తొందరగా వెళ్లాలంటావు?
అప్పారావు: లాక్‌డౌన్‌లో సరదాగా వంట నేర్చుకున్నాను. అప్పటినుంచి మా ఆవిడ రాత్రి వంట నాకు అప్పజెప్పింది.
సుబ్బారావు: ఆ...

**- వైదా ఈశ్వరరావు,** మిండి, విశాఖపట్నం

### హోంలో ఉండట్లేదు..

టీచర్: "చింటూ! హోం వర్క్ ఎందుకు చేయటం లేదు?"
చింటు: "నేను హోంలో వుండటంలేదు టీచర్, ఇప్పుడు నేను హాస్టల్‌లో ఉంటున్నాను. అందుకే హోం వర్క్ చేయలేదు"

**టీచర్: ఆ...**

కిట్టు: అమ్మా! నేను ఫస్ట్ వచ్చాను.
తల్లి: చూసారా? మనబ్బాయి ఎంత తెలివైనవాడో. చదువులో ఫస్ట్ వచ్చాడట.
కిట్టు: చదువులో కాదమ్మా. బెల్ కొట్టగానే బడిలో నుంచి బయటకు పరుగెత్తి రావటంలో నేను ఫస్ట్ వచ్చాను.

**- మా.శ్రీ.రాజు,** పాల్వంచ

## జోక్స్‌కు ఆహ్వానం

మీరు పంపే జోక్స్ హాస్యాన్ని పండించేలా ఉండాలి.
కాపీ జోక్స్‌ను పంపకండి. చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080
sunmagvaartha@gmail.com

# సుందర మందిరం

సింగిల్ పేజి కథ

వి.శ్రీలక్ష్మి

సుందరం ఆఫీసు నుంచి అప్పుడే వచ్చాడు. గేటు తీసుకుని లోపలికి రాబోతున్నవాడల్లా తన చెయ్యి ఎవరో పట్టుకుని లాగుతున్నట్టు అనిపించి వెనక్కి తిరిగి చూసాడు. చందూ.. ఏడేళ్ల బాబు. ఎక్కడ ఆడుకుని వచ్చాడోగానీ బట్టలు బాగా మురికిగా వున్నాయి, జుట్టు చిందర వందరగా ముఖం మీద పడుతున్నది. ఆ ముఖం సుందరం కనిపించినందుకు ఆనందంతో వెలిగిపోతున్నది. వాడికి సుందరం అంటే పిచ్చి ప్రేమ. కనిపించగానే వచ్చి చేతులతో చుట్టేస్తాడు. వాడిని చూస్తే కన్నపిల్లల కన్నా వీడే నయం అన్న భావన కలుగుతుంది సుందరానికి. వాడు ఎప్పుడు వచ్చినా ఎంతో ప్రేమగా చేరదీసి మాట్లాడతాడు. వాళ్లది విడదీయలేని బంధం.

మాటలురాని, సరిగ్గా అర్థం చేసుకోలేని వాడి అమాయకమైన మొహం ఏదో చెప్పాలని, చెప్పలేకపోతున్న వాడి హావ భావాలు సుందరాన్ని ఎంతో బాధ పెడతాయి. అందరిలా వాడిని చూసి చీదరించుకోకుండా దగ్గరికి చేరదీసి వాడితో కబుర్లు చెబుతూ అర్థంకాని వాడి పలుకులు అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. వాడితో కాసేపు ఆడుకుంటాడు. ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు వాడి కోసం పండో, ఫలమో తప్పకుండా తీసుకురాకుండా వుండడు.

సుందరం వుండే అపార్ట్‌మెంట్ తాలుకూ వాచ్‌మెన్ కొడుకు చందూ, వాడితో పాటు ఇంట్లోకి వచ్చిన సుందరాన్ని చూడగానే మీనా అంటే సుందరం భార్య, మొహం చిరాగ్గా పెట్టింది. "మీతో పాటు తయారయ్యాడా వీడూ, ఏదో ఒకటి చెప్పి తొందరగా పంపించండి వాణ్ణి. ఇప్పుడు మా ఫ్రెండ్స్ నలుగురైదుగురు వస్తున్నారు. ఇల్లు నీటుగా సర్దుకున్నాను. అవీ ఇవీ ముట్టుకుని పాడు చేస్తాడు" అని మరో గదిలోకి వెళ్లిపోయింది హడావుడిగా. సుందరానికి ఆమె తీరు అలవాటే. తనకి చందూ అంటే అస్సలు పడదు. సరేలే.. ఎప్పుడూ వున్నదే అనుకుంటూ లోపలికి వెళ్లి వాడి కోసం దాచిపెట్టిన చాక్లెట్లు తెచ్చిచ్చి పంపించేసాడు. సంతోషంతో వెళ్లిపోయాడు చందు.

సుందరం లోపలికి వెళ్లి డ్రెస్ మార్చుకుని వచ్చి టి.వి.ఎదురుగా కూర్చుని ఛానల్సు మారుస్తూ ఎవరొస్తున్నారేంటి? అక్కడే వున్న భార్య మీనాని అడిగాడు.

"మా చిన్ననాటి ఫ్రెండ్స్, చాలా ఏళ్ల తరువాత కలుసుకుంటున్నాం. అయినా మీకు ఇలాంటి విషయాలు చెప్పడం దండగ. ఎప్పుడూ పనికిమాలిన వాళ్లని వెంటేసుకుని తిరుగుతుంటారుగా. ఏదో ఉద్ధరించినట్టు అక్కసుగా అంది. సుందరానికి ఎప్పుడూ డబ్బు కోసం ఆరాటపడే వాళ్లంటే అయిష్టం. వాళ్లతో అంటీ ముట్టనట్టుంటాడు. కానీ వాళ్లంటే జాలి, వాళ్లకి ఏదో సహాయాలని ఆరాటపడతాడు. తనకు తోచినంత మాట సహాయం చేస్తాడు కాదనకుండా. అది నచ్చదు మీనాకి. ఎందుకు ఆ పనికిమాలిన పనులు, పనికొచ్చేవి చేయొచ్చుగా అని సణుగుతుంటుంది.

సరేగానీ నీ సణుగుడు ఎప్పుడూ వుండేదే. తినడానికి ఏదైనా పెట్టు.. బాగా ఆకలిగా వుంది. నేను చేయకపోయినా దేశాన్ని ఉద్ధరించడానికి చాలా మంది వున్నారుగా. ఎవరో ఒకరు, ఇద్దరు వుంటే చాలు. అందరూ అవసరం లేదు" ఛానల్సు మారుస్తూ అన్నాడు.

మీనాకి ఒళ్లు మండింది. భర్త సంగతి తెలుసు కాబట్టి అక్కడితో మాటలకి ఫుల్ స్టాప్ పెట్టి పనిలో పడింది. అతడికి తినడానికి ఇచ్చి మళ్లీ ఇల్లు సర్దడంలో పడింది. ఇంతలో మీనా ఎదురు చూస్తున్న ఫ్రెండ్స్ రానే వచ్చారు. వాళ్లకి మర్యాదలు చేసి భర్తని పరిచయం చేసింది.


తరువాత అందరూ కబుర్లలో పడ్డారు. పాత సంగతులు నెమరు వేసుకున్నారు. పాటలు పాడుకున్నారు, నవ్వుకున్నారు. కొంత సమయం గడిచాక మీనా ఇచ్చిన ఫలహారాలు తిని టాటా, బైబైలు చెప్పుకుని విడిపోయారు.


నిట్టూరుస్తూ భర్త కోసం చూసింది. బెడ్‌రూంలో హాయిగా నిద్రపోతున్నాడు. పాపం.. ఆకలేస్తుందేమో! అనుకుని వడ్డించే ప్రయత్నంలో పడింది. నిద్రమత్తులో వున్నాడేమో! నాలుగు ముద్దలు గబగబా తిని మళ్లీ పడుకున్నాడు. మీనాకి ఎంతకీ నిద్ర పట్టలేదు. ఫ్రెండ్స్‌తో మాట్లాడుకున్న మాటలు గుర్తుకు వస్తున్నాయి. కాలేజీ రోజుల్లో తను కథలు రాసేది. మేగజైన్‌లో పడేవి. ఆ ఉత్సాహంతో పత్రికలకీ పంపింది, కానీ అచ్చు కాలేదు. నిరాశపడి రాయడం మానేసింది. తరువాత పెళ్లి, సంసారంలో పడి కథలకి కామా పెట్టేసింది. సంసార సాగరంలో పడిపోయింది. భర్తకి ఆఫీసు, సమాజ సేవ, వ్యక్తిత్వ వికాసం అని కాలేజ్‌లో స్పీచ్‌లు ఇచ్చి వస్తుంటాడు. బయట అతడికి మంచి పేరు వుంది.


ఏవేవో ఆలోచిస్తున్న మీనాకి మళ్లీ కథలు రాసి పత్రికలకి పంపి, పేరు తెచ్చుకోవాలని బలీయమైన కోరిక కలిగింది. ఆవిడలోని రచయిత్రి మళ్లీ నిద్ర లేచింది. అనుకున్నదే తడవుగా మొదలుపెట్టేసింది. పంపగా పంపగా ఓ కథ అచ్చయింది. సాయంత్రం వచ్చిన భర్తకి టిఫిన్, కాఫీ ఇచ్చిన తరువాత కథ కూడా ఇచ్చి చదవమంది. "అచ్చా! నువ్వు కథలు కూడా రాస్తావా?" అని మెచ్చు కుంటూ గబగబా చదివాడు.

ఆ రోజు ఎవరో తలుపు కొడుతుంటే వెళ్లి తలుపు తీసింది. ఎదురుగా ముక్కు చీమిడి కారుతుంటే తుడుచుకుంటూ చందూ నవ్వుతూ "సారు..సారు" అంటున్నాడు. "మీ సారు రాలేదు" అని తలుపు వేసేసింది. మరో అరగంటకి సుందరం వచ్చాడు. సుందరం వుంటే వాడు నిర్భయంగా ఇంట్లో తిరుగుతాడు. సుందరం వెంటే తిరుగుతాడు. ఏవేవో ప్రశ్నలు వేస్తాడు. సుందరం విసుక్కోకుండా జవాబులు చెప్తాడు. వాడి అవతారాన్ని చూసిన మీనా వాడిని కొట్టిది. సుందరం ఒక్కసారి గట్టిగా అరిచాడు. "మీనా! ఏం చేసావు, చంటివాడిని అభం శుభం తెలియనివాడిని, మాయామర్మం ఏమీ అర్థం చేసుకోలేని–ాడిని నీ మాటలతో చేతలతో హింసిస్తావా? నీలో మానవత్వం వుందా? కథలు రాస్తే సరిపోదు, అందులోని వ్యక్తుల్లా ప్రవర్తించాలి. అప్పుడే నీలో గొప్పదనం బయట పడుతుంది. అర్థం చేసుకో! ఇంకెప్పుడు వాడి మీద చెయ్యి చేసుకుంటే ఒప్పుకోను" అని గబగబా చెప్పులు వేసుకొని చందూ వెళ్లిన వైపు వాడిని వెదుక్కుంటూ వెళ్లిపోయాడు.

మీనా నిశ్చేష్టగా నిలబడిపోయింది. అవును.. తనలో ఏమాత్రం మానవత్వం లేదని అర్థమయింది అనుకుంటూ అక్కడే వున్న కుర్చీలో కూలబడిపోయింది. అవును.. నేను మారాలి. అప్పుడే మళ్లీ నేను కథలు రాస్తాను. ❑



..మటాషా..? మా పల్లెల్లో అవేమీ మాకు తెలియదు...సాయంత్రం
మస్తాన్, యేసు బాబు కలుసుకున్నాం అంటే.. మజానే.. మజా...!!
Zakir...


..బాగానే వెనకేసుకున్నాడు...!!


బ్రిటన్ ప్రధానో, మైక్రోసాఫ్ట్ సీఈవో నో అంటే కుదరదు...
రీజనబుల్ టార్గెట్స్ పెట్టుకోరాదే..!!
Zakir...

ఈ వారం కా'ర్ట్యా న్స్'







చైనాలోని గ్వాంగ్‌జౌ నగర అందాలను పూర్తిగా ఆస్వాదించాలంటే ఇక్కడ కనిపిస్తున్న బబుల్ ట్రామ్ ఎక్కాల్సిందే. సుమారు రెండు వేల అడుగుల ఎత్తులో ఉన్న పర్వతాలపై నుండి ప్రయాణిస్తుంది ఈ బబుల్ ట్రామ్.



